ప్రతిపక్షం

www.prathipaksham.in

శుక్రవారం 20.02.2026 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 331 పేజీలు:10 | ₹5

@prathipaksham | prathipaksham tv telugu

హర్మన్.. నంబర్ వన్ 10

ఉచితాల వల్ల అభివృద్ధికి విఘాతం

- ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి పెట్టండి
- అప్పుల్లో ఉండి కూడా డబ్బు పంపిణీ చేయడం ఆందోళనకరం
- ఉచితాలపై రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచన
- తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ పిటిషన్ పై విచారణ

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 :దేశ ఆర్థికాభివృద్ధిని దెబ్బతీసే విధంగా ఉచితాల పంపిణీ చేయడం సమంజసం కాదని సుప్రీంకోర్టు వ్యాఖ్యనించింది. రాష్ట్రాలు ఉచితాలకంటే ఉపాధి అవకాశాల సృష్టిపై దృష్టి పెట్టాలని సూచించింది. రాష్ట్రాలు ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పనిచేయాలని ధర్మాసనం స్పష్టం చేసింది. అన్నీ ఉచితంగా పంచుకుంటూపోతే అభివృద్ధి కార్యక్రమాలకు ఒక్క పైసా మిగలదని పేర్కొంది. ఇది ఒక్క తమిళనాడు సమస్యే కాదని, అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉందని

...:: మిగతా 2లో

రేవంత్ ప్రభుత్వం పనితీరు భేష్

తెలంగాణ ప్రజా పాలనకు కితాబు

మున్సిపల్ ఫలితాలపై సంతృప్తి

- సమష్టిగా పనిచేస్తే అద్భుత ఫలితాలు
- తెలంగాణ ప్రజా పాలనకు కితాబు
- పథకాలు, రాబోయే ఎన్నికలపై చర్చ
- రైతు సంక్షేమంపై రాజీపడవద్దని దిశానిర్దేశం
- కాంగ్రెస్‌అగ్రనేతలు రాహుల్, ఖర్గే ప్రశంసలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 19: తెలంగాణలో ప్రజా పాలన భేషుగ్గా సాగుతోందని మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ ప్రశంసించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం సమిష్టిగా పనిచేస్తోందని కితాబిచ్చారు. గురువారం ఢిల్లీలోని ఖర్గే నివాసంలో జరిగిన కీలక సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ పనితీరు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాబోయే ఎన్నికల వ్యూహాలపై విస్తృత చర్చ జరిగింది. సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ తో పాటు మంత్రులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా పాలన బలంగా అమలవుతోందని అగ్రనేతలు

...:: మిగతా 2లో

ఎస్ఐఆర్‌కు సిద్ధంగా ఉండండి

- సన్నాహక పనులు త్వరగా పూర్తి చేయండి
- ఏపీ, తెలంగాణ సహా 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈసీ సూచన

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 : ఓటరు జాబితాకు సంబంధించి దేశవ్యాప్తంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) నిర్వహించనున్నట్లు ప్రకటించిన ఎన్నికల కమిషన్,ఎస్ఐఆర్‌కు సంబంధించి సన్నాహక పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఏపీ, తెలంగాణ సహా 22 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. 22 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ పూర్తయితే దేశమంతా ఆ ప్రక్రియ సంపూర్ణమవుతుంది. ఎస్ఐఆర్ ప్రక్రియ బిహార్‌లో పూర్తి కాగా మరో 9 రాష్ట్రాల్లో కొనసాగుతోంది. అసోంలో ఎస్ఐఆర్ స్థానంలో నిర్వహించిన ఎస్ఆర్

...:: మిగతా 2లో

ఏఐ రంగంలో భారత్ పాత్ర కీలకం

ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూఎన్ చీఫ్ ఆంటోనియో గుటెరస్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితరులు కీలక ప్రసంగం చేశారు.

9

డిజిటల్ ఆర్థిక వ్యవస్థను సాధ్యం చేసిన భారత్

భారత దేశంలో డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పురోగతిపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రశంసలు కురిపించారు. 140 కోట్ల ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీని తీసుకువచ్చిందని అన్నారు.

9

సిద్దిపేట బరిలో కవిత!

- సంచలన ఎంట్రీకి సంకేతం
- మే మొదటి వారంలో పార్టీ ప్రకటన
- మా పార్టీ మదర్ బోర్డ్ తెలంగాణ
- బోధన్, సిద్దిపేట.. ఎక్కడి నుంచైనా పోటీ
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను ప్రశ్నిస్తూనే ఉంటాం
- పలువురు బీఆర్ఎస్ నేతలు టచ్‌లో ఉన్నారు
- ఇప్పుడు రాష్ట్రంలో మేమే ప్రధాన ప్రతిపక్షం
- మీడియా చిట్‌చాట్‌లో జాగృతి అధ్యక్షురాలు కవిత

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో హైదరాబాద్, ఫిబ్రవరి 19: జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సిద్దిపేట నుంచే బరిలోకి దిగాలని నిర్ణయించుకోవడం రాజకీయ వర్గాల్లో సంచలనం రేపుతోంది. "ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. ఎవరు అడ్డొచ్చినా. ఇది నా గడ్డ" అనే ధీటైన సంకేతంతో కవిత ముందడుగు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. సిద్దిపేటను తమ అడ్డా, తమ కంచుకోటగా భావిస్తున్న రాజకీయ ప్రత్యర్థులకు సవాల్ విసురుతూ "సిద్దిపేట కంచుకోట కవిత కంచుకోటగా మారుతుంది" అనే ధీమాతో

...:: మిగతా 2లో

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- గత ప్రభుత్వం బిల్లు పెట్టింది, గవర్నర్ ఆమోదించలేదు
- విలీనం చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు
- రవాణాశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ భాధ్యత తీసుకోవాలి
- మేఘా కృష్ణారెడ్డికి ఆర్టీసీని ధారాధత్తం చేసే కుట్ర
- 'మహాలక్ష్మి' వచ్చాక ఆర్టీసీకి ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం ఇవ్వాలి
- 24న ఆర్టీసీ కార్మికుల 'చలో సెక్రటేరియేట్' కు సంపూర్ణ మద్దతు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

...:: 2లో

విమాన సర్వీసులకు అంతరాయం

నెవిటేర్ వ్యవస్థలో సాంకేతిక లోపం కారణంగా యూరప్ తోపాటు ఢిల్లీ, ముంబై సహా దేశంలోని ఎయిర్‌పోర్టుల లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దాంతో వేలమంది ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

9

ఏఐ నైతిక వినియోగానికి సమగ్ర రోడ్‌మ్యాప్ అవసరం

బ్లాక్ బాక్స్ కాదు గ్లాస్ బాక్స్ విధానం కావాలి

ఏఐ వినియోగానికి ప్రధాని మోదీ సూచనలు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 : ఆర్టిఫిషియల్ఇంటిలిజెన్స్‌లో అనైతిక ప్రవర్తనకు అవకాశం అపరిమితంగా ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అందుకోసమే ఏఐ వినియోగానికి సమగ్ర రోడ్‌మ్యాప్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని మోదీ అభిప్రాయపడ్డారు. మానవ విలువలు, సరైన మార్గదర్శకత్వం లేకుండా సాంకేతికతను ఉపయోగిస్తే అది స్వీయ విధ్వంసకరంగా మారవచ్చని హెచ్చరించారు. మనకు బ్లాక్ బాక్స్‌కు బదులుగా గ్లాస్ బాక్స్ విధానం అవసరం. అందులో భద్రతా నియమాలను ధ్రువీకరించవచ్చు. జవాబుదారీతనం మరింత స్పష్టంగా

...:: మిగతా 2లో

26 నుంచి అసెంబ్లీ

- 28న బడ్జెట్‌ప్రవేశపెట్టనున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- 10 నుంచి 15 రోజులు సమావేశాలు
- రూ.3.15 లక్షల కోట్లతో భారీ బడ్జెట్!

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 26న రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రసంగంతో ఉభయ సభలు మొదలుకానున్నాయి. 28న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార శాసనసభలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి

...:: మిగతా 2లో

కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టులు మృతి.. కర్రెగుట్టల్లో 5 వేల మంది సీఆర్పీఎఫ్ బలగాలు

మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, సోది కోసం కూంబింగ్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 : చత్తీస్ గఢ్ తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో గురువారం భారీ ఎన్ కౌంటర్ జరిగింది. ఎన్ కౌంటర్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందారని, మృతుల్లో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారని భద్రతా బలగాలు తెలిపాయి. ఎన్ కౌంటర్ ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. 'నక్సల్ రహిత భారత్' లక్ష్యంలో భాగంగా చేపట్టిన 'ఆపరేషన్ కగార్2'లో భాగంగా కూబింగ్ ఆపరేషన్ చేపడుతుండగా.. గురువారం తెల్లవారుజామున ఎదురు కాల్పులు ప్రారంభమయ్యాయి. ఆపరేషన్ కగార్ కు మార్చి 31 వరకే గడువు మిగిలిన నేపథ్యంలో కర్రెగుట్టల్లో దాగిన మావోయిస్టుల ఏరివేతకు

...:: మిగతా 3లో

దేశం విడిచి వెళ్లను

ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేశారు. రూ.40 వేల కోట్ల మోసం కేసుల్లో అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ప్రమేయం ఉందని ఆరోపణలున్నాయి.

9

ప్రజా తీర్పును కాలరాస్తున్న ప్రభుత్వం

- ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది
- బాల్క సుమన్‌ను పరామర్శించి మాజీ మంత్రి
- క్యాతన్పల్లి ఎన్నికను వాయిదా వేసేలా కుట్ర
- మాజీ మంత్రి హరీష్ రావు ఫైర్

ప్రతిపక్షం ప్రతినిధి, ఆదిలాబాద్

ఫిబ్రవరి 19: క్యాతన్‌పల్లి మున్సిపల్ పరిణామాలు, బాల్క సుమన్ అరెస్ట్ ఘటనల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వంపై మాజీ మంత్రి, అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, పోలీసులను రాజకీయంగా వినియోగిస్తున్నారని ఆరోపించారు. ఆదిలాబాద్ సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న బాల్క సుమన్‌ను పరామర్శించిన అనంతరం ఆయన

...:: మిగతా 3లో

బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించాలి

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ
- 95 శాతం హామీలు పెండింగ్‌లోనే
- ఈసారి బడ్జెట్‌లో అమలు చూపాలి
- బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, ఫిబ్రవరి 19: రాబోయే 2026-27 బడ్జెట్‌లో ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుకు తగిన నిధులు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో 95 శాతం అమలు కాలేదని ఆరోపించిన ఆయన, ఈసారి కూడా కేటాయింపులు లేకపోతే ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

...:: మిగతా 2లో

రాజకీయం

రేవంత్ ప్రభుత్వం పనితీరు భేష్

మొదటిపేజీ తరువాయి

అభినందించారు. ముఖ్యంగా రైతు సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని రాహుల్ గాంధీ, ఖర్గే స్పష్టంగా సూచించారు. వరి ధాన్యం సాగు, కొనుగోలు అంశాలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. రైతులకు మద్దతు ధర, కొనుగోలు వ్యవస్థలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆయిల్ ఫామ్ పంటను ప్రోత్సహిస్తున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు.

మున్సిపల్ ఫలితాలపై సంతృప్తి

తెలంగాణలో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు సానుకూలంగా ఉన్నాయని ఏఐసీసీ నేతలు పేర్కొన్నారు. పంచాయితీ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికల్లో విజయబావుటా ఎగురవేయడంలో సమిష్టి కృషే కారణమని అభినందించారు. "లోకల్ బాడీ ఎన్నికల్లో గెలవాలంటే క్షేత్రస్థాయిలో బలంగా ఉండాలి. నేతలు సమష్టిగా పనిచేస్తే అద్భుత ఫలితాలు సాధ్యమే" అని ఖర్గే మార్గనిర్దేశం చేశారు. గ్రేటర్ ఎన్నికలు ముందుగా జరపాలా? లేక ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ముందుగా నిర్వహించాలా? అన్న అంశాన్ని కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకోవాలని అభిప్రాయం వ్యక్తమైంది. శాఖల వారీగా మంత్రుల నిర్ణయాలను రాహుల్ గాంధీ అడిగి తెలుసుకున్నారు. పార్టీని మరింత బలోపేతం చేయాలని, ప్రజల అభిప్రాయాన్ని నేరుగా తెలుసుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కేబినెట్ మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు సమన్వయంతో పనిచేస్తున్నారని అగ్రనేతలు అభినందించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సంక్షేమం, అభివృద్ధి రెండు చక్రాల్లా ముందుకు తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. ఢిల్లీ వేదికగా తెలంగాణ ప్రభుత్వానికి లభించిన ఈ ప్రశంసలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

ఉచితాల వల్ల అభివృద్ధికి విఘాతం

మొదటిపేజీ తరువాయి

తెలిపింది. ఉచిత ఆహారం, సైకిళ్లు, విద్యుత్‌కు బదులు ఉపాధి సృష్టి కోసం కృషి చేయాలని రాష్ట్రాలకు సుప్రీంకోర్టు సూచించింది. తమిళనాడు ఎన్నికల వేళ డీఎంకే ఉచిత విద్యుత్ ప్రతిపాదనపై దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ మేరకు వ్యాఖ్యలు చేసింది. ఎలక్ట్రిసిటీ అమెండ్‌మెంట్ రూల్స్ 2024లోని రూల్ 23ను సవాలు చేస్తూ తమిళనాడు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను గురువారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ విపుల్ పంచోలితో కూడిన ధర్మాసనం విచారించింది. తమిళనాడు ప్రభుత్వ తరపున సీనియర్ అడ్వకేట్ గోపాల్ సుబ్రమణియం వాదనలు వినిపించారు. బిల్లు చెల్లించలేని పేదలకు సహాయం చేయడం అర్థవంతమైన చర్య అని, కానీ, కానీ ఆర్థిక స్థోమత ఉన్న వారికీ, లేనివారికీ తేడా లేకుండా ఉచితాలు ఇవ్వడం సరైందా? అంటూ సీజేఐ ప్రశ్నించారు. ఈ మేరకు తమిళనాడు విద్యుత్ సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై వివరణ ఇవ్వాలంటూ కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రాలు అప్పుల్లో ఉండి కూడా డబ్బు పంపిణీ చేయడంపై సీజేఐ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధులను సాగునీరు, విద్యుత్ వంటి దీర్ఘకాలిక అభివృద్ధి పనులకు ఎందుకు కేటాయించకూడదని అడిగారు. డైరెక్ట్ క్యాష్ ట్రాన్స్‌ఫర్ (నగదు బదిలీ) విధానాలపై కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ప్రజలు గౌరవంగా బతకడానికి మీరు ఉపాధి మార్గాలను సృష్టించాలి. ఉదయం లేచినప్పటి నుంచి ఉచిత ఆహారం, గ్యాస్, విద్యుత్ ఇస్తూ నేరుగా ఖాతాల్లోకి నగదు జమ చేస్తుంటే, ప్రజలు ఎందుకు పని చేస్తారు? ప్రతిదీ ఉచితంగా దొరుకుతున్నప్పుడు వారు ఏం పని చేస్తారు. మనం చేస్తున్నది దేశ నిర్మాణమేనా?' అని సీజేఐ ప్రశ్నించారు.

ఆర్థిక వ్యవస్థకు భారం..

దేశంలోని చాలా రాష్ట్రాలు ఇప్పటికే రెవెన్యూ లోటుతో ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లోనూ అభివృద్ధి కార్యక్రమాలను పక్కనబెట్టి ఉచితాల పంపిణీ చేయడం ఆర్థిక వ్యవస్థకు భారం అవుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఆదాయ మిగులు రాష్ట్రం అయినప్పటికీ, ఆ మొత్తాన్ని రోడ్లు, ఆసుపత్రులు, పాఠశాలల అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన బాధ్యత మీకు లేదా? అని తమిళనాడు ప్రభుత్వాన్ని సీజేఐ ప్రశ్నించారు. పిల్లలకు విద్య అందించడం, మెడికల్ కాలేజీల్లో సీట్లు సాధించిన పేద విద్యార్థులకు సహాయం చేయడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని, అయితే సంపన్నులకు కూడా ఉచితాలు అందడంపై సీజేఐ ప్రశ్నలు కురిపించారు. ఇలాంటి విధానపరమైన అంశాలను రాష్ట్రాలు పునఃసమీక్షించాల్సిన సమయం ఆసన్నం కాలేదా? అని అడిగారు. సేవలు పొందే వ్యక్తి తప్పనిసరిగా చెల్లింపులు చేయాలనేది ప్రాథమిక సూత్రమని సీజేఐ పేర్కొన్నారు. రాష్ట్రాలు లాభాపేక్షతో ఉండాలని తాము చెప్పడం లేదని, కనీసం స్థోమత ఉన్న వారి నుంచి ఖర్చులనైనా వసూలు చేయాలని సూచించారు.

ఎస్ఐఆర్‌కు సిద్ధంగా ఉండండి

మొదటిపేజీ తరువాయి

ఈనెల 10న పూర్తయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. మూడోదశలో ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నాగర్ హవేలీ, డామన్ డయ్యూ, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, ఝార్ఖండ్, కర్ణాటక, లద్దాఖ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, దిల్లీ, ఒడిశా, పంజాబ్, సిక్కిం, త్రిపుర, తెలంగాణ, ఉత్తరాఖండ్‌లో ఎస్ఐఆర్‌ను నిర్వహించనున్నారు. ఈ విషయంపై ప్రధాన ఎన్నికల అధికారులకు రాసిన లేఖలో, పాన్ఇండియా ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ ని గత సంవత్సరం జూన్‌లో ఆదేశించినట్లు పోల్ అథారిటీ ఓ ప్రకటనలో తెలిపింది.

అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దు
బంగాల్ ప్రభుత్వానికి సుప్రీం హెచ్చరిక

ఇదిలా ఉండగా, కొద్దిరోజుల క్రితం, బంగాల్‌లో నిర్వహిస్తోన్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీం కోర్టు విచారణ జరిపింది. ఈ నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. సర్ ప్రక్రియలో ఏవైనా ఆదేశాలు, స్పష్టత అవసరమైతే తాము జోక్యం చేసుకుంటామని తెలిపింది. అంతేకానీ ఎస్ఐఆర్ కసరత్తులో అడ్డంకులు కల్పించే ప్రయత్నాలు చేయవద్దని బంగాల్ ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ విషయాన్ని అన్ని రాష్ట్రాలు అర్థం చేసుకోవాలని పేర్కొంది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ ఎన్‌వీ అంజారియా నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. మరోవైపు, ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం దాదాపు 300మంది అధికారులను కేటాయించాలని బంగాల్ ప్రభుత్వాన్ని కోరితే, కేవలం 80 మంది గ్రేడ్2 స్థాయి అధికారులనే కేటాయించిందని న్యాయస్థానానికి ఎన్నికల కమిషన్ తెలిపింది. మరోవైపు ఈసీ అధికారులు రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని బంగాల్ ప్రభుత్వం పేర్కొంది. అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని తెలిపింది. ఇంటి పేర్లలో అక్షరదోషాలు, వివాహం తర్వాత మహిళల చిరునామాల్లో మార్పు వంటి చిన్న లోపాలను సాకుగా చూపి ఓట్లు తొలగిస్తున్నారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. దీనివల్ల 1.36 కోట్ల మంది ఓటర్లు ప్రభావితమయ్యే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. తమ స్థానికతను నిరూపించుకోవడానికి ఓటర్లకు ఎన్నికల కమిషన్ ఒక్క అవకాశము కూడా ఇవ్వలేదని బంగాల్ సర్కార్ న్యాయస్థానానికి తెలియజేసింది. దీనిపై సుప్రీం కోర్టు స్పందిస్తూ రాష్ట్రంలో ఓటర్ల దరఖాస్తులు పూర్తి చేయడానికి, డేటాను ఖరారు చేయడానికి గడువును ఒక వారం పొడిగిస్తున్నట్లు పేర్కొంది.

ఏఐ నైతిక వినియోగానికి సమగ్ర రోడ్‌మ్యాప్ అవసరం

మొదటిపేజీ తరువాయి

మారుతుంది. వ్యాపారంలో నైతిక ప్రవర్తన కూడా మెరుగపడుతుంది. మనం ఏఐకి ఆకాశమే హద్దుగా ఎదిగే ఆకాశాన్ని ఇవ్వాలి, కానీ అదే సమయంలో మన చేతుల్లోనే పగ్గాలు ఉంచుకోవాలి. అందుకే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు తప్పనిసరిగా మానవ విలువలు, స్పష్టమైన దిశ ఉండాలని చెప్పారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో భాగంగా నిర్వహించిన లీడర్స్ ప్లీనరీలో ప్రధాని మోదీ ప్రసంగించారు. డేటా సార్వభౌమత్వాన్ని గౌరవించడం సహా పారదర్శక భద్రతా నియమాలను రూపొందించాలని సూచించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో నిర్వహిస్తున్న ఐదు రోజుల ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు 2026లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్నారు. గూగుల్, ఓపెన్‌ఏఐ, ఆంథ్రోపిక్ సీఈవోలు సుందర్ పిచాయ్, సామ్ ఆల్ట్‌మన్, దారియో అమోడీ సహా పలువురు ప్రపంచ టెక్ దిగ్గజాలతో మోదీ గ్రూప్ ఫోటో దిగారు. ఈ సదస్సుకు ఐరాస చీఫ్ అంటోనియో గుటెరెస్, ఫ్రాన్స్, బ్రెజిల్, శ్రీలంక అధ్యక్షులు ఎమ్మాన్యుయేల్ మేక్రాన్, లులా డాసిల్వా, అనుర కుమార దిసానాయకే సహా భూటాన్, ఫిన్లాండ్, మారిషస్, క్రొయేషియా, సీషెల్స్, సెర్బియా, ఎస్టోనియా దేశాల అధినేతలు హాజరయ్యారు.

మానవ్ విజన్ ఉండాలని చెప్పిన ప్రధాని మోదీ

అంతకుముందు కృత్రిమ మేధ వినియోగంలో 'మానవ్ విజన్' ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఈ విజన్ అర్థం, ఫ్రేమ్‌వర్క్‌ను కూడా ఆయన వివరించారు. మోరల్ అండ్ ఎథికల్ సిస్టమ్: నైతిక విలువలు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థలకు మార్గనిర్దేశం చేయాలి. అకౌంటబుల్: పారదర్శక నిబంధనలు రూపొందించి, జవాబుదారీతనంతో ఏఐ వ్యవస్థలు పనిచేసేలా చూడాలి. నేషనల్ సావర్నిటీ: ఒక దేశంలో సృష్టించిన డేటా ఆ దేశానికే చెందాలి. ఆ దేశ పరిధిలోనే ఉండేలా చూడాలి. యాక్సెసిబుల్ అండ్ ఇంక్లూజివ్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వ్యవస్థలు గుత్తాధిపత్యంతో పని చేయకుండా అన్ని వర్గాల వారికీ అందుబాటులోకి రావాలి. వేలిడ్ అండ్ లెజిటిమేట్: ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ చట్టబద్ధంగా, విశ్వసనీయమైనదిగా పనిచేయాలి. నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలని వివరించారు. ఈ క్రమంలోనే యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (UPI) సామర్థ్యాన్ని ప్రధాని మోదీ ప్రశంసించారు. అనేక గడ్డు పరిస్థితులను దాటుకుని భారత్ ఇప్పుడు సులభంగా లావాదేవీలు నిర్వహిస్తుందని గుర్తుచేశారు. డిజిటల్ అంతరాన్ని తగ్గించడంలో యూపీఐ కీలక పాత్ర పోషించిందని చెప్పారు.

భారత స్టార్ క్రికెటర్ అభిషేక్ శర్మ మానసిక సమస్య వల్ల పరుగులు చేయలేకపోతున్నారు. మూడు డకౌట్లు మానసికంగా ఇబ్బందిపెడతాయి. అభిషేక్ మంచి హిట్టర్. అతడు తన గత ప్రదర్శనలు గుర్తు చేసుకోవాలి. తన భారీ ఇన్నింగ్సుల వీడియోలను తెప్పించుకుని చూడాలి. తాను ఎంత గొప్ప బ్యాటర్ అనేది అభిషేక్ గుర్తు చేసుకోవాలి.
- ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ నాసర్ హుసేన్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- గత ప్రభుత్వం బిల్లు పెట్టింది, గవర్నర్ ఆమోదించలేదు
- విలీనం చేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు
- రవాణాశాఖ మంత్రిగా పొన్నం ప్రభాకర్ బాధ్యత తీసుకోవాలి
- మేఘా కృష్ణారెడ్డికి ఆర్టీసీని ధారాధత్తం చేసే కుట్ర
- 'మహాలక్ష్మి' వచ్చాక ఆర్టీసీకి ఇచ్చిన నిధులపై శ్వేత పత్రం ఇవ్వాలి
- 24న ఆర్టీసీ కార్మికుల 'చలో సెక్రటేరియేట్' కు సంపూర్ణ మద్దతు
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 19: ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీని విలీనం చేస్తామని మాట ఇచ్చారని ఈ సందర్భంగా కవిత గుర్తు చేశారు. ఈనెల 26 న రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశ పెట్టనున్న సందర్భంగా ప్రతిరోజు ఒక అంశాన్ని ఆమె ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నారు. తెలంగాణ జాగృతి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. గత ప్రభుత్వమే ఆర్టీసీ విలీన ప్రక్రియ బిల్లును పూర్తి చేసిందని, దానికి గవర్నర్ ఆమోదం తెలుపలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బిల్లు ఆమోదం అయ్యేలా చేస్తే సరిపోతుందని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగుల విషయంలో రేవంత్ సర్కార్ అమానవీయంగా ప్రవర్తిస్తుందని మండిపడ్డారు. ఆర్టీసీ ఆర్టీసీ ఉద్యోగుల కాళ్లకు ముల్లు గుచ్చితే పంటితో తీస్తా అని చెప్పిన రేవంత్ రెడ్డి ఇప్పుడు వారి గుండెకు గాయమైన సరే పట్టించుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహాలక్ష్మి పథకం మొదలైన నాటి నుంచి ఆర్టీసీ ఉద్యోగులపై ఒత్తిడి పెరిగిందన్నారు. చిన్న కారణాలకే వారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారంటూ మండిపడ్డారు. ఒత్తిడి తట్టుకోలేక డ్రైవర్లు హార్ట్ ఆటాక్ తో చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 16 నుంచి 18 గంటలు పనిచేయిస్తూ ఆర్టీసీ కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నారని అన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బంది పెట్టవద్దని, చిన్న వారిపై ప్రతాపం చూపవద్దని ప్రభుత్వానికి సూచించారు. చిన్న కారణాలకే ఉద్యోగాలు తొలగించిన వారందరినీ వెంటనే ఉద్యోగాల్లోకి తీసుకోవాలని కవిత కోరారు. ఈ నెల 24 న ఆర్టీసీ ఉద్యోగులు తలపెట్టిన ఛలో సెక్రటేరియేట్ కార్యక్రమానికి జాగృతి పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. అదే విధంగా వారి రిటైర్ మెంట్ బెనిఫిట్స్, జీతాలు పెంపు, పొదుపు చేసుకున్న సొమ్ము ఇచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారు ఆర్టీసీ ఉద్యోగుల సమస్య పరిష్కారం కోసం బాధ్యత తీసుకోవాలని కోరారు.

శ్వేతపత్రం విడుదల చేయాలి...

మహాలక్ష్మి పథకం పెట్టి ఆర్టీసీకి 3 వందల కోట్లు ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని గుర్తు చేశారు. కానీ ఆక్యుపెన్సీ పెరగటం కారణంగా రూ. 6 వందల కోట్లు అవసరమవుతున్నాయన్నారు. మహాలక్ష్మి పథకం ప్రవేశ పెట్టాక ఆర్టీసీకి ఎన్ని నిధులు ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని కవిత డిమాండ్ చేశారు. జనంబాటలో భాగంగా ప్రజల దగ్గరకు వెళితే అసలు ఫ్రీ బస్ ఎందుకు పెట్టారంటూ మహిళలే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని కవిత చెప్పారు. ఫ్రీ బస్సు పెట్టాక అందుకు అవసరమైన విధంగా బస్సుల సంఖ్యను మాత్రం పెంచటం లేదన్నారు. కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్ ను కూడా ఆర్టీసీకి ప్రభుత్వం అందజేయటం లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వంలో 52 రోజుల పాటు ఆర్టీసీ ఉద్యోగులు సమ్మె చేశారని, 33 మంది కార్మికులు కూడా చనిపోయారని కవిత గుర్తు చేశారు. కానీ వారికి ఏ మాత్రం న్యాయం జరగలేదన్నారు. పైగా గత ప్రభుత్వం యూనియన్లను కూడా రద్దు చేసిందన్నారు. యూనియన్లను రద్దు చేయటం, ఆర్టీసీకి ఛైర్మన్ ను ఎంపిక చేయకపోవటంతో ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. అధికారుల జులుం ఎక్కువై ఆర్టీసీ ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనియన్ల ను పునరుద్దరిస్తామని మాట ఇచ్చిందని వెంటనే ఆ హామీని నిలబెట్టుకోవాలని కవిత కోరారు.

ప్రయివేటు పరం చేసే కుట్ర...

ఆర్టీసీని ప్రభుత్వం ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తోందని మండిపడ్డారు. మేఘా కృష్ణా రెడ్డికి మొత్తం ఆర్టీసీని ధారాదత్తం చేసే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో వాటిని అద్దెకు తీసుకొని వారికి కరెంట్, డిపోలను ఆర్టీసీయే ఇస్తుందన్నారు. అదే విధంగా ఎలక్ట్రిక్ బస్సుల్లో పనిచేసే వారందరినీ అవుట్ సోర్సింగ్ నుంచి తీసుకుంటున్నారన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల్లో కూడా ఆర్టీసీ ఉద్యోగులే ఉండాలని కవిత కోరారు. ఆర్టీసీ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఉద్యోగులకు న్యాయం జరిగే వరకు కూడా ఆర్టీసీ ఉద్యోగుల తరపున జాగృతి ఫైట్ చేస్తుందని భరోసా ఇచ్చారు.

సచివాలయంలోనే మంత్రివర్గ సమావేశాలు జరగాలి

తెలంగాణ రాష్ట్ర కేబినేట్ ను సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీకి తీసుకెళ్లటం పై కవిత మండిపడ్డారు. ఇది తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపర్చటమేనని చెప్పారు. ఐతే గతంలో మంత్రివర్గం ఎర్రవెల్లికి వెళితే ఇప్పుడు ఢిల్లీకి వెళ్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రివర్గ సమావేశాలు సచివాలయంలోనే జరగాలని అన్నారు. ఉద్యమ ద్రోహులను పక్కన పెట్టుకోని కేటీఆర్ మాట్లాడుతున్నారని అన్నారు. ఎవరు ఉద్యమకారులో, ఎవరు ఉద్యమ ద్రోహులో ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు.

సిద్దిపేట బరిలో కవిత!

మొదటిపేజీ తరువాయి

ఆమె అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ప్రజల ఆశీర్వాదంతో గెలిచి తెలంగాణ రాజకీయాల్లో పెను తుఫాన్ సృష్టిస్తాననే సంకల్పంతో కవిత బరిలోకి దిగుతున్న సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. సిద్దిపేట సమరం కేవలం ఒక నియోజకవర్గ పోటీ కాదు.. రాబోయే ఎన్నికల రాజకీయ దిశను మలిచే ప్రతిష్టాత్మక పోరాటంగా మారబోతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ మా పార్టీ మదర్ బోర్డ్

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత మీడియా చిట్‌చాట్‌లో పేల్చిన రాజకీయ బాంబులు రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు రేపుతున్నాయి. మే మొదటి వారంలో మంచి ముహూర్తం చూసుకుని కొత్త రాజకీయ పార్టీని ప్రకటిస్తామని స్పష్టం చేసిన ఆమె, ఆ పార్టీ పేరులో తప్పనిసరిగా "తెలంగాణ" ఉండబోతుందని వెల్లడించారు. "తెలంగాణ మా పార్టీ మదర్ బోర్డ్... సామాజిక తెలంగాణ మా లక్ష్యం" అంటూ ఆమె చేసిన ప్రకటన కొత్త రాజకీయ సమీకరణాలకు నాంది పలికింది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తాను ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని, అయితే మొదటి ప్రాధాన్యత సిద్దిపేటకేనని, రెండో ఎంపికగా బోధన్‌ను పరిశీలిస్తున్నానని ప్రకటించడం రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. సిద్దిపేట తన కర్మభూమి కావొచ్చని గతంలో చెప్పిన మాటలను మరోసారి గుర్తు చేస్తూ, "ఇది ఎవరి అడ్డా కాదు... ప్రజల అడ్డా" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు స్పష్టమైన రాజకీయ సవాల్‌గా మారాయి. సిద్దిపేట అంటే సాధారణ నియోజకవర్గం కాదు. అదే మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పురిటిగడ్డ. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమానికి కేంద్ర బిందువుగా నిలిచిన ఈ నేలపై ప్రస్తుతం బలమైన నేతగా హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇలాంటి నేపథ్యంలో కవిత సిద్దిపేట బరిలో దిగుతానని సంకేతాలు ఇవ్వడం రాజకీయ రణరంగానికి నాంది పలికినట్టే. ఇటీవల హరీష్‌రావును లక్ష్యంగా చేసుకుని ఆమె చేసిన విమర్శలు కూడా ఈ పోటీకి వేడి జోడిస్తున్నాయి. బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ అయిన తర్వాత తన రాజకీయ ప్రయాణాన్ని కొత్త దిశగా మలుచుకుంటున్న కవిత, గత ఆరు నెలలుగా ఉద్యమ పంథాలో నిర్ణయాలు తీసుకుంటున్నారు. తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ కోసం ప్రత్యేక రాజకీయ వేదిక అవసరమని ఆమె స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై ఏకకాలంలో దాడి చేస్తూ, "తెలంగాణలో మేమే ప్రధాన ప్రతిపక్షం అవుతాం.. తెలంగాణలో బీజేపీ ఉండదు" అంటూ ధైర్యంగా ప్రకటించారు. పార్టీ నిర్మాణం ఇప్పటికే వేగంగా సాగుతోందని, 50 కమిటీల్లో విస్తృత చర్చలు జరుగుతున్నాయని తెలిపారు. యువతకు పెద్ద పీట వేస్తామని, దళితులు, గిరిజనులు, మైనారిటీలు, మహిళలు, బడుగు బలహీన వర్గాల ఆకాంక్షలే తమ పార్టీ దిశగా ఉంటాయని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల వరకు తమ గుర్తుపై పోటీ చేస్తామని, ఎంపీటీసీ, జడ్పిటీసీ ఎన్నికల్లో అవసరమైతే పొత్తులు పరిశీలిస్తామని చెప్పారు.

పలువురు బీఆర్ఎస్ నేతలు టచ్‌లో ఉన్నారు

బీఆర్ఎస్‌లోని పలువురు నేతలు తనతో టచ్‌లో ఉన్నారని, సరైన సమయంలో వారి పేర్లు వెల్లడిస్తానని చెప్పడం మరింత రాజకీయ ఉత్కంఠను రేపుతోంది. మహిళా నాయకత్వంపై వస్తున్న విమర్శలకు ఘాటుగా స్పందిస్తూ, "పార్టీలు పెట్టి ఫెయిల్ అయిన మగవారి గురించి ఎందుకు చర్చించరు?" అంటూ ప్రశ్నించారు. షర్మిలను ఫెయిల్యూర్ లీడర్‌గా చూడలేమని కూడా వ్యాఖ్యానించారు. పెద్దపల్లి మున్సిపాలిటీలో తమదే ప్రధాన ప్రతిపక్షమని చెప్పిన కవిత, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టినట్లు సంకేతాలు ఇచ్చారు. "ప్రజల కోణంలో పార్టీ నడుస్తుంది" అనే ఆమె మాటలు కొత్త రాజకీయ దిశకు రూపరేఖలుగా కనిపిస్తున్నాయి. సిద్దిపేటను కేంద్రంగా చేసుకుని తెలంగాణ రాజకీయాల్లో అగ్ని పర్వతం పేలబోతుందా? మేలో కొత్త పార్టీ ప్రకటనతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం మారుతుందా? లేక ఇది మరో రాజకీయ ప్రయోగమా? అన్న ప్రశ్నలు వేడెక్కుతున్నాయి. ఒక విషయం మాత్రం స్పష్టం.. కవిత అడుగులు ఇప్పుడు కేవలం రాజకీయ చర్చలకే పరిమితం కావు. అవి తెలంగాణ రాజకీయాల్లో భూకంప ప్రకంపనలుగా మారే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది.

26 నుంచి అసెంబ్లీ

మొదటిపేజీ తరువాయి

సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అదేరోజు శాసనమండలిలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు బడ్జెట్‌ను ప్రవేశ పెడతారు. ఈ నెల 23న కేబినెట్ సమావేశం తర్వాత ఈ సమావేశాల నిర్వహణపై సర్కార్ అధికారికంగా వివరాలు వెల్లడించనున్నది.

రూ.3.15 లక్షల కోట్లతో బడ్జెట్

ఈసారి బడ్జెట్ పరిమాణాన్ని భారీగా పెంచే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సుమారు రూ.3.15 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు ఉండే అవకాశం ఉన్నది. ప్రజా సమస్యలపై సమగ్రంగా చర్చించేందుకు వీలుగా ఈ సారి సమావేశాలను 10 నుంచి 15 రోజులపాటు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం అన్ని ప్రభుత్వశాఖలతో ప్రీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. ఇప్పటికే అధికారులు ఆయా శాఖలకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందించగా, ప్రీ బడ్జెట్ సమీక్షల్లో తుది మార్పులు, చేర్పులు చేస్తున్నారు. బడ్జెట్‌లో విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యమిస్తామని ఇప్పటికే మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.

పాత అసెంబ్లీ హాల్‌లో మండలి సమావేశాలు

ఈసారి సమావేశాల్లో కీలకమార్పు చోటుచేసుకోనున్నది. శాసనసభ, శాసనమండలి సమావేశాలు ఒకే ప్రాంగణంలో జరుగనున్నాయి. గతంలో వేర్వేరుచోట్ల జరిగినప్పటికీ, ఈసారి మండలి సమావేశాలను పాత అసెంబ్లీ హాల్‌లో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఏడాదిగా పాత అసెంబ్లీ హాల్‌కు మరమ్మతులు చేస్తున్నారు. రంగులు సహా ఇతర తుదిమెరుగులు దిద్దారు. సమావేశాల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అసెంబ్లీ సిబ్బంది ఇప్పటికే పూర్తిచేసింది.

బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించాలి

మొదటిపేజీ తరువాయి

చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలుపై స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి దాదాపు రెండేళ్లు పూర్తవుతున్నప్పటికీ ఇచ్చిన హామీలలో 95 శాతం అమలు కాలేదని ఆరోపిస్తూ, కనీసం ఈసారి బడ్జెట్‌లోనైనా తగిన నిధులు కేటాయించాలని కోరారు. ఎన్నికల సమయంలో మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 అందజేస్తామని, వృద్ధులు, వితంతువులకు పెన్షన్‌ను రూ.4,000కు పెంచుతామని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేసిన కేటీఆర్, ఇప్పటివరకు అమలులో ఎలాంటి పురోగతి కనిపించలేదన్నారు. రైతులకు రైతుబంధు మొత్తాన్ని పెంచుతామని, పెండింగ్ బకాయిలను చెల్లిస్తామని చెప్పి మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. కౌలు రైతులు, రైతు కూలీలకు ఆర్థిక సహాయం అందించాలన్న మేనిఫెస్టో హామీ కూడా అమలు కాలేదని పేర్కొన్నారు.

రెండులక్షల ఉద్యోగాల భర్తీ హామీ ఏమైంది

అలాగే నిరుద్యోగులకు రెండులక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ విడుదల, నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి వంటి హామీలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చూపలేదని అన్నారు. ఉపాధి కోల్పోయిన ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించి ఇప్పటివరకు నిధులు కేటాయించలేదని ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెరుగుతున్నాయని, విద్యా భరోసా కార్డులు, విద్యార్థినులకు స్కూటీలు వంటి హామీలు కూడా అమలు కాలేదని పేర్కొన్నారు. డిక్లరేషన్ల పేరుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేయడం తగదని, ఈ వర్గాల సంక్షేమానికి ప్రత్యేక కేటాయింపులు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత తీసుకువస్తామని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని సూచించారు. రాబోయే బడ్జెట్ లో ఈ హామీల అమలుకు స్పష్టమైన నిధులు కేటాయించకపోతే ప్రజల తరపున ఉద్యమం చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీస్తామని హెచ్చరించారు. తెలంగాణ సమాజం ఇక మోసపోవడానికి సిద్ధంగా లేదని, బడ్జెట్ ద్వారా ప్రభుత్వ నిజాయితీ బయటపడుతుందని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.

విద్యార్థులకు ప్రత్యక్ష కార్యక్రమాలు అవసరం

- విద్య, నైతికత దేశ సమగ్రతకు తోడ్పాటునందిస్తుంది
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- జీడిమెట్లలో భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణా కేంద్రానికి శంకుస్థాపన

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 19: విలువలతో కూడిన విద్య, నైతికత అనేది దేశ సమగ్రతకు తోడ్పాటునందిస్తుందని, మొబైల్ ఫోన్లు వాడకం ద్వారా ప్రత్యక్ష అనుభవం, కార్యకలాపాలు మరుగునపడుతునందున, ప్రత్యక్ష కార్యక్రమాలు విద్యార్థులకు అవసరమని గవర్నర్ నొక్కి చెప్పారు. గురువారం జీడిమెట్లలో బీడీఎల్అధ్వర్యంలో నిర్మించబడుతున్న భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణా కేంద్రాన్ని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ అందమైన ప్రకృతిలో ఈ నిర్మాణాన్ని చేయడం అనేది ప్రకృతి ఇచ్చిన వరమన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో పాటు రెడ్ క్రాస్, ఎన్సీసీ వంటి ఇతర సంస్థలతో కూడా భాగస్వామ్యం చేసుకుంటూ దేశ బలోపేతానికి పాటు పడాలని కోరారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత లాగే, 'విద్యా సామాజిక బాధ్యత' కూడా ఉండాలని కోరారు. కేవలం మంచి డాక్టర్లు, ఇంజనీర్లను మాత్రమే కాకుండా, బాధ్యతాయుతమైన పౌరులను తయారు చేయడం ముఖ్యమని చెప్పారు. నేటి తరం పిల్లలు ఎక్కువ సమయం ఫోన్ స్క్రీన్లకే పరిమితమవుతున్నారు కాబట్టి ప్రాపంచిక జ్ఞానంతో అనుసంధానం చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ముందస్తుగా ప్రభుత్వ మరియు ప్రైవేట్ విద్య సంస్థలకు సంబందించి కార్యాచరణను ప్రణాళికాబద్ధంగా తయారు చేసుకొని వివిధ కార్యక్రమాలు, చర్చలు, క్రీడలలో విద్యార్థులు విరివిగా పాల్గొనెటట్టు చేయడము ద్వారా ఈ విద్యార్థులే రేపటి యువతగా దేశ అబివృద్ధి లో వనరులుగా మారుతారన్నారు. సామర్థ్యంతో పాటు సహృదయం కలిగి ఉండటం చాలా ముఖ్యమని ఈ క్యాంపస్‌ను ఒక గొప్ప శిక్షణ కేంద్రంగా అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. బీడీఎల్ సౌజన్యంతో నిర్మించే భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ కేంద్రానికి బాడెన్ పావెల్ మెమోరియల్ హాల్ అని పేరు పెట్టుకోవడం ఎంతో హర్షణీయమన్నారు. ఈ క్యాంపస్‌ను ఒక గొప్ప శిక్షణ కేంద్రంగా అభివృద్ధి చేయాలని, ఇది ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులందరికీ ఉపయోగపడాలని ఆకాంక్షించారు. తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం. దాన కిషోర్ ఐఏఎస్ మాట్లాడుతూ దేశ సేవలో మనల్ని మనం పునరంకితం చేసుకోవాలని, అందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఒక సదావకాశమని అన్నారు. ఇంతకు పూర్వం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో కేవలం 17500 మంది మాత్రమే ఉండేవారని, కాని ఇప్పుడు అదనంగా 36 వేల మంది విద్యార్థులు చేరారని తెలిపారు. వీరికి మెరుగైన శిక్షణ కార్యక్రమాలు చేపట్టెందు శిక్షణ కేంద్రాన్ని నిర్మించేందుకు బీడీఎల్ వారు ముందుకలు వచ్చి ఆర్థిక చేయుత అందించడం చాలా గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్, జాయింట్ సెక్రటరీ బీఎస్జీ డాక్టర్ బిఎస్. శర్మ, బీడీఎల్‌డైరెక్టర్ ఆఫ్ ఫైనాన్స్ గాయత్రి ప్రసాద్, జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వి జయేందర్ రెడ్డి, ఆర్డీఓ శ్యామ్ ప్రకాష్ , జిల్లా విద్యాశాఖ అధికారి విజయ్ కుమారి, సంబందిత అధికారులు పాల్గొన్నారు.

'నేను మంత్రి ని కాను.. మీలో ఒకడిని!'

- ప్రజలతో మమేకమైన మంత్రి 'పొన్నం'
- కోహెడ పర్యటనపై స్థానిక ప్రజల్లో ఆసక్తి
- చాయ్‌తాగుతూ ప్రజలతో మంత్రి ఆత్మీయ సంభాషణ
- జనం సమస్యలు శ్రద్ధగా విన్న మంత్రి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, ఉత్తర తెలంగాణ : రాజకీయ హడావుడి, ప్రోటోకాల్, భద్రతా వలయాలు..ఇవన్నీ పక్కన పెట్టి సాధారణ వ్యక్తిలా జనంలో కలిసిపోయిన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మిక పర్యటనతో హుస్నాబాద్ నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా మారింది. కోహెడ మండలం కేంద్రంలో మంత్రి పర్యటన అనూహ్యంగా ఉండటంతో స్థానిక ప్రజల్లో ఆసక్తి నెలకొంది. "నేను మంత్రిని కాను.. మీలో ఒకడిని" అంటూ ప్రజలతో పలకరించిన ఆయన తీరు అందరినీ ఆకట్టుకుంది.

అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆత్మీయ సంభాషణ

కోహెడలోని అంబేద్కర్ చౌరస్తా కోహెడ వద్ద ఉన్న ఓ చిన్న టిఫిన్ సెంటర్‌లో మంత్రి చాయ్ కప్పు పట్టుకుని కూర్చోవడం అక్కడి ప్రజలకు ఆశ్చర్యాన్నిచ్చింది. పెద్ద పెద్ద సభలు కాదు.. మైక్‌లు కాదు.. గుమిగూడిన మీడియా కాదు.. ఒక చాయ్ కప్పు చుట్టూ సాగిన ఆత్మీయ సంభాషణే ఆ రోజు ప్రత్యేకతగా నిలిచింది. గ్రామీణ వాతావరణంలో సాధారణ వ్యక్తిలా కూర్చొని ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడం రాజకీయ నాయకుడి కంటే ఓ పరిచయస్తుడిలా అనిపించిందని స్థానికులు పేర్కొన్నారు.రహదారుల మరమ్మత్తులు, తాగునీటి ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలు, పింఛన్ల ఆలస్యం, రైతుల ఆర్థిక కష్టాలు.. ఒక్కొక్కటి ప్రజలు వివరించగా, మంత్రి శ్రద్ధగా విన్నారు.

ఫోన్ కాల్స్‌తో సమస్యల పరిష్కారం

సమస్యలు విన్న వెంటనే సంబంధిత అధికారులతో మంత్రి అక్కడికక్కడే ఫోన్‌లో మాట్లాడడం గమనార్హం. తాగునీటి సమస్య పరిష్కారానికి తాత్కాలిక ట్యాంకర్ల ఏర్పాటు చేయాలని, రోడ్ల ప్యాచ్‌వర్క్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు."ప్రజా సమస్యలు పెండింగ్‌లో ఉండకూడదు.. నిర్లక్ష్యం అస్సలు సహించం" అంటూ అధికారులకు గడువులు విధించారు. ఈ తక్షణ స్పందన స్థానిక ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది.

అభివృద్ధి పనులపై సమీక్ష

కోహెడ మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాలు, కాల్వల నిర్మాణం, పాఠశాలల మరమ్మత్తులు, హెల్త్ సెంటర్ అభివృద్ధి పనుల పురోగతిని వివరంగా తెలుసుకున్నారు.పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడకూడదని అధికారులను హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో పారదర్శకత, వేగం తప్పనిసరి అని స్పష్టం చేశారు.

ప్రజల్లో నమ్మకం పెంపొందించే ప్రయత్నం

మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన కేవలం పరిపాలనా సమీక్ష మాత్రమే కాదు.. ప్రజలతో నేరుగా మమేకమయ్యే నాయకత్వ శైలికి ఉదాహరణగా మారింది. హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ పర్యటన రాజకీయంగా కూడా చర్చనీయాంశమైంది. ప్రజల్లో నమ్మకం పెంపొందించే ప్రయత్నం అనే చర్చలు మొదలయ్యాయి. ఏదేమైనా.. ఆ రోజు కోహెడలో రాజకీయ ప్రసంగాల కంటే ఒక చాయ్ కప్పు ఎక్కువ ప్రభావం చూపిందనేది మాత్రం స్పష్టంగా కనిపించింది.

ఎయిమ్స్ పనులు త్వరగా పూర్తి కావాలి

- ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి
- నిర్మాణ జాప్యంపై కాంట్రాక్టర్లు, కన్సల్టెంట్లపై సీరియస్
- 25% ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలని డిమాండ్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 19 : బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రి సేవలు 2026 నాటికి సంపూర్ణంగా ప్రజలకు అందుబాటులోకి రావాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం ఎయిమ్స్ ప్రాంగణంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి భవన నిర్మాణాల్లో జరుగుతున్న జాప్యంపై ఎంపీ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికే భవన నిర్మాణాలు రెండు ఏళ్లు ఆలస్యమయ్యాయని, ఇంకా ఎంతకాలం సాగదీస్తారని కాంట్రాక్టర్లను, కన్సల్టెంట్లను ఎంపి నిలదీశారు. నిర్ణీత క్యాలెండర్ ప్రకారం పనులు పూర్తి చేసి అప్పగించాలని స్పష్టం చేశారు. నిర్మాణ వేగాన్ని పెంచేందుకు అదనపు సిబ్బందిని నియమించాలని, రాత్రింబవళ్లు పనులు చేసి గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక రోగుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వైద్య సేవలు విస్తరించాలని ఆయన సూచించారు. ప్రస్తుతం ఉన్న రెండు డయాలసిస్ మిషన్లు సరిపోవని, తక్షణమే మరో 25 కొత్త డయాలసిస్ మిషన్లను అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆస్పత్రికి అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులపై సమగ్ర రిపోర్టు అందజేయాలని అధికారులను కోరారు. ఎయిమ్స్ ఉద్యోగ నియామకాలపై ఎంపీ చామల కీలక వ్యాఖ్యలు చేశారు. "ఎయిమ్స్‌లో జరిగే ఉద్యోగ నియామకాల్లో 25 శాతం కోటాను ఖచ్చితంగా స్థానికులకే కేటాయించాలి" అని ఆయన డిమాండ్ చేశారు. స్థానిక నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు రాజీ పడేది లేదని స్పష్టం చేశారు.

ప్రజా తీర్పును కాలరాస్తున్న ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

మీడియాతో మాట్లాడారు. ఆదిలాబాద్‌లోని ఆదిలాబాద్ సెంట్రల్ జైలులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ను పరామర్శించిన అనంతరం హరీష్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న బాల్క సుమన్‌తో పాటు రాజిరెడ్డి, అనిల్ లక్ష్మీ కాంత్‌లను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆయన ఆరోపించారు. రామగుండం కమిషనరేట్ పరిధిలో పెద్దపల్లి, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో జైళ్లు ఉన్నప్పటికీ, 200 కిలోమీటర్ల దూరంలోని ఆదిలాబాద్‌కు తరలించడం రాజకీయ వేధింపులేనని పేర్కొన్నారు.

ఎన్నికను వాయిదా వేసేలా కుట్ర

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో 22 స్థానాల్లో 14 స్థానాలు భారత రాష్ట్ర సమితి-సీపీఐ కూటమి గెలుచుకుందని, ప్రజా తీర్పును గౌరవించాల్సిన మంత్రి వివేక్ వెంకటస్వామి దానిని కాలరాస్తున్నారని విమర్శించారు. చైర్మన్ ఎన్నిక రోజున కావాలనే పోలీసు బందోబస్తు లేకుండా చేసి ఎన్నికను వాయిదా వేసేలా కుట్ర పన్నారు అని ఆరోపించారు. మహిళా కౌన్సిలర్లపై దౌర్జన్యంగా ప్రవర్తించిన సంఘటనను తీవ్రంగా ఖండించిన ఆయన, ఫిర్యాదు చేయడానికి వెళ్లినప్పుడు కూడా పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ స్వీకరించలేదని అన్నారు. కాంగ్రెస్ కౌన్సిలర్లు మద్యం సేవించి వచ్చారని, వారిపై కేసులు నమోదు చేయకపోవడం పక్షపాత ధోరణి కాదా అని ప్రశ్నించారు. పోలీసులు కాంగ్రెస్ తొత్తులుగా వ్యవహరిస్తున్నారని హరీష్‌రావు ఆరోపించారు. జనగామ, ఇబ్రహీంపట్నం, ఆమంగల్, క్యాతన్‌పల్లిలో బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేయడానికే కవాతులు నిర్వహించారని విమర్శించారు. చట్టాన్ని అతిక్రమించి వ్యవహరించిన అధికారులపై భవిష్యత్తులో చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డిపై ప్రశ్నలు

తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీ, రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలపై ఎందుకు స్పందించరని ప్రశ్నించారు. కాంగ్రెస్-బీజేపీ మైత్రి ఈ ఎన్నికల్లో స్పష్టంగా కనిపిస్తోందని, బీజేపీ నాయకులు పోలీసులను దూషించినా చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. చట్టం ఒక పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తే ఇండియన్ నేషనల్ కాంగ్రెస్కు అది మంచిది కాదని హెచ్చరించారు. అలాగే బీజేపీపై కూడా విమర్శలు గుప్పించారు. క్యాతన్‌పల్లి ఘటనపై గవర్నర్ వెంటనే జోక్యం చేసుకుని చర్యలు తీసుకోవాలని, ఎన్నికల కమిషన్ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీష్ రావు డిమాండ్ చేశారు. ప్రజా తీర్పును కాలరాస్తే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమాలు జరుగుతాయని హెచ్చరించారు. అధికారం శాశ్వతం కాదని, భవిష్యత్తులో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు చట్టం ప్రకారం చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

జీహెచ్ఎంసీ విభజనపై హైకోర్టులో రిట్ పిటిషన్

- జీవో నంబర్ 55ను సవాల్ చేస్తూ గురువారెడ్డి అనే వ్యక్తి పిటిషన్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 19 : జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించడంపై తెలంగాణ కోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. జీవో నంబర్ 55ను సవాల్ చేస్తూ కోర్టులో గురువారెడ్డి అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. ఈ రిట్ పిటిషన్‌పై హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. 2027 జనగణన నేపథ్యంలో రిజిస్ట్రార్ జనరల్, సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా జారీ చేసిన సర్క్యులర్ నంబర్ 01 ప్రకారం.. జ్యూరీ డిస్టింక్షన్ ఫ్రీజ్ అమల్లో ఉందని పిటిషనర్ వాదనలు వినిపించారు. మున్సిపల్ సరిహద్దులు మార్చడం, స్థానిక సంస్థల పునర్వ్యవస్థీకరణ చట్ట విరుద్ధమని పిటిషనర్ తెలిపారు. జీవో నంబర్ 55ను రద్దు చేయాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని కోరారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ ధర్మాసనం విచారణ చేసింది. పిటిషనర్ వాదనలు విన్న అనంతరం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలంగాణ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. మూడు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని రెండు ప్రభుత్వాలనూ ఆదేశించింది.

కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్

మొదటిపేజీ తరువాయి

5వేల మంది సీఆర్పీఎఫ్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య భారీ ఎన్ కౌంటర్ చోటుచేసుకుంది. మావోయిస్టు అగ్రనేతలు దేవ్‌జీ, సోది కోసం సహా ముఖ్య నాయకులు కర్రెగుట్టల్లో తలదాచుకున్నారన్న సమాచారంతో కూంబింగ్ కొనసాగిస్తున్నారు. మరో వైపు లొంగుబాటుకు అగ్రనేతలు సిద్ధమవుతున్నారు.

మిగిలిన గడువు 40రోజులే..

అయితే ఆపరేషన్ కగార్ తో.. మార్చి 31నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం నిర్ధేశించింది. ఇందుకోసం కేవలం 40 రోజులు మాత్రమే సమయం ఉండటంతో భద్రతా బలగాలు మావోయిస్టుల ఏరివేత ఆపరేషన్ ముమ్మరం చేశారు. కర్రెగుట్టల్లో మావోయిస్టులు తలదాచుకున్నారన్న సమాచారంతో 5వేల మంది భద్రతా బలగాలు కూంబింగ్ ఆపరేషన్స్ చేపట్టి కర్రెగుట్టలను జల్లెడ పడుతున్నాయి. హెలిక్యాప్టర్లు, డ్రోన్లను, శాటిలైట్ టెక్నాలజీని వినియోగిస్తు ముందుకు సాగుతున్నారు. భద్రతా బలగాల కూంబింగ్ ఆపరేషన్ల నేపథ్యంలో పలువురు మావోయిస్టులు తెలంగాణ వైపు పారిపోయి వచ్చినట్లుగా తెలుస్తుంది. దీంతో తెలంగాణ, ఏపీ, ఒడిస్సా సరిహద్దుల వెంట, చత్తీస్ గఢ్ అడవుల్లో మావోయిస్టుల కదలికలపై భద్రతా బలగాలు ఫోకస్ చేయడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనన్న టెన్షన్ ఆ ప్రాంతా గ్రామీణ ప్రజల్లో వ్యక్తమవుతుంది.

25 నుంచి ఇంటర్ పరీక్షలు

- హాల్‌టికెట్లు విడుదల
- తొలిసారిగా రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు హాల్‌టికెట్లు



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో ఈ నెల 25న ఇంటర్‌పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇంటర్ వార్షిక పరీక్షలకు హాల్ టికెట్లు విడుదల చేశారు. తొలిసారిగా విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు ఇంటర్మీడియట్ బోర్డు హాల్ టికెట్లు పంపింది. రిజిస్టర్ మొబైల్ నెంబర్ నుంచి వీటిని డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. కళాశాల ప్రిన్సిపల్స్ నుంచి కూడా హాల్ టికెట్లు తీసుకునే అవకాశం కల్పించారు. 9.9 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. ప్రస్తుతం ఆయా ఇంటర్ బోర్డు హాల్‌టికెట్లను విద్యార్థుల రిజిస్టర్ మొబైల్ నంబర్‌కు పంపింది. ఇంటర్మీడియట్‌వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 25 నుంచి ప్రారంభం కానున్నాయి. 25న ఫస్ట్ ఇయర్, 26న సెకండియర్ పరీక్షలు మొదలు కానున్నాయి. సబ్జెక్టుల వారీగా పరీక్షల కాలపట్టికను ఇంటర్ బోర్డు గతంలో విడుదల చేసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాత పరీక్షలు నిర్వహిస్తారు. ప్రయోగ పరీక్షలు ఫిబ్రవరి 2వ తేదీ నుంచి 21 వరకు ప్రతి రోజూ 2 షిఫ్టుల్లో నిర్వహించారు. ఉదయం 9 నుంచి 12, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్స్ జరిగాయి.

సంత్ సేవాలాల్ గొప్ప అహింసా వాది

- అంబేద్కర్ యూనివర్సిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి
- ఘనంగా సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 19: సేవాలాల్ బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేసిన మహనీయుడని, డా. బీఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొ. ఘంటా చక్రపాణి పేర్కొన్నారు. బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ 287 వ జయంతి సందర్భంగా డా. బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో గురువారం ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఘంటా చక్రపాణి, అయన మాట్లాడుతూ సంత్ సేవాలాల్ గొప్ప మానవతా వాదిగా, బంజారాల ఆరాధ్య దైవంగా కీర్తి పొందినట్లు వివరించారు. బంజారాల బాగు కోసం, నిరంతరం వాళ్ళ ఆత్మగౌరవం కోసం పని చేశారని పేర్కొన్నారు. శతాబ్దాల క్రితమే సంత్ సేవాలాల్ ఆదర్శ జీవనం గడిపారని, యువత సేవాలాల్ ను ఆదర్శంగా తీసుకోవాలని ప్రొ. ఘంటా చక్రపాణి పిలుపునిచ్చారు. సేవాలాల్ ప్రఖ్యాత పర్యావరణ వేత్తగా రెండు వందల సంవత్సరాల క్రితమే గుర్తింపు పొందడం అంటే ఆయన దూరదృష్టి ని అర్థం చేసుకోవచ్చని వివరించారు.

బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మాహారాజ్ : భాంగ్య భుక్య

ఈ కార్యక్రమంలో కేంద్రీయ విశ్వవిద్యాలయ చరిత్ర అధ్యాపకులు ప్రొ. భాంగ్య భుక్య ప్రధాన వక్తగా పాల్గొని ప్రసంగించారు. అయన మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ దేశంలోని బంజారాల ప్రాంతాలలో గొప్ప గౌరవనీయమైన ఆధ్యాత్మిక వ్యక్తిగా కీర్తించ పడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. బంజారాల సంస్కృతికి ఆధ్యాత్మికతను జోడిస్తూ, దేశమంతా సంచరిస్తూ, సమాజానికి హితబోధ చేశారన్నారు. దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని తన పర్యటనల ద్వారా సేవాలాల్ ఏకం చేశారన్నారు. సేవాలాల్ ఒక దార్శనికుడు, తాత్వికవేత్త. ఆధ్యాత్మిక బోధనలు, భక్తి ప్రవచనాలు చెప్పుతూ తన జీవితాన్ని బంజారాల అభ్యున్నతి కోసం త్యాగం చేశారని, మంచి మాటలతో ప్రజలను చైతన్యవంతులను చేశారని వివరించారు. తన కీర్తి కోసం పని చేసినట్లు చరిత్రలో ఎక్కడా లేదని, ఆ వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకెల్లారని వివరించారు. ఆయన మనస్తత్వం తెలిసిన చరిత్రకారులే సంత్ సేవాలాల్ రూపాన్ని ఊహించి ఫోటోను తయారు చేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎల్. విజయకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ బంజారాలా ఆరాధ్య దైవంగా సంత్ సేవాలాల్ కీర్తించ పడటం అంటే ఆ వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు చిరస్మరనీయమని వెల్లడించారు. ఎస్సీ ఎస్టీ సెల్ లైసన్ ఆఫీసర్ డా. బానోత్ ధర్మ కార్యక్రమ నిర్వహణ ఆవశ్యకతను, సంత్ సేవాలాల్ సేవలను సభకు వివరించారు. అంతకు ముందు భోగ్ భండార్ (పూజా కార్యక్రమం) డా. ధర్మా నాయక్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బంజారా ఉద్యోగులు పాల్గొని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొ. చంద్రకళ, ప్రొ.. ప్రమీలా కేతావత్; డా. బోజు శ్రీనివాస్, రెడ్యా నాయక్, మాలోత్ బుద్ధా నాయక్, పాండు నాయక్, కాంతం ప్రేమ కుమార్; నవీన్ నాయక్, పలు విభాగాల అధిపతులు, డీన్స్, బోధన మరియు బోధనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హెరిటేజ్ ఫుడ్స్ విషయంలో నిజం గెలిచింది. హెరిటేజ్ సంస్థపై సాక్షి మీడియా చేసింది తప్పుడు ప్రచారమని ఢిల్లీ హైకోర్టు స్పష్టంగా చెప్పింది. పరువు నష్టం కలిగించే కంటెంట్‌ను 24 గంటల్లోగా తొలగించాలని ఆదేశించింది. అబద్ధాలు ఒక రోజు ట్రెండ్ కావచ్చు. కానీ న్యాయ పరీక్షలో నిజమే గెలుస్తుంది. సత్యమేవ జయతే.

- ట్వీటర్‌లో ఏపీ మంత్రి నారా లోకేశ్

ఓపెన్ వాయిస్

డిజిటల్ ఇండియా చట్టంతో సోషల్ మీడియా నియంత్రణ

ప్రస్తుత డిజిటల్ యుగంలో సోషల్ మీడియా వినియోగం పెను సవాలుగా మారుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. మైనర్లు లేదా చిన్న పిల్లలు సోషల్ మీడియాకు బానిసలవుతున్నారనే ఆందోళనల నేపథ్యంలో వయస్సు ఆధారిత పరిమితులువిధించే అంశంపై ప్రభుత్వం తీవ్రంగా చర్చిస్తోంది. ఢిల్లీలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. పిల్లల మానసిక ఆరోగ్యం, ఆన్‌లైన్ భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు ఆయన సూచించారు.సోషల్ మీడియా వేదికలు యువతపై చూపిస్తున్న ప్రభావంపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఆస్ట్రేలియా వంటి దేశాలు ఇప్పటికే 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే దిశగా చట్టాలు చేశాయి. భారత్‌లో కూడా ఇటువంటి నిబంధనలు తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. "పిల్లల భద్రత విషయంలో మేము రాజీ పడము. సోషల్ మీడియా వాడకానికి కనీస వయస్సు ఎంత ఉండాలనే దానిపై వివిధ వర్గాల నుంచి అభిప్రాయాలను సేకరిస్తున్నాము. దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు కానీ, లోతైన చర్చలు మాత్రం జరుగుతున్నాయి" అని స్పష్టం చేశారు.చిన్న వయస్సులోనే సోషల్ మీడియాకు అలవాటు పడటం వల్ల పిల్లల్లో ఏకాగ్రత తగ్గడం, నిద్రలేమి, సైబర్ బుల్లింగ్ వంటి సమస్యలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా అశ్లీల కంటెంట్ లేదా హానికరమైన గేమింగ్ యాప్‌లు పిల్లల దారి మళ్లిస్తున్నాయని తల్లిదండ్రుల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయి. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్లు నిండిన వారు ఖాతా తెరవవచ్చని చెబుతున్నప్పటికీ, వయస్సును ధృవీకరించే బలమైన వ్యవస్థలు లేవు. దీనివల్ల పదేళ్ల లోపు పిల్లలు కూడా తప్పుడు వివరాలతో లాగిన్ అవుతున్నారు. ప్రభుత్వం తీసుకురాబోయే కొత్త నిబంధనల వల్ల 'ఏజ్ వెరిఫికేషన్' ప్రక్రియ మరింత కఠినతరం కానుంది.అమెరికా, యూరోపియన్ దేశాల్లో కూడా సోషల్ మీడియా (సంస్థలపై కఠినమైన నిబంధనలు విధిస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్, టిక్‌టాక్ వంటి ప్లాట్‌ఫారమ్‌లు పిల్లల డేటాను ఎలా సేకరిస్తున్నాయి? వారికి ఎటువంటి కంటెంట్‌ను చూపిస్తున్నాయి? అనే దానిపై నిఘా పెరిగింది. భారత్ కూడా ఇప్పుడు అదే బాటలో పయనిస్తోంది. ప్రతిపాదిత 'డిజిటల్ ఇండియా చట్టం' లో భాగంగా సోషల్ మీడియా సంస్థలకు జవాబుదారీతనాన్ని పెంచాలని కేంద్రం యోచిస్తోంది.ప్రభుత్వం కేవలం నిషేధాలకే పరిమితం కాకుండా, డిజిటల్ అక్షరాస్యతను పెంచడంపై కూడా దృష్టిసారిస్తోంది. సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు తమ అల్గారిథమ్‌లను మార్చుకోవాలని, పిల్లలకు హాని కలిగించే కంటెంట్ రాకుండా చూడాలని మంత్రి సూచించారు. ఒకవేళ సంస్థలు ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే భారీ జరిమానాలు విధించే అవకాశం కూడా ఉంది. అయితే ఈ ప్రక్రియలో ఇంటర్నెట్ స్వేచ్ఛకు, గోప్యతకు భంగం కలగకుండా చూడటం కూడా ప్రభుత్వానికి ఒక సవాలుగా మారింది. మొత్తానికి కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియా ప్రపంచంలో కలకలం రేపుతున్నాయి. డిజిటల్ ఇండియా చట్టం భారతదేశం నుండి దాని మొత్తం చరిత్రలో వెలువడే అత్యంత ముఖ్యమైన ఐటీ చట్టం అవుతుంది మరియు రాబోయే దశాబ్దం లేదా రెండు దశాబ్దాల పాటు మొత్తం దేశం యొక్క డిజిటల్ చట్టాలను సమర్థవంతంగా నియంత్రిస్తుంది. ఈ కొత్త చట్టంతో, దేశం తన డిజిటల్ చట్టాలను భవిష్యత్తుకు అనుగుణంగా మార్చుకోవాలని మరియు వ్యాపారాలు ప్రపంచ స్థాయిలో పోటీ పడటానికి వీలు కల్పించాలని ఆశిస్తోంది. అదనంగా, డిజిటల్ ఇండియా చట్టం యొక్క ముసాయిదా రూపకల్పనలో అనేక మంది వాటాదారులను (పౌరులను) పాల్గొనడానికి మరియు సంప్రదించడానికి భారత ప్రభుత్వం ప్రయత్నించింది, దీని నియమాలు మరియు చట్రం కనీసం వచ్చే దశాబ్దం పాటు దేశంలో సమగ్ర ఐటీ పర్యావరణ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చూసుకోవాలి.అయితే, అంతిమ లక్ష్యం పౌరుల గోప్యతా హక్కుల కోసం బలమైన చట్టాలను నిర్ధారించడం మరియు ప్రభుత్వంపై నమ్మకాన్ని పెంపొందించడం మాత్రమే కాదు డిజిటల్ ఇండియా చట్టం భారతీయ వ్యాపారాలకు డిజిటల్ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి మరియు ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన దేశంగా దేశాన్ని ప్రపంచవ్యాప్త డిజిటల్ పవర్‌హౌస్‌గా మార్చడానికి రూపొందించబడింది.

ప్రతిపక్షం
హైదరాబాద్
శుక్రవారం
20.02.2026

స్థానిక విజయాల ప్రభావం... ఎన్నికల బాటలో ప్రభుత్వం

ఇటీవలి గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఇప్పుడు పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఆలోచనలో ఉందన్న సంకేతాలు రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీస్తున్నాయి. ఈ పరిణామం వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనా, సామాజిక కోణాలను సమగ్రంగా పరిశీలిస్తే ఒక స్పష్టమైన దిశ కనిపిస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలనలో ఏర్పడిన అంతరాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పరిపాలన తాత్కాలిక పరిష్కారమే గానీ, ప్రజా ప్రతినిధుల ద్వారా నేరుగా జరిగే పాలనకు ఇది ప్రత్యామ్నాయం కాలేదు.

రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

ప్రజా పరిషత్ ఎన్నికల నిర్వహణ గురించి, ప్రభుత్వ యోచన అనే చర్చ ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో కొత్త ఊపును సంతరించుకుంది. గ్రామీణ స్వపరిపాలన వ్యవస్థలో కీలక స్థానం కలిగిన ప్రజా పరిషత్‌లు కేవలం పరిపాలనా యంత్రాంగం మాత్రమే కాదు; అవి గ్రామీణ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం. ఇటీవలి గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఇప్పుడు పరిషత్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఆలోచనలో ఉందన్న సంకేతాలు రాజకీయ వర్గాల్లో విశేష చర్చకు దారితీస్తున్నాయి. ఈ పరిణామం వెనుక ఉన్న రాజకీయ, పరిపాలనా, సామాజిక కోణాలను సమగ్రంగా పరిశీలిస్తే ఒక స్పష్టమైన దిశ కనిపిస్తుంది. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సంస్థల పాలనలో ఏర్పడిన అంతరాలు ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పరిపాలన తాత్కాలిక పరిష్కారమే గానీ, ప్రజా ప్రతినిధుల ద్వారా నేరుగా జరిగే పాలనకు ఇది ప్రత్యామ్నాయం కాలేదు. గ్రామీణ స్థాయిలో అభివృద్ధి పనుల ప్రాధాన్యత, స్థానిక అవసరాలపై స్పందన, ప్రజలతో ప్రత్యక్ష సంబంధం ఇవన్నీ ఎన్నికైన ప్రతినిధుల ద్వారానే సమర్థవంతంగా సాధ్యమవుతాయి. అందుకే పరిషత్ ఎన్నికల నిర్వహణపై ఆసక్తి పెరుగుతోంది. ఇటీవలి గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీగా ఉన్న భారత జాతీయ కాంగ్రెస్ అత్యధిక స్థానాలను దక్కించుకోవడం రాజకీయంగా కీలక మలుపుగా భావించ బడుతోంది. ఈ విజయాలు గ్రామీణ, పట్టణ స్థాయిల్లో అధికార పక్షానికి బలమైన మద్దతు ఉందన్న సంకేతాలను ఇస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు. అదే ఊపును కొనసాగిస్తూ పరిషత్ ఎన్నికలను త్వరగా నిర్వహిస్తే రాజకీయ లాభం చేకూరుతుందన్న ఆలోచన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఎన్నికల సమయం నిర్ణయించడంలో ఈ రాజకీయ లెక్కలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి. పరిషత్ ఎన్నికలు నిర్వహించడం పరిపాలనా పరంగా చిన్న విషయం కాదు. ఓటరు జాబితాల సవరణ, రిజర్వేషన్ల అమలు, భౌగోళిక పునర్విభజన, చట్టపరమైన అనుసరణ ఇవన్నీ సమన్వయంతో జరగాలి. ఈ మొత్తం ప్రక్రియను పర్యవేక్షించే బాధ్యత తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘంపై ఉంటుంది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పాక్షికత, చట్టబద్ధత కీలకం. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలవడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మూలస్తంభం. రాజకీయ కోణంలో చూస్తే పరిషత్ ఎన్నికలు సాధారణ స్థానిక పోటీగా మిగలడం లేదు. ఇవి రాష్ట్ర రాజకీయాల దిశను సూచించే సూచికలుగా మారుతున్నాయి. గ్రామీణ ఓటరు తీర్పు సాధారణంగా అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, స్థానిక నాయకత్వంపై ఆధారపడి ఉంటుంది. గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల

ఫలితాలు అధికార పక్షానికి అనుకూలంగా రావడం వల్ల అదే ధోరణి పరిషత్ ఎన్నికల్లోనూ కొనసాగుతుందన్న అంచనాలు ఉన్నాయి. అయితే ఎన్నికల రాజకీయాల్లో స్థానిక అంశాల ప్రాధాన్యం ఎక్కువగా ఉండటం వల్ల ప్రతి ప్రాంతంలో సమీకరణాలు వేరుగా ఉండే అవకాశం కూడా ఉంది. సామాజిక దృష్టితో పరిశీలిస్తే పరిషత్ ఎన్నికలు గ్రామీణ ప్రజాస్వామ్యాన్ని చైతన్యవంతం చేసే ప్రక్రియ. మహిళల రిజర్వేషన్లు, వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం, యువ నాయకత్వానికి అవకాశాలు ఇవన్నీ స్థానిక పాలనను సమగ్రంగా మారుస్తాయి. ఎన్నికలు జరిగితే గ్రామస్థాయి నాయకత్వం పునరుద్ధరించ బడుతుంది. ప్రజల సమస్యలు నేరుగా ప్రతినిధుల దృష్టికి చేరుతాయి. పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం పెరుగుతుంది. ఆర్థిక పరంగా ప్రజా పరిషత్‌ల ప్రాముఖ్యత మరింత స్పష్టంగా కనిపిస్తుంది. గ్రామీణ మౌలిక వసతులు రహదారులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, పాఠశాల సదుపాయాలు ఇవన్నీ స్థానిక సంస్థల ద్వారానే అమలవుతాయి. ఎన్నికలు ఆలస్యం అయితే అభివృద్ధి కార్యక్రమాల్లో నిరంతరత దెబ్బ తింటుంది. ప్రజాప్రతినిధులు లేకపోవడం వల్ల స్థానిక అవసరాలు ఉన్నతస్థాయికి చేరే ప్రక్రియ మందగిస్తుంది. అందువల్ల పరిషత్ ఎన్నికలు నిర్వహించడం గ్రామీణ అభివృద్ధికి వేగం అందించే చర్యగా భావించ బడుతోంది. రాజకీయ వ్యూహాల పరంగా అన్ని పార్టీలు గ్రామీణ స్థాయిలో తమ బలగాలను పునర్వ్యవస్థీకరిస్తున్నాయి. అధికార పక్షం ఇటీవల వచ్చిన విజయాల ఊపును కొనసాగించాలని చూస్తే, ప్రతిపక్షాలు తమ లోపాలను సరిదిద్దుకొని కొత్త వ్యూహాలతో ముందుకు రావాలని ప్రయత్నిస్తున్నాయి. అభివృద్ధి, సంక్షేమం, స్థానిక సమస్యల పరిష్కారం.. ఇవే ప్రధాన ప్రచార అజెండాలుగా మారే అవకాశం ఉంది. ప్రభుత్వ దృష్టిలో ఎన్నికల సమయం నిర్ణయం సున్నితమైన అంశం. పరిపాలనా సిద్ధత, న్యాయపరమైన అంశాలు, రాజకీయ సమీకరణాలు... ఇవన్నీ సమతుల్యంగా ఉండాలి. త్వరితగతిన ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాస్వామ్య పునరుద్ధరణకు దోహదం అవుతుంది. అదే సమయంలో అన్ని ప్రక్రియలు చట్టబద్ధంగా, పారదర్శకంగా పూర్తి కావడం కూడా అవసరం. ప్రజల నమ్మకం నిలబెట్టుకోవడం ప్రభుత్వానికి అత్యంత ముఖ్యమైన అంశం. చివరగా చూస్తే ప్రజా పరిషత్ ఎన్నికలు గ్రామీణ ప్రజాస్వామ్య బలాన్ని ప్రతిబింబించే కీలక ప్రక్రియ. ఇటీవలి స్థానిక ఎన్నికల ఫలితాలు, ప్రభుత్వ యోచనలు, పరిపాలనా సన్నాహాలు... ఇవన్నీ కలిసి ఒక కీలక రాజకీయ దశను సూచిస్తున్నాయి. గ్రామీణ ప్రజల ఆశలు, అవసరాలు, అభివృద్ధి లక్ష్యాలు ఈ ఎన్నికల ద్వారా స్పష్టమైన దిశను పొందగలవు. ప్రజాస్వామ్య వ్యవస్థ పునాది గ్రామంలోనే బలపడితేనే రాష్ట్ర పరిపాలన సమగ్రంగా ముందుకు సాగుతుంది. పరిషత్ ఎన్నికలు ఆ దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా నిలిచే అవకాశముంది.

(వ్యాసరచయిత సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

హలాల్... అపోహలు, వాస్తవాలు!!

యండి. ఉస్మాన్ ఖాన్
9912580645

ఇటీవలి కాలంలో 'హలాల్' అనే పదం చుట్టూ సామాజిక మాధ్యమాల్లో, కొన్ని సెలక్టెడ్ వేదికలలో వివాదాలు చెలరేగుతున్నాయి. ముఖ్యంగా ఒక వీడియోలో జర్నలిస్టుగా చెప్పుకుంటున్న ఒక మహిళామణి బన్‌ను కోసి దానిపై ఉమ్మివేసి, 'ఇదే హలాల్' అని చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టించే వ్యాఖ్యలు చేయడం చర్చకు దారి తీసింది. ఈ నేపథ్యంలో అసలు హలాల్ అంటే ఏమిటి? హలాల్ ప్రక్రియ ఎలా ఉంటుంది? ఆరోగ్య పరంగా, సామాజికంగా దాని స్థానం ఏమిటి? ఇటువంటి అపోహలు ఎందుకు వ్యాపిస్తున్నాయి? అనే అంశాలను తెలుసుకోవడం అవసరం.

1. హలాల్ - అసలు అర్థం ఏమిటి?

'హలాల్' (Halal) అనే పదం అరబిక్ భాషకు చెందినది. దీని అర్థం అనుమతించబడినది, ధర్మబద్ధమైనది. దీనికి విరుద్ధ పదం 'హరామ్' అంటే నిషేధించబడినది. ఇస్లామీ ధర్మ గ్రంథమైన ఖురాన్ ప్రకారం ముస్లింలు ఏవి తినాలి, ఏవి తినకూడదు అనే మార్గదర్శకాలు ఉన్నాయి. అందులో: పంది మాంసం నిషేధం. మత్తు పదార్థాలు (మద్యం, తదితరాలు) నిషేధం. రక్తం తినడం నిషేధం. హలాల్ భావన కేవలం మాంసానికి మాత్రమే కాకుండా, వ్యాపారం, ఆర్థిక వ్యవహారాలు, ఔషధాలు, కాస్మెటిక్స్, జీవన విధానం మొత్తానికీ వర్తిస్తుంది. అంటే, ధర్మబద్ధమైన జీవన విధానం అన్నమాట.

2. హలాల్ ఆహారం - ప్రక్రియ ఏమిటి?

శాకాహార పదార్థాలు

బన్, రొట్టె, బిస్కెట్, పండ్లు, కూరగాయలు వంటి ఇతర అనేక పదార్థాలు స్వతహాగా హలాల్‌గా పరిగణించబడతాయి. ఇక్కడ ఎలాంటి వధ ప్రక్రియ ఉండదు. కాబట్టి 'బన్‌ను కోసి ఉమ్మివేయడం హలాల్ ' అనే వాదనకు అసలు ఆధారమే లేదు.

మాంసాహార పదార్థాలు - జబీహా విధానం.

హలాల్ మాంసం కోసం జంతువును నిర్దిష్ట పద్ధతిలో వధిస్తారు: అందుకు, జంతువు ఆరోగ్యంగా ఉండాలి. ఒకేసారి గొంతు నరాలు కోయాలి. రక్తం పూర్తిగా బయటకు రావాలి. దేవుని పేరు పలికి జుబహ్ చేయాలి ఈ విధానాన్ని 'జబీహా' అంటారు.

శుభ్రతపై ఇస్లామీయ దృష్టికోణం

ఇస్లాం ధర్మంలో శుభ్రతకు అత్యంత ప్రాముఖ్యత ఉంది. ప్రవక్త వారి సంప్రదాయంలో 'శుభ్రత విశ్వాసంలో సగం' అని చెప్పబడింది. ఉమ్మి, రక్తం, మలిన పదార్థాలు 'నజిస్' (అశుద్ధమైనవి)గా పరిగణించబడతాయి. అందువల్ల: ఆహారంలో ఉమ్మివేయడం హలాల్ కాదు. అది హరామ్ (నిషేధం). ఇది ధార్మికంగా, నైతికంగా, ఆరోగ్యపరంగా కూడా తప్పు. ఇటీవలి వీడియోలో చేసిన ఆరోపణ ఏమిటంటే, ఒక మహిళామణి బన్‌ను కోసి



దానిపై ఉమ్మివేసి 'ఇదే హలాల్' అని చెప్పడం ముమ్మాటికీ తప్పు నిజానికి, హలాల్ ప్రక్రియతో దీనికి ఎలాంటి సంబంధం లేదు. నైతికంగా, ఆహారంలో ఉమ్మివేయడం అనాగరిక చర్య. సామాజికంగా, ఇది ఒక సమాజాన్ని అవమానించేలా తప్పుడు ప్రచారం చేయడం. ఇలాంటి వ్యాఖ్యలు సామాజిక విద్వేషాన్ని పెంచే అవకాశం ఉంది.

ఇప్పుడు హలాల్ సర్టిఫికేషన్ అంటే ఏమిటో చూద్దాం.

హలాల్ సర్టిఫికేట్ అనేది ఒక ఉత్పత్తి ఇస్లామిక్ ప్రమాణాలకు అనుగుణంగా తయారైందని ధృవీకరించే ప్రక్రియ.

ప్రక్రియ ఎలా ఉంటుందంటే;

తయారీ యూనిట్ ను, ఉపయోగించిన పదార్థాలను పరిశీలిస్తారు. నిల్వ, రవాణా విధానాలను తనిఖీ చేసి ప్రమాణాలు సరిగా ఉన్నట్లయితే, సర్టిఫికేట్ జారీ చేస్తారు. ఇది ప్రధానంగా ఎగుమతుల కోసం అవసరం అవుతుంది. ముస్లిం దేశాలకు సరుకు ఎగుమతి చేయాలంటే ఆయా దేశాలు హలాల్ ప్రమాణాలు కోరవచ్చు. ఆరోగ్యపరంగా, శాస్త్రీయ కోణంలో చూసినట్లయితే, హలాల్ మాంసం అన్ని విధాలా శ్రేయస్కరం. రక్తం పూర్తిగా బయటకు రావడం వల్ల మాంసంలో రక్తం ఉండిపోదు. రక్తం సేవించడం ఆరోగ్యానికి హానికరమని వైద్యరంగ నిపుణులు చెబుతున్నారు. శుభ్రత నియమాలు పాటించడం వల్ల హైజీన్ మెరుగ్గా ఉండి నిల్వ సామర్థ్యం మెరుగు పడే అవకాశం ఉంటుంది. అందుకని, ఆరోగ్య ప్రయోజనాల విషయంలో అతిశయోక్తి చేయకుండా, ఎవరికి ఏది నచ్చితే అది తినవచ్చు. దీన్ని వివాదం చేయాల్సిన అవసరమే లేదు. హలాల్ కావాలనుకునే వాళ్ళు హలాల్ తినవచ్చు, వద్దు అనుకునే వాళ్ళు హలాల్ కానిది తినవచ్చు. ఎవరు ఏది తినాలో అది పూర్తిగా వారి ఇష్టం. అది రాజ్యాంగం ప్రసాదించిన హక్కు.

మరి వివాదాలు ఎందుకు వస్తున్నాయి?

హలాల్ అంశంపై వివాదాలకు కారణమేమిటంటే, సరైన అవగాహన లేకపోవడం, సోషల్ మీడియాలో అపోహలు వ్యాప్తి చేయడం, రాజకీయ ప్రయోజనాలకోసం ప్రజల మత భావోద్వేగాలను రెచ్చగొట్టడం, ఒక సమాజపు ఆచారాన్ని వక్రీకరించి చూపించడం ద్వారా వైరల్ కంటెంట్ సృష్టించి ప్రచారం పొందడం, పాపులర్ కావాలని చూడడం. ఇలా పబ్లిక్ వేదికల్లో ఒక వర్గాన్ని టార్గెట్ చేస్తూ, తప్పుడు ప్రచారం చేయడం ఒక మత సమూహంపై ద్వేషం రేకెత్తించే వ్యాఖ్యలు చేయడం చట్టరీత్యా నేరం. ఇలాంటి మత విద్వేషాలు రెచ్చగొట్టే మతోన్మాదులపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఏది పడితే అది, నోటికి ఎంతొస్తే అంత వాగే ఉన్మాదులను ఇలాగే వదిలేస్తే, వారు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉంది. సమాజంలో శాంతిని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, సదరు ఉన్మాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి. మనం చాలా స్పష్టంగా తెలుసుకోవాల్సింది ఏమిటంటే, హలాల్ అంటే ఉమ్మివేయడం కాదు. ఉమ్మి అశుద్ధమైనది. హలాల్ కిందికి రాదు శాకాహార బన్‌కు ఎలాంటి హలాల్ ప్రక్రియ ఉండదు. మరే పదార్థానికీ ఆ ప్రక్రియ వర్తించదు. హలాల్ అనేది ఒక ధార్మిక ఆహార ప్రమాణం మాత్రమే. హలాల్ అనే భావనపై వ్యాప్తి చెందుతున్న ఈ ఆరోపణలు, కావాలని, ఉద్దేశ్య పూర్వకంగా సృష్టిస్తున్నవే. సమాజంలో శాంతి, పరస్పర గౌరవం నిలబడాలంటే, నిజమైన సమాచారాన్ని తెలుసుకోవాలి. అపోహలకు లోను కాకూడదు. భావోద్వేగాల కంటే వాస్తవాలకు ప్రాముఖ్యత ఇవ్వాలి. హలాల్ ఒక ధార్మిక ప్రమాణం. అది ఎవరూ ఎవరిపైనా బలవంతంగా రుద్దేది కాదు. కానీ కొంతమంది మతోన్మాద ముఠా చేస్తున్న తప్పుడు ప్రచారం సమాజంలో అపోహలు సృష్టించడమే కాదు, సమాజంలో విద్వేష బీజాలు నాటి విచ్ఛిన్నతకు దారితీసే ప్రమాదం ఉంది. ప్రజలు నిజానిజాలు తెలుసుకొని విచ్ఛిన్నకర శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

కేసీఆర్ వ్యూహాత్మక మౌనం..!?

అంబీర్ శ్రీకాంత్
81859 68059

ఇటీవల కాలంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి.. మాజీ సీఎం కేసీఆర్‌ను చాలా గట్టిగా అటాక్ చేస్తున్నారు. తాము పవర్‌లో ఉన్నామని ప్రతీ ఎన్నికను గెలుస్తూ వస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రిగా రేవంత్ తీవ్రమైన పదజాలంతో ఒక్కోసారి మాటల దాడి యుద్ధం చేసినట్లుగానే చేస్తున్నారు. అయితే, ఏ సందర్భంలోనూ ప్రతిపక్ష నేతగా ఉన్న కేసీఆర్ స్పందన కనీసంగా కనిపించడం లేదు. దీంతో ఇక కారు పని ఖతం అని 'చేతి' పార్టీ నేతలు ఒక రకంగా విజయం మరోసారి తమదే అన్నట్లుగానే భావిస్తున్నారు. సీఎం రేవంత్ అయితే మరో టర్మ్ సీఎంగానూ ఉంటానని బాహాటంగానే ప్రకటనలు చేస్తున్నారు. అయితే, ఇక్కడే అసలు చిక్కువచ్చింది. ప్రభుత్వంపై అసంతృప్తి చిలికి చిలికి గాలి వానగా మారడానికి ఎక్కువ సమయం పట్టకపోవచ్చు. రేవంత్ మరోసారి సీఎం అంటూ చేసిన ప్రకటనపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఇక మరో రెండున్నరేండ్లు అధికారంలో ఉండేది కాంగ్రెస్ పార్టీనే కాబట్టి ఉప ఎన్నికలతో పాటు స్థానిక, మున్సిపల్ ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చినట్లు భావించవచ్చు. కానీ, ఒక్కొక్కటిగా హామీలు, క్షేత్రస్థాయిలో అమలుపైన ప్రధాన ప్రతిపక్ష హోదాలో మాజీ సీఎం ప్రశ్నలు సంధించే కాలం వస్తే ఎలా ఉంటుంది? అనే ప్రశ్నకు సమాధానం.. కచ్చితంగా చక్కటి స్పందన రావచ్చు.

సరైన సమయం, సందర్భం

పదేండ్ల పాటు ముఖ్యమంత్రిగా ఏకఛత్రాధిపత్యం వహించిన కేసీఆర్‌కు ప్రస్తుత ప్రభుత్వ పోకడలపైన ప్రశ్నించడానికి సరైన సమయం, సందర్భం ఇంకా దొరకలేదని భావించలేం. కానీ, ఆయన సరైన సందర్భంలోనే వ్యూహం ప్రకారమే మౌనం వీడి పోరుబాటలోకి వస్తారనే ఊహాగానాలు వినబడుతున్నాయి. అపర చాణక్యుడిగా రాజకీయాల్లో పేరు గాంచిన కేసీఆర్.. తన వెంట జనం నడిచేలా చేసేందుకు.. తాను జనంలోకి ఎలా వెళ్లాలనే దానిపైనా సుదీర్ఘంగా కసరత్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. తాను క్షేత్రస్థాయిలోకి రాకపోయినా బీఆర్ఎస్ ప్రధాన ప్రతిపక్ష హోదాలో గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో బలంగా నిలబడుతోంది. ఈ క్రమంలోనే ఎన్నికలకు ఏడాదిన్నర లేదా ఏడాది ముందు బహిరంగ సభలు, లేదా ప్రజలతో రచ్చబండ నిర్వహణ వంటి కార్యక్రమాల రూపకల్పనకు ఆలోచన చేస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే స్థానిక సర్పంచ్ ఎన్నికలు, మున్సిపల్ ఎలక్షన్స్, బై ఎలక్షన్‌పైనా అంతగా గట్టిగా పోరు జరపలేదనే వాదనలూ ఉన్నాయి. ఇప్పుడే పోరు బాటలో బీఆర్ఎస్ శ్రేణులను



సమాయత్తపరిస్తే.. మరో రెండేండ్ల పాటు వారిలో అదే ఉత్తేజాన్ని కొనసాగించడంకష్టతరమని భావించే.. సరైన సమయం, సందర్భంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంట్రీ పొలిటికల్‌గా స్ట్రాంగ్‌గా ఉండబోతుందనే డిస్కషన్స్ పొలిటికల్ సర్కిల్స్‌లో జరుగుతున్నాయి. మొత్తంగా రాబోయే 'పరిషత్' ఎన్నికలలోనూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కంటే కూడా ఆయన మార్గదర్శనంలో కేటీఆర్, హరీశ్ తదితర లీడర్లు కీలక పాత్ర పోషించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. ఎన్నికల అనంతరం ప్రభుత్వంపై వ్యతిరేకత ఏ స్థాయిలో ఉందనే అంచనా, క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజల ఆదరణ, లీడర్ల తీరుపైనా రిపోర్టులను తెప్పించుకుని మరీ రివ్యూ చేసుకున్న తర్వాతనే బలమైన వ్యూహంతో మరోసారి కదనరంగంలోకి కేసీఆర్ అడుగు పెట్టేలా ప్రణాళికలు రచించుకుంటున్నట్టు తెలుస్తున్నది.

(వ్యాస రచయిత జర్నలిస్ట్)

ప్రాంతీయం

ఏఐ భద్రతే మా ప్రథమ ప్రాధాన్యం

- ఆవిష్కరణలకు అది అడ్డంకి కాదు
- ఏఐ 21వ శతాబ్దపు 'ఏరోడైనమిక్స్'
- త్వరలో ఏఐ యూనివర్సిటీ, ఏఐ హబ్ ఏర్పాటు,
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19 : కృత్రిమ మేధ రంగంలో వేగం ఎంత ముఖ్యమో, భద్రత అంతకంటే ముఖ్యమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఏఐ భద్రతను ఆవిష్కరణలకు అడ్డుగోడగా కాకుండా 21వ శతాబ్దపు 'ఏరోడైనమిక్స్'గా భావిస్తున్నామని తెలిపారు. డిజిటల్ గవర్నెన్స్ అడ్వయిజరీ - ఆల్ బ్రైట్ స్టోన్‌బ్రిడ్జ్ గ్రూప్ వంటి గ్లోబల్ వ్యూహాత్మక సంస్థల ప్రతినిధులు, ఏఐ సేఫ్టీ నిపుణులను ఉద్దేశించి మంత్రి కీలకోపన్యాసం చేశారు. నియంత్రణలు లేకుండా సాధించే వేగవంతమైన వృద్ధి తాత్కాలికంగా ఆకర్షణీయంగా కనిపించినా, సరైన భద్రతా ప్రమాణాలు లేకపోతే ఒక్క పొరపాటు దశాబ్దాలుగా నిర్మించిన ప్రజా విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని హెచ్చరించారు. కృత్రిమ మేధ ఆవిష్కరణలకు ప్రపంచంలోనే ఒక ముఖ్య కేంద్రంగా నిలబడేలా తెలంగాణాను తీర్చుదిద్దుతున్నామని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రధర్ బాబు వెల్లడించారు. వేగంగా దూసుకుపోతున్న టెక్నాలజి ప్రపంచంతో పోటీ పడాలన్నదే తమ సంకల్పం అని ఆయన అన్నారు.

ఏఐ యూనివర్సిటీ,
ఏఐ హబ్ ల ఏర్పాటు,

ప్రతిభావంతులతో కూడిన స్కిల్ ఫోర్స్ ను అందుబాటులోకి తెచ్చేందుకు త్వరలో ప్రవేశ పెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో అత్యంత ప్రాధాన్యతనిస్తాం. మంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం 80 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉన్న హైదరాబాద్ వృద్ధిలో సగానికి పైగా టెక్నాలజీ రంగం కృషేనన్నారు.1980లలో చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న షెన్‌జెన్ తయారీ రంగంపై దృష్టి సారించి నేడు 500 బిలియన్ డాలర్ల దిగ్గజంగా ఎదిగిందని ఉదాహరించారు.తెలంగాణ కూడా ఇప్పుడు అలాంటి చారిత్రక మలుపులోనే ఉందని, అయితే మన ఇంజిన్ తయారీ రంగం కాదు, టెక్నాలజీ అని తెలిపారు.2035 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవడమే లక్ష్యమని ఉద్ఘాటించారు.

తెలంగాణ డేటా ఎక్స్ఛేంజ్

28 ప్రభుత్వ శాఖలకు చెందిన 1,084 డేటా సెట్ల (500 జీబీ)ను ప్రజోపయోగంగా మార్చామని, ప్రస్తుతం 360 ఏఐ మోడల్స్ వాటిని వినియోగిస్తున్నాయని వివరించారు. 950 మందికి పైగా నిపుణులు, స్టార్టప్‌లు ఈ వేదికపై పనిచేస్తున్నట్లు తెలిపారు.

గీతంలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 19 : హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం (ఫిబ్రవరి 19న) ఛత్రపతి శివాజీ మహారాజ్ 396వ జయంతి సందర్భంగా, ప్రాంగణంలో నెలకొని ఉన్న ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. శివాజీ శాశ్వత వారసత్వాన్ని ప్రతిబింబించేలా సాగిన ఈ వేడుకలలో, ఆయనను భారతదేశపు గొప్ప యోధ రాజులు, దార్శనిక పాలకులలో ఒకరిగా గుర్తుచేసుకున్నారు. సైనిక నాయకత్వం మాత్రమే కాకుండా, ఆదర్శప్రాయమైన పరిపాలన, న్యాయం పట్ల నిబద్ధత, అన్ని వర్గాల పట్ల గౌరవానికి కూడా ఆయన ప్రసిద్ధి చెందారని కొనియాడారు. గీతం హైదరాబాదు అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మతో కలిసి మరాఠా నాయకుడికి పుష్పగుచ్ఛాలు అర్పించారు. వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది కూడా ఈ సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని, శివాజీ మహారాజ్ ధైర్యం, సుపరిపాలన, సామాజిక సామరస్యం యొక్క ఆదర్శాలను పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా, ఒక అధ్యాపకుడు, ఒక భద్రతాధికారి, ఒక విద్యార్థి ప్రతినిధి శివాజీ యొక్క అద్భుత విజయాలు, చారిత్రక సంఘటనలను వివరించారు. ముఖ్యంగా, శివాజీ మహారాజ్ వంశంతో ముడిపడి ఉందని నమ్ముతున్న మరాఠీ కుటుంబానికి చెందిన విద్యార్థి వక్త, ఆయన స్ఫూర్తిదాయకమైన జీవితం, విలువలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. సమకాలీన సమాజంలో శివాజీ మహారాజ్ విలువల ఔచిత్యాన్ని విద్యార్థి లైఫ్ మేనేజర్, ఈ కార్యక్రమ సమన్వయకర్త ఫిజా అహ్మద్ వివరించారు. భారతదేశం అంతటా, అంతకు మించి తరాలకు స్ఫూర్తినిస్తూనే ఉన్న శివాజీ మహారాజ్ రూపొందించిన నాయకత్వం, సమగ్రత, ఐక్యత యొక్క ఆదర్శాలను నిలబెట్టడానికి పునరుద్ధరించిన ప్రతిజ్ఞతో వేడుక ముగిసింది.

కేసీఆర్‌ను విమర్శించడం తగదు

- కడియం శ్రీహరిపై పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 19: జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి మాజీ మంత్రి కడియం శ్రీహరిపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల కేసీఆర్ పై కడియం శ్రీహరి చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. ఈ సందర్భంగా డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, రాజకీయాల్లో పదవులు, అవకాశాలు కల్పించిన నాయకత్వాన్ని విమర్శించడం తగదని అన్నారు. గతంలో వివిధ పదవులు నిర్వహించిన కడియం శ్రీహరి ఇప్పుడు విభిన్న వ్యాఖ్యలు చేయడం ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. అలాగే, రాజకీయాల్లో స్థిరత్వం, విలువలు ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన తీర్పు ఇస్తారని వ్యాఖ్యానించారు.

ఎనిమిది మంది ఇంజనీర్లపై వేటు

- విద్యుత్ సంస్థలో అవినీతిపై ప్రభుత్వం ఉక్కుపాదం
- డిజిటల్ చెల్లింపుల ద్వారా లంచాలు తీసుకున్న వ్యవహారం

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, ఫిబ్రవరి 19 : వినియోగదారుల నుంచి లంచాలు తీసుకొని అవినీతికి పాల్పడిన ఎనిమిది మంది అధికారులపై టీజీఎస్పీడీసీఎల్ సస్పెన్షన్ వేటు వేసింది. గత 12 ఏళ్లలో ఒకేసారి ఇంతమంది ఉద్యోగులను సస్పెండ్ చేయడం ఇదే ప్రథమం. సస్పెన్షన్‌కు గురైన అధికారులు ఫోన్‌పే, గూగుల్ పే వంటి యాప్‌ల ద్వారా లంచాలను తీసుకున్నారు. ఆన్‌లైన్ లావాదేవీల ఆధారంగా విచారణలో అడ్డంగా దొరికిపోయారు. దక్షిణ డిస్కమ్ అవినీతి నిరోధక సెల్ (040 2345 4884, 76809 01912)కు అవినీతి ఆరోపణలపై వచ్చిన 90కిపైగా ఫిర్యాదులపై విజిలెన్స్ విభాగం విచారణ చేపట్టింది. ఈ విచారణలో 8 మంది అధికారులు లంచాలను ఆన్‌లైన్ విధానంలో వసూలు చేసినట్టు తేలింది. దాంతో వారందరినీ సస్పెండ్ చేశారు. సస్పెండ్ అయిన వారిలో భువనగిరి ఆపరేషన్ సర్కిల్‌కు చెందిన ఏడీఈ ఆర్.ఆనందరెడ్డి(భారత్ పెట్రోల్ పంప్‌లో ఎలక్ట్రిక్ ఛార్జింగ్ కేంద్రం కనెక్షన్ కోసం ఫోన్‌పే ద్వారా రూ.5 వేలు వసూలు చేశారు), గద్వాలలోని శాంతినగర్ ఆపరేషన్ సర్కిల్‌కు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ చిన్న సుబ్బరాయుడు(2023 నవంబరు 25న ఫోన్‌పే ద్వారా రూ.25 వేలు) ఉన్నారు. అలాగే, సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్‌కు చెందిన సబ్ ఇంజనీర్ జి.మధుసూదన్(అవినీతి ఆరోపణలు నిర్ధారణ), యాదాద్రి భువనగిరి చౌటుప్పల్‌కు చెందిన లైన్‌మెన్ జిల్లపల్లి శ్రీనివాస్(శాఖ అనుమతి లేకుండా 5 హెచ్‌పీల త్రీ ఫేజ్ కనెక్షన్ కోసం రూ.45 వేలు తీసుకున్నట్లు నిర్ధారణ), గద్వాల అల్వాల్‌పాడ్ లైన్‌మెన్ షేక్ షావలి(రూ.2500ల లంచం తీసుకున్నట్లు నిర్ధారణ), సైబర్‌సిటీలోని జుంటుపల్లి జూనియర్ లైన్‌మెన్ దప్పు అంజయ్ (డీటీఆర్ మంజూరులో జాప్యం చేసి, డబ్బులు తీసుకున్నారు), హైదరాబాద్ సౌత్‌లోని మలక్‌పేట సెక్షన్‌లోని ఆర్టిజన్ గ్రేడ్ 2 మహ్మద్ ఖలీల్, మేడ్చల్‌లోని భాగ్యనగర్ సర్కిల్‌కు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ షాబాజ్‌అహ్మద్ ఉన్నారు. షాబాజ్ అహ్మద్ అడ్డగుట్టలో అపార్ట్‌మెంట్ కనెక్షన్ అంచనాల తయారీకి తొలుత రూ.20వేలు, ఆ తర్వాత మరో రూ.20వేలు ఇవ్వాలని డిమాండ్ చేయడం, లైన్ మార్చడానికి మరో రూ.90వేలు డిమాండ్ చేసి ఇబ్బందులకు గురిచేసినట్టు తేలింది. ఈ 8మంది సస్పెన్షన్‌కు సంబంధించిన ఉత్తర్వులను దక్షిణ డిస్కమ్ సీఎండీ ముషారఫ్‌అలీ జారీ చేశారు. సస్పెన్షన్ గురైన వారిపై అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో వీరిందరినీ విధు ల నుంచి శాశ్వతంగా తొలగించే అవకాశం ఉంది.

క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు పేస్కేల్ అమలు చేయండి

- ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 19: ప్రభుత్వం క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్సీ డా. చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. ఇవాళ సంగారెడ్డి జిల్లా రామచంద్రపురంలోని ఆయన స్వగృహంలో తెలంగాణ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ల సంఘం నాయకులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఉద్యోగులు నిరసన దీక్షలకు మద్దతు తెలుపుతూ అప్పటి టిపిసిసి అధ్యక్షుడి హోదాలో సీఎం వారి సమస్యలను అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, రెండేళ్లు గడిచిన వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. వారికి ఇచ్చిన హామీ ప్రకారం, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కెజిబివి కాంట్రాక్ట్ ఉద్యోగులతో సమానంగా మహిళా సిఆర్పీలకు 6 నెలల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలన్నారు. డిఎస్సీ, గురుకుల టీచర్ నియామకాలలో సిఆర్పీలకు 30% వేయిటేజి ఇచ్చి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు రవాణా భత్యం , ఫోన్ బిల్లులు చెల్లించాలన్నారు. భవిష్యనిధి , గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వారికి నగదు రహిత వైద్య సదుపాయం, హెల్త్ కార్డుల సౌకర్యం కల్పించాలన్నారు. అంతేకాకుండా విధి నిర్వహణలో మరణించిన క్లస్టర్ రిసోర్స్ పర్సన్లకు ఎక్స్ గ్రేషియా చెల్లించాలన్నారు. ఖాళీగా ఉన్న మరియు పరస్పర అంగీకారంతో జిల్లా, అంతర్ జిల్లాల బదిలీలకు అవకాశం కల్పించాలన్నారు. ఉద్యోగులకు బీజేపీ, తాము ఎల్లప్పుడు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంతోష్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

చారిత్రక పరిశోధక నవలలు రావాలి

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో హైదరాబాద్, ఫిబ్రవరి19 : తెలంగాణ తరగని చారిత్రక గని అని, అనేక చారిత్రక పరిశోధక నవలలు ఈ ప్రాంతం నుంచి రావాలని బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కాంక్షించారు. పరిశోధక రచయిత వర్దెల్లి వెంకటేశ్వర్లు రాసిన కొండమల్లు నవలను నమస్తే తెలంగాణ ఎడిటర్ తిగుళ్ల కృష్ణమూర్తితో కలిసి వెంకటేశ్వర్లు గురువారం సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని నివాస గృహంలో కేసీఆర్ కు అందించారు. 800 ఏళ్లనాటి పలనాటి సీమ చారిత్రక, చెంచు సామాజిక అంశాలను కొత్త దృష్టితో, మరికొంత పరిశోధనతో రాసిన నవల మూల కథను కేసీఆర్ అడిగి ఆసక్తిగా విన్నారు. నల్లగొండ, నాగర్ కర్నూల్ జిల్లాల నుంచి మొదలై ఆంధ్ర,రాయలసీమ వరకు విస్తరించిన నల్లమల చెంచుల జీవనం సంస్కృతి, ప్రస్తుతం వారి అవసరాలను కేసీఆర్ ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. వీలుచుసుకొని నవల చదువుతానని చెప్పారు. తెలంగాణకు వర్ధమాన సాహిత్యకారుల అవసరం ఉన్నదని కేసీఆర్ అన్నారు. ఈ సందర్భంగా రచయిత వర్దెల్లి వెంకటేశ్వర్లు అభినందించారు. భవిష్యత్తుతో తెలంగాణ చారిత్రక అంశాల మీద దృష్టి సారించి నవలా రాయాలని సూచించారు. రాజధానిని విస్తరించాలనే ఆకాంక్షతో చెంచు పెంటల మీద బ్రహ్మనాయుడు సైన్యాలు దండెత్తడం, దెబ్బతిన్న చెంచుల నాయకుడు బయ్యన్న కారుకోడిని పట్టుకొని, దాన్ని కొండమల్లుగా తీర్చిదిద్ది ప్రతీకారం తీర్చుకోవడమనే చారిత్రక, సామాజిక కథతో ఉత్కంఠగా, ఆసక్తిగా సాగే కొండమల్లు నవలను ఇటీవల మాజీ మంత్రి హరీశ్ రావు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, అల్లం నారాయణ, ప్రముఖ నవలాకారులు బండి నారాయణ స్వామి, అట్టాడ అప్పల నాయుడు తదితరులు ఆవిష్కరించారు.

గుండెపోటుతో రిమాండ్ ఖైదీ మృతి

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 19 : గుండెపోటుతో సంగారెడ్డి సెంట్రల్ జైలు రిమాండ్ ఖైదీ మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. గత నెల 31న హత్యాయత్నం, రివాల్వర్ తో బెదిరించిన కేసులో జైలుకు వచ్చిన విట్టల్(61) గురువారం రోజు ఉదయం జైలులో విట్టల్ కి గుండెపోటు రాగా సంగారెడ్డి జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ విట్టల్ మృతి చెందాడు. విట్టల్ స్వస్థలం సంగారెడ్డి జిల్లా వట్ పల్లి (మం) మర్వెల్లి గ్రామానికి చెందినవారని విఠల్ మృతికి కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సివుంది.

శివాజీ మహారాజును ఆదర్శంగా తీసుకోవాలి

- సర్పంచ్ గొడుగు యాదయ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 19 : ప్రతి ఒక్కరు శివాజీ మహారాజును ఆదర్శంగా తీసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని గ్రామ సర్పంచ్ గొడుగు యాదయ్య, ఎస్సై వెంకన్న లు అన్నారు. శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శివాజీ మహారాజ్ పరాక్రమం, దూరదృష్టి, ప్రజల పట్ల ప్రేమ, స్వాభిమాన భావం మనందరికీ స్ఫూర్తి ప్రదాతలు అని వక్తలు అన్నారు. స్వరాజ్యం కోసం ఆయన చేసిన పోరాటం భారత చరిత్రలో సువర్ణాక్షరాలతో నిలిచిపోయింది అని తెలిపారు. ఈ పవిత్ర దినాన ఆయన చూపిన ధర్మ మార్గం, న్యాయం, నాయకత్వ లక్షణాలను మన జీవనంలో ఆచరిద్దాం అని సూచించారు. సమాజ సేవలో దేశాభివృద్ధిలో ముందుండేలా ప్రతిజ్ఞ చేద్దాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కనకమామిడి మురళీధర్ రెడ్డి, నాలుగో వార్డు సభ్యులు లు మహేష్, అప్పారెడ్డి గూడ సర్పంచ్ అశోక్ గౌడ్, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఇండియాలో మాకు లభించిన ప్రేమ గుర్తుండిపోతుంది. ప్రేక్షకుల మద్దతుకు ధన్యవాదాలు. అహ్మదాబాద్, చెన్నై, ఢిల్లీలో మ్యాచ్‌లకు భారీ సంఖ్యలో వచ్చారు. మేం అఫ్గాన్‌లో మా సొంత ప్రేక్షకుల ముందు ఆడుతున్నట్లు అనిపించింది. మైదానంలోనే కాదు.. ఎక్కడికెళ్లినా ప్రేమ లభించింది. మాకు మద్దతు కొనసాగించండి.

- అఫ్గాన్ కెప్టెన్ రషీద్ ఖాన్

వ్యవసాయ రంగ బలోపేతానికి డీలర్లకు డిప్లమో శిక్షణ

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి , ఫిబ్రవరి 19 : వ్యవసాయ రంగంలో డీలర్ల సామర్థ్యవృద్ధి లక్ష్యంగా నిర్వహిస్తున్న "డిప్లమో ఇన్ అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ సర్వీస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్" కార్యక్రమం గురువారం పిడి, ఆత్మ కార్యాలయంలో ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసం అనేక పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నదని తెలిపారు. వ్యవసాయ శాఖలో ఏఈవోలు, ఏవోలు వంటి సిబ్బంది ఉన్నప్పటికీ ప్రతి రైతు వరకు సమగ్ర అవగాహన చేరడానికి పారా ఎక్స్టెన్షన్ పర్సనల్ పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఇన్‌పుట్ డీలర్లు వ్యవసాయ రంగంలో కీలక సలహాదారులుగా వ్యవహరించగలరని, ఈ డిప్లమో కార్యక్రమం ద్వారా వారి పరిజ్ఞానం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమానికి స్వచ్ఛందంగా నమోదు చేసుకుని ముందుకు వచ్చిన డీలర్లను అభినందిస్తూ, 48 సెక్షన్లలో ట్రైనర్లు ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అన్ని సెషన్లను క్రమంగా హాజరై, వినడంతో పాటు పరస్పర చర్చల ద్వారా మరింత జ్ఞానం సంపాదించుకోవాలని సూచించారు.రైతులకు నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించడం, నానో వ్యవసాయ సాంకేతికతలను విస్తరించడం, కొత్త వంగడాలు, కొత్త పంట రకాలు, ఆయిల్ పామ్ వంటి ఉద్యాన పంటలపై సరైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. రైతులు తమ సందేహాల నివృత్తి కోసం ముందుగా డీలర్లను సంప్రదిస్తారని, అందువల్ల ముందస్తు పరిజ్ఞానం కలిగి ఉండటం ద్వారా రైతులకు సముచిత సలహాలు, సూచనలు ఇవ్వగలరని అన్నారు. తద్వారా లాభదాయక పంటల సాగు వైపు రైతులను దారితీసే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, డీలర్లు, ట్రైనర్లు మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వార్డులో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

- 18వ వార్డు కౌన్సిలర్ సభ్యురాలు అరుణ రామకృష్ణ గౌడ్

ప్రతిపక్షం, మొయినాబాద్, ఫిబ్రవరి 19: వార్డులో నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని 18 వ వార్డు మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు అరుణ రామకృష్ణగౌడ్ తెలిపారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 18 వ వార్డులో కౌన్సిలర్ అరుణ రామకృష్ణ గౌడ్ సొంత నిధులతో వార్డులోని కుంట దగ్గర ఉన్న కొత్త బస్తీలో బోరు మోటర్ ను రిపేర్ చేయించి ప్రజలకు ఉపయోగంలోకి తీసుకురావడం జరిగిందన్నారు. వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని పెద్ద మంగళారం వార్డు ప్రజలకు నీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. వార్డులో ఏ సమస్య తలెత్తిన తమ దృష్టికి తీసుకురావాలని వార్డు ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రామకృష్ణ గౌడ్, మాజీ వార్డు సభ్యులు ధనరాజగౌడ్ , శ్రవణ్ గౌడ్, ప్రశాంత్ ,శ్రీకాంత్, సాయి, విజయ్, మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ఇండిపెండెంట్ కార్పొరేటర్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 19: కరీంనగర్ 10వ డివిజన్ ఇండిపెండెంట్ కార్పొరేటర్సాగాని కొమురయ్య హైదరాబాద్ లో భారతీయ జనతా పార్టీ లో చేరారు.ఈ కార్యక్రమం బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు, కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రిబండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో చేరారు. ఈ చేరికతో కరీంనగర్ రాజకీయాల్లో బీజేపీకి మరింత బలపడే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

సీఎం కప్ పోటీలకు కరీంనగర్ క్రీడాకారులు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 19: రాష్ట స్థాయి సీఎం కప్ పోటీలకు బయలుదేరిన క్రీడాకారులు ఈనెల 15నుండి 20వరకు జరుగుతున్న సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు కరీంనగర్ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి క్రీడ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు కరీంనగర్ నుండి బయలుదేరారు. 43 క్రీడాంశాలలో జరుగుతున్న పోటీలకు వీరు ప్రతిభ కనబరుచున్నారు. ఫుట్ బాల్, స్విమ్మింగ్, హాకీ, టేబుల్ టెన్నిస్, సాఫ్ట్ బాల్, కారట మొదలైనవి గచ్చిబౌలి మరియు నెట్ బాల్బాక్సింగ్ మహబూబ్నగర్, అథ్లెటిక్స్ హనుమకొండ, హ్యాండ్ బాల్ ఎల్బీ స్టేడియం, యోగ రంగారెడ్డి, కోకో నల్గొండ, కబడ్డీ నారాయణ పేట, బాస్కెట్బాల్ నిజామాబాద్, సెపక్త తక్రా వనపర్తి, మొదలైన జిల్లాలలో సీఎం కప్ రాష్ట్రస్థాయి క్రీడ పోటీలు జరుగుతున్నాయి. ఈ క్రీడాంశంలో ప్రతిభ కనబరిచి జిల్లాకి పేరు తేవాలని జిల్లా యువజన మరియు క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి తమ వంతు సహాయసహకారాలు అందిస్తున్న పి ఇ టి , పీ డి లకు అన్ని క్రీడా అసోసియేషన్ లకు ఒలింపిక్స్ అసోసిషయన్ లకు అయిన ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు

జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి

- డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి డిమాండ్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 18 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త జీరామ్ జీ పథకం ద్వారా కార్పొరేట్ వ్యవస్థల పనిచేయాల్సి వస్తుందని, ఈ పథకాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కాట్పల్లి నగేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం డిచ్పల్లి మండలం ముల్లంగి గ్రామంలో ఉపాధి హామీ కూలీలను కలిసి వారితో ఉపాధి హామీ పథకంపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరించారు. ఉపాధి హామీ పథకం గురించి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కేవలం గాంధీ పేరును రూపుమాపాలనే దురుద్దేశంతో ఉపాధి హామీ పథకాన్ని మార్చడం జరిగిందని, కేంద్ర ప్రభుత్వం 125 రోజులు పని కల్పిస్తాం అని చెప్తూనే అందులో 50 రోజుల పని వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై వేయడం జరుగుతుందన్నారు. తద్వారా రాష్ట్రాలపై అధిక భారం పడుతుందని అన్నారు. గతంలో ఉన్న ఉపాధి హామీ పథకం ద్వారా 100 రోజుల పని దినాన్ని గ్రామ ప్రజలు గ్రామ సభలు పెట్టి సంవత్సరంలో ఏ పని, ఏ సమయానికి చేయాలనే నిర్ణయం తీసుకునే కానీ, ఇప్పుడు వచ్చిన కొత్త జీ రామ్ జీ పథకం ద్వారా కార్పొరేట్ వ్యవస్థల పనిచేయాల్సి వస్తుందని, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని పాత పద్దతి మాదిగానే ఈ పథకాన్ని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ముల్లంగి గ్రామ సర్పంచ్ సుధం శ్రీను, మాజీ ఎంపీపీ నర్సయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగారెడ్డి, ఉప సర్పంచ్ అశోక్, మాజీ సర్పంచ్ మధుసూదన్, డిచ్పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్, గ్రామ వార్డు మెంబర్స్, గ్రామ పెద్దలు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బంద్ పాక్షికం

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 19: చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్ కు నిరసనగా గురువారం మంచిర్యాల, చెన్నూర్, కేతనపల్లి, ఆదిలాబాద్ జిల్లాలలో బంద్ పాక్షికంగా జరిగింది. బందు సందర్భంగా అక్కడక్కడా కొన్ని కొన్ని వ్యాపారం సంస్థలు బందులో పాల్గొన్నాయి. హోటల్లు, పెట్రోల్ బంకులు, బట్టల షాపులు, విద్యాసంస్థలు మంచిర్యాలలో యధావిధిగా తెరుచుకున్నాయి. కొన్ని ప్రాంతాలలో వ్యాపారస్తులు బందులో పాల్గొన్నారు. బాల్క సుమన్ అరెస్ట నిరసనగా మంచిర్యాలలో బీఆర్ఎస్ శ్రేణులు ర్యాలీగా బయలుదేరి ఉదయం వ్యాపారస్తులను బందులో పాల్గొనాలని సూచించినప్పటికిని పోలీసులు వారి వెనకాల వెళ్తూ బందులో పాల్గొంటే చర్యలు తప్పవని చెబుతూ ఉండడంతో బజారు ఎప్పుడు లాగానే కొనసాగింది. బందు సందర్భంగా మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు మాట్లాడుతూ క్యాతనపల్లిలో జరిగిన సంఘటన ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టన్నారు. అదిలాబాదులో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు హరీష్ రావు మాట్లాడుతూ బాల్క సుమన్ అరెస్టు చేయడం అధికార దుర్వినియోగమేనని తెలిపారు.

పరీక్షల దృష్ట్యా చదువుపై పూర్తి ఏకాగ్రత పెట్టాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి , ఫిబ్రవరి 19 : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుపై పూర్తి దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. గురువారం కలెక్టర్ పుల్కల్ మండలం గొంగ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు సింగూర్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. గొంగ్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గదులు, వాష్ రూములు, పాఠశాల ఆవరణ, తదితరాలను పరిశీలించారు. విద్యార్థులతో మమేకమై మధ్యాహ్న భోజనంపై ఆరా తీశారు. భోజనం నాణ్యత, మెనూ వివరాలను తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడిన కలెక్టర్, రోజువారీ స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నారా, స్నాక్స్ అందిస్తున్నారా అని ప్రశ్నించగా, విద్యార్థులు తరగతులు సక్రమంగా జరుగుతున్నాయని, స్నాక్స్ ఇస్తున్నారని తెలిపారు. పరీక్షలుసమీపిస్తున్నందున సమయాన్ని సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో చదివి మంచి ఫలితాలు సాధించాలని హితవు పలికారు. పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించిన కలెక్టర్, శుభ్రత లోపంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతిరోజు మరుగుదొడ్లు శుభ్రం చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సింగూర్ గ్రామంలోని మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులను పలకరించి పాఠ్యాంశాల పురోగతిపై ప్రశ్నించారు. సిలబస్ పూర్తిచేసి, పునరావృతం ద్వారా మెరుగైన ప్రతిభ కనబర్చాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ప్రోత్సహించారు. అనంతరం బస్వాపూర్ గ్రామ శివారులో నిర్మాణంలో ఉన్న "యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల" పనుల పురోగతిని పరిశీలించారు. పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యత ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట తహసీల్దార్, పంచాయతీ సెక్రటరీ, పోలీస్ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోళ్లపై ఎంపి వంశీకృష్ణ భరోసా

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 19: పత్తి కొనుగోళ్ల విషయంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ రైతులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోళ్ల విషయంలో సిసిఐతో తాను మాట్లాడి మార్చి 15వ తేదీ వరకు కొనసాగించాలని అధికారులతో చెప్పినట్టు తెలిపారు. ఈ విషయంలో చెన్నూరు, కోటపల్లి ప్రాంతంలోని రైతులు ఆందోళన చెందవద్దని అన్నారు. రైతులు పండించిన పంటకు ప్రభుత్వం మార్చి 15 వరకు కొనుగోలను యధాతధంగా కొనసాగించా లని రైతులకు భరోసా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

చత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవాలు

ప్రతిపక్షం, మంచిర్యాల, ఫిబ్రవరి 19: చిర్యాల జిల్లా లక్షట్టిపేటలో గురువారం చత్రపతి శివాజీ మహారాజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. 396 సంవత్సరాల క్రితం శివాజీ మహారాజ్ చేసిన గొప్పతనాలు నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరవెల్లి రఘు నాథ్ రావు పేర్కొన్నారు. ఆయన నుండి ఓపిక దేశభక్తి తదితర అంశాలను యువత గమనించి ఆయన ఆశయాలను కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాజీ మహారాజ్ ఉత్సవ కమిటీ సభ్యులు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

పోక్సో అత్యాచార చట్టాల పట్ల అవగాహన కల్పించాలి

- ఎస్పీ రోహిత్ రాజు

ప్రతిపక్షం, కొత్తగూడెం, ఫిబ్రవరి 19: జిల్లా ఎస్పీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో గురువారం ఎస్పీ రోహిత్ రాజు భరోసా సమన్వయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న అధికారులు తమ సూచనలు,అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యంగా పోక్సో కేసుల దర్యాప్తు,విచారణలో శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమని ఎస్పీ తెలిపారు.బాధితులకు సమగ్ర సహాయ సేవలు అందించడం,వైద్య పరీక్షలను వేగవంతం చేయడం,మొత్తం ప్రక్రియను బాలలకు అనుకూలంగా నిర్వహించడం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించారు.ఇటీవలి కాలంలో ప్రేమ పేరుతో ఇంటి నుండి వెళ్లిపోతున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో పోక్సో,అత్యాచార చట్టాలు,శిక్షల అమలు ,భవిష్యత్ జీవితంపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని అధికారులకు వివరించారు. ముఖ్యంగా పాఠశాలలు,కళాశాలల్లో బాలురకు ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తే ఇలాంటి కేసులను తగ్గించడం మాత్రమే కాకుండా బాధితులకు త్వరితగతిన న్యాయం అందించవచ్చని సమావేశంలో ఎస్పీ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ కార్యదర్శి బి.రాజేందర్,డిఎస్పీ మల్లయ్య స్వామి,కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ,ఆర్ఎంఓ డా.చైతన్య,డిప్యూటీ డీఎంహెచ్ఓ ప్రసాద్,డిస్ట్రిక్ట్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ అధికారి స్వర్ణలత,డీఈఓ నాగలక్ష్మి,ఐటి సెల్ ఇన్స్పెక్టర్ రాము,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు,జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్,చైల్డ్ లైన్,సఖి ,స్వధార్ సెంటర్లు,ఉమెన్ హబ్ ప్రతినిధులు, భరోసా సెంటర్ బృందం,ఇతర సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ కారణంగా 9వ తరగతి విద్యార్థి అదృశ్యం

- ప్రత్యేక బృందం ఏర్పాటు చేయాలని ఏసీపీకి వినతి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 19: హన్మకొండ జిల్లా హసన్పర్తి మండలం జయగిరి గ్రామంలోని మహాత్మా జ్యోతీరావు పూలే బాలుర పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హేమంత్ అనే విద్యార్థి సీనియర్ విద్యార్థుల ర్యాగింగ్‌కు గురై పాఠశాల నుండి వెళ్లిపోయినట్లు సమాచారం అందడంతో, కేసులో వేగవంతమైన దర్యాప్తు చేపట్టాలని కోరుతూ హన్మకొండ శాఖ ఆధ్వర్యంలో కాజీపేట ఏసీపీకి ఏబీవీపీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ ఘటనకు వారం రోజులు గడిచినా ఎలాంటి పురోగతి లేకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేసిన ఏబీవీపీ హాస్టల్స్ కన్వీనర్ వేల్పుల రాజు కుమార్, నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ విభాగ్ కన్వీనర్ ఆరేపల్లి సుజిత్, జిల్లా కన్వీనర్ హరి చరణ్, సిద్ధు, అఖిల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా డెయిరీ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, ఫిబ్రవరి 19 : పరకాల ఇందిరా మహిళా డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులు మరింత వేగవంతం చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరకాల ఇందిరా మహిళా డెయిరీ పనుల పురోగతిపై డీఆర్డీఏ, సహకార శాఖల అధికారులతో కలెక్టర్ స్నేహ శబరీష్, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి సందర్భంగా పరకాల ఇందిరా మహిళా డెయిరీకి సంబంధించిన పనుల పురోగతి, మహిళా సమాఖ్యకు ప్రభుత్వపరంగా అందించే సహాయ సహకారాలు, తదితర అంశాలపై డీఆర్డీవో మేన శ్రీను, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి లు కలెక్టర్, ఎమ్మెల్యేకు వివరించారు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల మహిళా డెయిరీ ఏర్పాటుకు ఎలాంటి చర్యలు చేపట్టామో వాటి గురించిన సమగ్ర వివరాలు సిద్ధం చేయాలని డీఆర్డీవో మేన శ్రీను కు తెలియజేశారు. డెయిరీ కి సంబంధించిన సమగ్ర వివరాలు, ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి ని గురించి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు. 25వేల లీటర్ల కెపాసిటి కలిగిన ప్రాసెసింగ్ ప్లాంట్ ను ప్రారంభోత్సవం చేసేవిధంగా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో డెయిరీ అభివృద్ధి పనుల పురోగతిలో అధికారులు వేగం పెంచాలన్నారు. అందులో భాగంగా నడికూడలో ఏర్పాటు చేస్తున్న బల్క్ మిల్క్ కూలింగ్ యూనిట్ (బీఎంసీయూ) నిర్మాణ పనులు వేగవంతంగా మార్చిలోగా పూర్తి చేయాలన్నారు. దామెర రోడ్డు నుండి డెయిరీ ప్లాంట్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసి చర్యలు చేపట్టాలని పీఆర్ ఈఈ ఆత్మారామ్ కు తెలియజేశారు. రోడ్డు పనులను త్వరగా మొదలుపెట్టాలన్నారు కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ బీఎంసీయూల ఏర్పాటుకు కావాల్సిన మిషనరీ, క్యాన్లు, వెహికల్ హైరింగ్ కోసం అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డీఆర్డీవో వెంకటేశ్వర్లు, డీపీఎం సరిత, ఏపీఎం దివాకర్ రాయ్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే ఏకసభ్య కమిషన్‌ను నియమించాం. కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు అమలు చేస్తాం. సీఎం చంద్రబాబు బీసీల పక్షపాతి. గత ప్రభుత్వం స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను 24%కే పరిమితం చేసింది.

- ఏపీ మంత్రి సవిత

ప్రాంతీయం

దిలీప్ కుటుంబానికి పోలీసుల అండ

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్/ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 19: తోటి మిత్రుడి అకాల మరణం ఆ బ్యాచ్ సభ్యులను కలిచివేసింది. కష్టాల్లో ఉన్న స్నేహితుడి కుటుంబానికి 2009 బ్యాచ్ పోలీస్ కానిస్టేబుళ్లు అండగా నిలిచి తమ మానవత్వాన్ని చాటుకున్నారు రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కంచర్ల గ్రామానికి చెందిన 2009 బ్యాచ్ పోలీస్ కానిస్టేబుల్ దిలీప్ ఇటీవల అకాల మరణం చెందారు. దిలీప్ మృతితో ఆయన కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ నేపథ్యంలో, గురువారం దిలీప్ నివాసానికి చేరుకున్న ఆయన తోటి బ్యాచ్‌మేట్స్, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. దిలీప్ పిల్లల చదువుల కోసం మరియు ఆ కుటుంబ భవిష్యత్తు కోసం 2009 బ్యాచ్ సభ్యులు సేకరించిన రూ. 2 లక్షల ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ కార్యక్రమంలో గంపల సతీష్, గొర్రె తిరుపతి, ఆకుల సతీష్, ముజాల కైలాష్, అనిల్, తీగల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు రిజిస్ట్రేషన్ నూరు శాతం పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, ఫిబ్రవరి 19: వివిధ రకాల కేంద్ర రాష్ట్ర, ప్రభుత్వ కార్యక్రమాల సద్వినియోగం కోసం ఉద్దేశించిన రైతు రిజిస్ట్రేషన్ 100 శాతం పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి వ్యవసాయ విస్తరణ అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ సమీక్ష సమావేశం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ విస్తరణ అధికారులు తమ పరిధిలోని రైతుల రిజిస్ట్రేషన్ పూర్తి చేయాలని అన్నారు. వ్యవసాయ అధికారి వద్ద మాత్రమే కాకుండా మీ సేవా కేంద్రాల్లో కూడా 15 రూపాయల రుసుముతో ఫార్మర్ రిజిస్ట్రీ పూర్తవుతుందనే అవగాహన రైతులకు కల్పించాలని తెలిపారు. యూరియా బుకింగ్ యాప్ పట్ల రైతులకు అవగాహన కల్పించాలని, ఫోన్ లేని రైతులు రిటేలర్ వద్ద కూడా నమోదు చేసుకొని యూరియా పొందవచ్చనే విషయాన్ని తెలియజేయాలని అన్నారు. ఈ యాప్ ను పర్యవేక్షిస్తూ ఎదురయ్యే సమస్యలను నివేదించాలని తెలిపారు. రైతు బీమాకు సంబంధించి పెండింగ్లో ఉన్న అన్ని క్లైములు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం శ్రీ పాఠశాలల్లో విద్యార్థుల అవగాహన కోసం ఉద్దేశించిన మట్టి నాణ్యత పరీక్షలను ప్రతి ఒక్కరితో చేయించాలని అన్నారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమానికి సంబంధించి ప్రతి రైతుకు చెందిన ఈ కేవైసీ పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, ఏడిఏ మహేష్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులో భాగంగా సైబర్ సైబర్ సెక్యూరిటీ - సిద్దిపేట ఒక పరిశీలన అనే అంశం లో భాగంగా పట్టణ పోలీస్ స్టేషన్ లోని సైబర్ క్రైమ్ విభాగం ను సందర్శించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సైబర్ క్రైమ్ విభాగం అధికారులు సమాధానం తెలియజేస్తూ సూచనలు చేశారు. - ప్రతిపక్షం, సిద్దిపేట

అఖండ భారతావనికై శివాజీ కృషి

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి19: అఖండ భారతావని కోసం మరాఠా రాజ్యాధిపతి శివాజీ మహారాజు శక్తి వంచన లేకుండా కృషి చేశారని కాంగ్రెస్ కౌన్సిలర్లు అనంతుల భాగ్యమ్మ శ్రీనివాస్, శ్రీరామ్ సరస్వతి నరేందర్, తునికి సురేష్, ఐరేని అఖిల సాయి తేజ గౌడ్ లు అన్నారు. గురువారం దుబ్బాక పట్టణ కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహానికి పూల మాలలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివాజీ తల్లినైన జిజియాబాయి స్ఫూర్తితో అఖండ రాజ్య స్థాపనకు కృషి చేశారన్నారు. రాజ్య పాలనలో ప్రజలు మతసామరస్యంతో హిందూ, ముస్లిం భేదాభిప్రాయాలు లేకుండా శుభిక్షంగా జీవించారన్నారు. తన రాజ్యంలో అన్నీ మతాలు, కులాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించారని, ఏ ఒక్క మతానికో, కులానికో అనుకూలంగా నిర్ణయాలు తీసుకోలేదన్నారు.

ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్యం, స్వరాజ్య పోరాటం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. మరాఠా సామ్రాజ్య స్థాపకుడైన శివాజీ త్యాగాలు దేశభక్తిని రేకెత్తించుతాయన్నారు. దుబ్బాక మున్సిపల్ ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలు సాంస్కృతిక విలువలను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు.

ఈ గడ్డ నుండే కాషాయ ధ్వజం రెపరెపలాడాలి

- జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత ప్రచార కార్యదర్శి భాస్కర్ యోగి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి19: తెలంగాణను కాశాయమయం చేయడమే లక్ష్యంగా సిద్దిపేట గడ్డ నుండే కాషాయ కార్యకర్తలు అందుకు కష్టపడాలని, ఇక్కడి నుండే తెలంగాణ లో కాషాయ ధ్వజం రెపరెపలాడాలని జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత ప్రచార కార్యదర్శి భాస్కర్ యోగి అన్నారు. గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి ఉత్సవాలలో భాగంగా సిద్దిపేట పట్టణంలో నిర్వహించిన బైక్ ర్యాలీ లో ఆయన పాల్గొన్నారు. అనంతరం వెంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిద్దిపేట లో నిర్వహించిన ర్యాలీని చూస్తే రాయగడ్ లో ఉన్న అనుభూతి కలిగిందన్నారు. మన దేశాన్ని ఎంతమంది ఇతర మతస్థులు, ఎన్ని ఎండ్లు పాలించిన హిందుత్వాన్ని ఏమీ చేయలేకపోయారన్నారు. కాకతీయుల కాలం నుండే హిందుత్వాన్ని వ్యాపింప

చేసారని, దానికి కొనసాగింపుగా ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ స్వాభిమానాన్ని నిద్ర లేపాడని అన్నారు. క్రైస్తవుల కంటే కొన్ని వేల సంవత్సరాల ముందే హిందుత్వం పుట్టిందని అన్నారు. 16 ఏళ్ల వయసులోనే 10 దుర్గాలను ఛత్రపతి జయించాడని, నాలుగు వైపుల నుండి శత్రువులు ఉన్నా వారిని జయించాడన్నారు. హిందువులంతా ఐక్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేషనలిస్ట్ హబ్ సీఈఓ అవునూరి సాయి కృష్ణ, హిందూ వాహిని ప్రాంత సంఘటన మంత్రి యాదగిరి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా భవనాలకు భూమి పూజ

ప్రతిపక్షం, అక్బరుపేట భూంపల్లి, ఫిబ్రవరి 19: అక్బరుపేట భూంపల్లి మండల పరిధిలోని కుడవెల్లి , నగరం గ్రామాలలో డ్వాక్రా మహిళా భవనాలు మంజూరు అవ్వగా శుక్రవారం చైర్మన్ వెంకటయ్య భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. అక్బరు పేటభూంపల్లి మండలం సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మండల కుమార్,ఆయా గ్రామాల సర్పంచ్ లు,ఉప సర్పంచ్ లు,వార్డ్ సభ్యులు,పంచాయతీ కార్యదర్శి లు,మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు జీడిపల్లి రవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జమ్మూ యూనివర్సిటీలో ప్రొఫెసర్ మాధవి ప్రసంగం

- వెక్టర్ బోర్న్ వ్యాధులపై అత్యుత్తమ లెక్చర్ అందించిన ప్రొఫెసర్ మాధవి

ప్రతిపక్షం, సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 19: జమ్మూ కాశ్మీర్ లోని జమ్మూ యూనివర్సిటీ లో జరిగిన కాన్ఫరెన్స్ లో ఉస్మానియా విశ్వవిద్యాలయం జంతుశాస్త్రం మాజీ విభాగాధిపతి ప్రొఫెసర్ మాధవి అందించిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. జమ్మూ యూనివర్సిటీ లో నిర్వహించిన నేషనల్ ఇన్నోవేషన్స్ ఇన్ ఎనిమల్ సైన్స్ , ఇంటిగ్రేటింగ్ కన్సర్వేషన్ క్లైమేట్ రిసైలెన్స్ అండ్ పబ్లిక్ హెల్త్ పర్స్పెక్టివ్ అనే అంశంపై నిర్వహించిన కాన్ఫరెన్స్ లో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల ద్వారా వ్యాధులు ఏ విధంగా ప్రబలుతున్నాయని వాటిని అరికట్టడానికి ప్రపంచ వ్యాప్తంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వెక్టర్ బోర్న్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అందుకు వాటి నివారణకు తీ

సుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాధవి ప్రసంగం పట్ల జమ్మూ యూనివర్సిటీ ప్రొఫెసర్లు అతిథులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాధవి ని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ కుమార్ తో పాటు ప్రొఫెసర్లు అభినందించారు.

'బాల వికాస' ఆధ్వర్యంలో చిన్నారుల జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, సిద్దిపేట,ఫిబ్రవరి 19: బాల వికాస స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అనాథ(వికాస) పిల్లల జన్మదిన వేడుకలు నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలోని అరుంధతి కమ్యూనిటీ వేడుక మందిరంలో గురువారం బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో దాతల ఆర్థిక సాయంతో చదివిస్తున్న అనాథ పిల్లల జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన దాతలు పిల్లల బాగోగులను ఆరా తీసి వారి పరిస్థితి చూసి ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బాల వికాస సంస్థ కార్యక్రమ సమన్వయ కర్తలు జ్యోతి, అమూల్య మాట్లాడుతూ బాల వికాస సంస్థ సంస్థను 40సంవత్సరాల కిందట బాల థెరిస్సా(బాలక్క) స్థాపించారని చెప్పారు. అప్పటి నుంచి బాల వికాస సంస్థ ఎన్నో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలకు నెలసరి సమస్యలతో పాటు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చల్లారం రాజశేఖర్ రెడ్డి, జాగృతి పట్టణ కార్యదర్శి గిరి, బీఆర్ఎస్ నాయకుడు జువ్వన్న ప్రసాద్, బాలమణి, లత, రమ్య పలువురు దాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలకు తమ వంతు సహకారంగా విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పిల్లలకు రకరకాల వంటకాలు చేసుకుని వచ్చి వారికి తినిపించారు. బాల వికాస మహిళా సమన్వయకర్త అన్న మేరీ, సుజాత, లక్ష్మి, జ్యోతి, సరిత, మహిళా సంఘాల మహిళలు, దాతలు పాల్గొన్నారు.

నిజామాబాద్ మేయర్‌కు చేగుంటలో సన్మానం

ప్రతిపక్షం, చేగుంట, ఫిబ్రవరి, 19: నిజామాబాద్ నగర మేయర్ కూరగాయల ఉషారాణి రమేష్ ముదిరాజ్ దంపతులను చేగుంట మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ మహాసభ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి తలారి బిక్షపతి ముదిరాజ్ సమక్షంలో సన్మానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యోగా కోచ్ కర్ణం గణేష్ రవికుమార్ చేగుంట మండలం ముదిరాజ్ సంఘం ప్రధాన కార్యదర్శి బోల్ల నర్సింలు సహాయ కార్యదర్శి బోయిని నర్సింలు రెడ్డిపల్లి సర్పంచ్ చిన్నాశన్న నర్సింలు ముదిరాజ్ సంఘం నాయకులు జేజ వేణు రంగంపేట ఆంజనేయులు సరుగు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బహుజన చక్రవర్తి శివాజీ అని చాటుదాం

- డీబీఎఫ్ రాష్ట్రకార్యదర్శి ఏగొండ స్వామి

ప్రతిపక్షం, గజ్వేల్, ఫిబ్రవరి 19: బహుజన చక్రవర్తి శివాజీ 17 ఏళ్ళ వయసులో మొదటి యుద్ధం చేసి బీజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను స్వాధీనం చేసుకొని మరో మూడేళ్ళలో కొండన, రాజ్‌గఢ్ కోటల ను సొంతం చేసుకొని పూణె ప్రాంతాన్నంతా స్వాధీనంలోకి తెచ్చుకొని యుద్ధ తంత్రాల్లోనూ శివాజీ అనుసరించే విధానం శత్రువులకు అంతుబట్టని విధంగా చేసిన బహుజన చక్రవర్తి శివాజీ వ జయంతిని గురువారం నాడు గజ్వేల్ లో డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి,జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు అద్వర్యంలో ఘనంగా నిర్వహించి అయన విరోచిత పోరాటాన్ని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఏగొండ స్వామి మాట్లాడుతూ 2వేల మంది సైనికులను 10 వేల మందికి పెంచుకోని సైనిక సంపత్తి ప్రాముఖ్యా న్ని ఆయన గుర్తించడంతోపాటు, తిరుగులేని యుద్ధ వ్యూహాలను అనుసరించడమే శివాజీ అసమాన ప్రతిభకు నిదర్శ నమన్నారు. పటిష్ఠమైన సైన్యంతోపాటు నిఘా వ్యవస్థను ఏర్పరచుకొని, ఆధునిక యుద్ధ తంత్రాలను ఉపయోగించి గెరిల్లా యుద్ధాన్ని తొలిసారిగా ప్రపంచానికి పరిచయం చేశారన్నారు. మత ప్రదేశాలపై, ఇళ్లపై దాడులకు అంగీకరించేవారు కాదని

తన స్నేహితుల్లో, సైనిక వ్యవస్థలో ఎంతోమంది ముస్లింలకు సముచిత స్థానం కల్పించారన్నారు. బీజాపూర్ సుల్తానులను ఓడించడానికి మొఘల్ పాలకు దు ఔరంగజేబుకు సహాయపడ్డాడు. ఓటమి తప్పనిపిస్తే, యుద్ధం నుండి తప్పుకోవాలి. అనుకూల సమయాన్ని చూసి దాడి చేసి గెలవాలి. ఈ సూత్రాన్ని శివాజీ ఎక్కువగా నమ్మేవారట. ఇదే శివాజీ పాటించే యుద్ధతంత్రం. పటిష్ఠమైన నావికా దళం మరాఠాలకు మరింత బలాన్ని చేకూర్చింది. దీనికి శివాజీ వేసిన బలమైన పునాదులే కారణం. విదేశీ దండయాత్రల నుంచి రాజ్యాన్ని కాపాడుకోటానికి ఇది ఎంతగానో ఉపయోగపడిందన్నారు. ఈ కార్యక్రమంలో డిబిఎఫ్ నియోజకవర్గ నాయకులు మాసన్ పల్లి మైసయ్య, కనుకరాజు పాల్గొన్నారు.

22న గురుకుల పాఠశాలల ఉమ్మడి ప్రవేశ పరీక్ష

ప్రతిపక్షం సిద్దిపేట , ఫిబ్రవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకుల పాఠశాలలో ప్రవేశం పొందేందుకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఈ నెల 22వ తేదీ నిర్వహిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సిద్దిపేట జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శారద వెంకటేష్ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ 5వ తరగతి ప్రవేశ పరీక్ష తోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు గల ఖాళీలను కూడా భర్తీ చేసేందుకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్లైన్ ద్వారా హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకొని 22వ తేదీ ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే ప్రవేశ పరీక్షకు హాజరుకావాలని సూచించారు. పరీక్ష కేంద్రాలను ముందుగానే తెలుసుకొని కనీసం గంట ముందుగా అక్కడికి చేరుకోవాలని సూచించారు. వరిజనల్ హాల్ టికెట్, ఆధార్ లేదా ఏదైనా గుర్తింపు కార్డు తప్పనిసరిగా విద్యార్థులు వెంట తెచ్చుకోవాలని చెప్పారు. ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు పరీక్ష కేంద్రంలోకి ప్రవేశం ఉండదని సూచించారు.



నేటి నుండి రాష్ట్రస్థాయి సీఎం కప్ సైక్లింగ్ పోటీలు

- తరలిరానున్న 33 జిల్లాల సైక్లిస్ట్ లు

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 19: రాష్ట్రక్రీడారంగంలో సైక్లింగ్ పేరెత్తగానే టక్కున స్ఫురణకు వచ్చే జిల్లా సిద్దిపేట. గడచిన దశాబ్ద కాలంలో ఇక్కడి సైక్లిస్టులు జాతీయ అంతర్జాతీయ వేదికలపై విజయ బావుట ఎగరవేశారు. అంతేగాక పలువురు ఉపాధి పొందిన తీరు సర్వత్రా స్ఫూర్తిదాయకం. వీరి స్ఫూర్తితో ఇక్కడి జిల్లా క్రీడాకారులకు ప్రేరణ అందించాలని జిల్లా క్రీడా శాఖ రాష్ట్రస్థాయి సీఎం కప్ సైక్లింగ్ పోటీల నిర్వహణకు శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పోటీల నిర్వహణను సిద్దిపేటకు కేటాయించడం విశేషం. గత ఏడాది సమర్థవంతంగా పోటీలు నిర్వహించడంతో రెండవసారి ఈ పోటీ నిర్వహించే భాగ్యం సిద్దిపేటకు దక్కింది. ఈనెల 20వ తేదీ నుండి 23 వరకు మన జిల్లా ఈ పోటీలకు ఆతిథ్యమిస్తోంది. సబ్ జూనియర్స్ (అండర్ 15) జూనియర్స్ (అండర్ 19) రాష్ట్రంలోని 33 జిల్లాల నుండి మంది 396 బాలురు మంది 396 మంది బాలికలు, 66 మంది కోచ్ మేనేజర్లు, మరో 20 మంది టెక్నికల్ అఫీషియల్స్ ఈ పోటీలకు హాజరవుతున్నారు. రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి ప్రత్యేక చొరవకు తోడు జిల్లా కలెక్టర్ సూచనలతో జిల్లా క్రీడల యువజన అధికారి జంగపల్లి వెంకట నర్సయ్య ఆధ్వర్యంలో ఈ పోటీల విజయవంత నిర్వహణకు పలు కమిటీలను ఏర్పాటు చేశారు. బాలురకు స్టేడియం ముందులో గల దర్గా లో బాలికలకు పీజీ కాలేజీలో వసతి సౌకర్యం కల్పించారు. ఈ పోటీలో పాల్గొనే క్రీడాకారులకు ఈ విధమైన అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు జిల్లా క్రీడా శాఖ చేపట్టింది. పోటీలు ప్రధానంగా రంగనాయక సాగర్, తదితర ప్రాంతాల్లో నిర్వహిస్తున్నారు. పోటీల సందర్భంగా సైక్లిస్టులకు ఇబ్బంది కలగకుండా జిల్లా పోలీస్ శాఖ సహకారమందిస్తోంది. ఈ పోటీలో విజేతలు గా నిలిచే క్రీడాకారులకు స్వర్ణ పతకానికి రూ.25వేలు, రజతానికి రూ.15 వేలు, కాంస్యానికి రూ.పది వేలు నగదు తో పాటు సర్టిఫికేట్ జ్ఞాపికలను అందించనున్నారు. 21 తేదీన ఉదయం 10 గంటలకు జరిగే ఈ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హైమావతితోపాటు రాష్ట్ర, జిల్లా సైకిల్ అసోసియేషన్ బాధ్యులు హాజరవుతున్నట్లు జిల్లా క్రీడలు యువజన అధికారి జంగపల్లి వెంకట

నర్సయ్య తెలిపారు.

గొప్ప అవకాశం...డీవైఎస్ఓ

సీఎం కప్ రెండవ ఎడిషన్ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు సిద్దిపేటలో నిర్వహించడం సంతోషదాయకం. జిల్లా మంత్రి జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఈ పోటీల విజయవంతంకు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకున్నాం. రాష్ట్రస్థాయి పోటీల స్ఫూర్తితో భవిష్యత్తులో ప్రతిభగల క్రీడాకారుల వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్‌కు ఘనంగా సన్మానం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి19 : మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా ఎన్నికైన మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు దొంతి నరేష్ గౌడ్ ని గురువారం తెలంగాణ భవన్ లో మెదక్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ. జర్నలిస్టుగా మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా పని చేస్తూ మెదక్ మున్సిపల్ ఎన్నికలలో కౌన్సిలర్ గా నిలబడి గెలిచి మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా గెలుపొందడం అభినందనీయమని వారు అన్నారు అలాగే మెదక్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాల పంపిణీ ఇతర కార్యక్రమాల లో చేసిన కృషిని జర్నలిస్టులు కొనియాడారు రానున్న రోజుల్లో సైతం నరేష్ గౌడ్ పట్టణ ప్రజలతో పాటు ఇటు జర్నలిస్టుల సంక్షేమానికి కోసం కూడా కృషి చేయాలని కోరారు జర్నలిస్టు అలా సంక్షేమానికి అనునిత్యం కృషి చేస్తానని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మున్సిపల్ వైస్ చైర్మన్ నరేష్ గౌడ్ ఏ పదవిలో ఉన్నప్పటికీ జర్నలిస్టుల సంక్షేమాని కి కృషి చేస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు శంకర్ దయాల్ చారి నాగరాజు గోపాల్ గౌడ్ కామాటి కీషన్ రాజశేఖర్ చింతల రమేష్ ప్రకాష్. కొల్చారం రామ కృష్ణ. రామకృష్ణ లక్ష్మణ్ శ్యామ్ రాము సంగమేశ్వర్ లతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు ఈ సందర్భంగా నరేష్‌గౌడ్ ను ఘనంగా సన్మానించారు

అభిషేక్ ప్రతీ బంతిని భారీ షాట్‌గా మలిచేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇది సరికాదు. అంతర్జాతీయ క్రికెట్‌లో క్వాలిటీ బౌలర్లు ఉంటారు కాబట్టి వీక్‌నెస్ పసిగట్టేస్తారు. పాక్ ఓపెనర్ ఆయుబ్ తొలినాళ్లలో ఇలాగే ఆడి ఇప్పుడు ఆఫ్ సైడ్ ఆడేందుకు తడబడుతున్నాడు. అభిషేక్ పరిస్థితి కూడా అలాగే ఉంది.

- పాక్ మాజీ బౌలర్ మహమ్మద్ అమీర్

ప్రాంతీయం

గిరిజనులకు, లంబాడాలకు అండగా ప్రభుత్వం

- మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి19 : గిరిజనులకు, లంబాడాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు.మెదక్ పట్టణంలో సేవాలాల్ జయతి కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మెదక్ శాసన సభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ.. ఆదివాసీలకు,గిరిజనులకు, లంబాడాలకు ఇందిరమ్మ రాజ్యంలోని ప్రభుత్వం అండగా ఉంటుందని , మెదక్ నియోజకవర్గంలోని తండాల్లోని వివిధ రోడ్ల మరమ్మత్తుల కోసం రూ 8 కోట్లు ఖర్చు చేసి అబివృద్ధి పనులు చేశామన్నారు. మరింత గిరిజనుల, లంబడాల అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు. లంబాడా వేషధారణలో విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి,మున్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ ,కల్కి మహరాజ్,భిక్షూ మహరాజ్,కౌన్సిలర్ సంధ్య, చంద్రం,గోపాల్ నాయక్,కిషన్,దేవుల, హీరాలాల్, అశోక్,శ్రీను నాయక్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి19 : మన భారతదేశ మహారాజు, హిందూ సామ్రాజ్య స్థాపకులు, మొగలు గుండెల్లో భయం పుట్టించిన యోధులు మన హిందూ జాతి ఆత్మ గౌరవం ఛత్రపతి శివాజీ మహారాజు అని మెదక్ నియోజకవర్గ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు కొనియాడారు. చత్రపతి శివాజీ జన్మదినాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తాలో స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ శివాజీ మహారాజ్ మరాఠా ప్రజలలో స్వేచ్ఛా స్ఫూర్తిని రగిలించి, శక్తివంతమైన నౌకాదళాన్ని (భారత నౌకాదళ పితామహుడిగా పిలుస్తారు) అని చెప్పారు .ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి,మున్సిపల్ చైర్మన్ కనుగుల రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ ,కల్కి మహరాజ్,భిక్షూ మహరాజ్,కౌన్సిలర్ సంధ్య, చంద్రం,గోపాల్ నాయక్,కిషన్,దేవుల, హీరాలాల్, అశోక్,శ్రీను నాయక్,రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కుల పరిశీలన

ప్రతిపక్షం, మెదక్ టౌన్, ఫిబ్రవరి 19: హవేలీ ఘనపూర్ మండలంలోని బూరుగుపల్లి, సర్దన, కూచన్ పల్లి ఉన్నత పాఠశాలలను తనఖీ బృందం గురువారం మండల విద్యాధికారి మధుమోహన్ ఆధ్వర్యంలో సందర్శించింది.పదవ తరగతి విద్యార్థుల ఇంటర్నల్ మార్కులను సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులు పూర్తి చేసిన ల్యాబ్ యాక్టివిటీ, ప్రాజెక్ట్ వర్క్ నోట్స్, స్లిప్ టెస్ట్ లకు 20 మార్కులను కేటాయించారు. నాలుగు అంశాల్లో విద్యార్థులు రాసిన ఫార్మేటివ్ అసెస్ మెంట్ క్షుణ్ణంగా పరిశీలించి విద్యార్థుల ప్రగతి పరిశీలించారు.ఈ తనిఖీ బృందంలో నాగుల్ మీరా, రాజశేఖర్,పోచయ్య,భానుకిరణ్, అశోక్ లు ఉన్నారు.

సమాజానికి మార్గనిర్దేశనం చేసే సేవాలాల్ మహారాజ్ బోధనలు

- రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య

ప్రతిపక్షం, దుబ్బాక, ఫిబ్రవరి 19: సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గనిర్దేశనమని అని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్య అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలలో బాగంగా గురువారం దుబ్బాక పట్టణంలోని చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం నుండి పాత తహశీల్దార్ కార్యాలయం వరకు లంబాడి ప్రజలు నిర్వహించిన భారీ ర్యాలీలో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషను చైర్మెన్ బక్కి వెంకటయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భం గా చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ సేవ,సత్యం,సామాజిక న్యాయం అనే విలువలను బోధిస్తూ బంజారా సోదరులను ఐక్యత వైపు నడిపించిన మహనీయుడు సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. సేవాలాల్ మహారాజ్ బోధనలు సమాజానికి మార్గ నిర్దేశమని పేర్కొన్నారు.అణగారిన వర్గాలకు అభ్యున్నతికి, మహిళల గౌరవానికి అతను చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు.ఈ వేడుకలలో భాగంగా సంత్ సేవాలాల్ మహారాజ్ బోస్ బండార్ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంజారా సోదరుల కోరిక మేరకు దుబ్బాక లో బంజారా భవనం నిర్మాణం కొరకు స్థలం కేటాయించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సంజీవ్ కుమార్ ,ఎంపీడీవో భాస్కర శర్మ,దుబ్బాక మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీరామ్ సంగీత రవీందర్,వైస్ చైర్ పర్సన్ ఆస సులోచన స్వామి, కౌన్సిలర్ లు చెక్కపల్లి శ్రీలేఖ రాజు ,రమ్య రాజేష్, స్థానిక ఎస్ఐ కీర్తిరాజు, ఏ ఎస్ ఐ హరి సింగ్ ,లంబాడి నాయకులు ఎస్ పి నాయక్, రాంజా నాయక్ ,లంబాడి సోదర,సోదరిమణులు తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్క దాడిలో మహిళకు తీవ్ర గాయాలు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, ఫిబ్రవరి19 : వీధి కుక్క చేసిన దాడిలో మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటన గురువారం మెదక్ పట్టణంలోని శాంతి నగర్ లో చోటుచేసుకుంది. శాంతి నగర్ కాలనీ కి చెందిన లక్ష్మమ్మ ఇంటి ఎదుట నిలబడింది. దాంతో ఆమెపై వీధి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. కుక్క దాడిలో మహిళా కుడి కాలు తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు కుక్కను తరమడంతో ప్రాణాపాయం తప్పింది. చికిత్స కోసం మహిళా ను వెంటనే ఆస్పత్రికి తరలించారు. పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను నియంత్రించాలని కోరుతున్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు సృజనాత్మకతను పెంపొందిస్తాయి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, ఫిబ్రవరి 19 : విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీస్తూ, వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. జిల్లా కేంద్రంలోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్ లో యంగ్ ఇన్నోవేటర్స్ ఇన్ యాక్షన్ పేరుతో గురువారం "ఆవిష్కార్" కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా విచ్చేసి, విద్యార్థిని విద్యార్థులు రూపొందించిన వైజ్ఞానిక ప్రదర్శనల నమూనాలను ఎంతో ఆసక్తితో తిలకించారు. లాభదాయకమైన కూరగాయల పంటల సాగు, సోలార్ వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ఉపకరించే సాధనాలు, కాలుష్య నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు, ఆరోగ్యకరమైన ఆహారం, సన్ డయల్, అంతరిక్ష పరిశోధన నమూనాలు తదితర అంశాలపై సరికొత్త ఆలోచనలతో సృజనాత్మకతను జోడిస్తూ ప్రదర్శనలు రూపొందించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందించారు. ఒక్కో ఎగ్జిబిట్ ను సందర్శిస్తూ, వాటి వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కేవలం తరగతి గది, పుస్తకాలకే పరిమితం కాకుండా అనేక అంశాలలో విద్యార్థులు సైన్స్ ఫేర్ లో పాల్గొని తమ ప్రతిభను చాటడం ఎంతో గొప్ప విషయమని, ఈ దిశగా విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని కొత్తకొత్త ప్రయోగాలు చేసేలా తోడ్పాటును అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సంతోష్, శ్రీదేవి, ప్రిన్సిపాల్ ఆంథోని, లత, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని గైనిక్ వార్డ్, ఎన్ఐసీయూ విభాగాలను సందర్శించి రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది హాజరును, పేషంట్ల కేస్ షీట్లను తనిఖీ చేశారు. ప్రతీ రోజు సగటున ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయి, మాతా శిశు మరణాలు ఏమైనా చోటుచేసుకున్నాయా, అవసరమైన ఔషధాలు అన్ని అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. జీజీహెచ్ లో అన్ని చోట్ల సీ.సీ కెమెరాలు నిరంతరంగా పని చేసేలా చూడాలన్నారు. మాతాశిశు సంరక్షణ ఆసుపత్రిని సైతం కలెక్టర్ సందర్శించి, సంబంధిత విభాగాల వైద్య సేవలను పూర్తి స్థాయిలో అందించాలని, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన వైద్యం అందిస్తూ ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. అత్యవసరం అయితేనే సి.సెక్షన్ లు చేయాలని, సాధ్యమైనంత వరకు సాధారణ కాన్పులు జరిగేలా కృషి చేయాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వైద్యులు, సిబ్బంది అందరూ అంకితభావంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట వైద్యాధికారులు డాక్టర్ ఎల్.రాములు, జలగం తిరుపతి రావు ఉన్నారు.

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

ప్రతిపక్షం, మిడిదొడ్డి, ఫిబ్రవరి 19: సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల వ్యాప్తంగా చత్రపతి శివాజీ జయంతి వేడుకలు అంబరాన్నంటాయి. ధర్మారం ఆరేపల్లి మిరుదొడ్డి అల్వాల గ్రామాలలో శివాజీ విగ్రహాలకు పూలమాలవేసి జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం ధర్మారం గ్రామంలో చత్రపతి శివాజీ మహారాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. జయంతి వేడుకల్లో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తోట కమలాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. నేటి యువత శివాజీ వీరత్వాన్ని ప్రదర్శించాలన్నారు. మహిళలను గౌరవించడంతోపాటు హిందూ సంస్కృతి సాంప్రదాయాలను ప్రతి ఒక్కరు గౌరవించాలన్నారు.

కెనాల్‌లో పడిన జింకను రక్షించిన అటవీ అధికారులు

ప్రతిపక్షం, దౌల్తాబాద్, ఫిబ్రవరి 19: రామయంపేటకు వెళ్లే కెనాల్ లో పడిన జింకను బయటకు తీస్తున్న రైతులు,ఫారెస్ట్ అధికారులు, ప్రతి పక్షం,దౌల్తాబాద్, ఫిబ్రవరి 19: తాగునీటి కోసం వచ్చి ప్రమాదవశాత్తు కెనాల్ లో పడిన ఓ జింకను రైతుల సహాయం తో, ఫారెస్ట్ అధికారులు సురక్షితంగా బయటకు తీశారు . ఈ సంఘటన గురువారం దౌల్తాబాద్ మండలంలోని శంభుని గుట్ట వెనకాల రామయంపేటకు వెళ్లే కాలువలో తాగునీటి కోసం వచ్చిన జింక ప్రమాదవశాత్తు జారి కాలువలో పడింది. కాలువలో చిక్కుకుని బయటకు రావడానికి ప్రయత్నిస్తూ అలమటిస్తున్నది. ఈ సందర్భంగా వ్యవసాయ పొలం వద్దకు వెళ్లిన ఓ రైతు కెనాల్ లో పడిన జింకను గమనించిన సమీప రైతు వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న వెంటనే అటవీశాఖ సిబ్బంది హైమద్, జాంగిర్ ఘటనాస్థలానికి చేరుకుని స్థానిక రైతుల సహకారంతో రైట్లు, తాళ్ల సహాయంతో జింకను సురక్షితంగా బయటకు తీశారు. కొంతసేపు పరిశీలించిన అనంతరం ఎటువంటి గాయాలు లేకపోవడంతో జింకను సమీప అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.సమయోచితంగా స్పందించిన రైతు మరియు అటవీ అధికారుల చర్యలతో ఓ అమాయక ప్రాణం కాపాడబడిందని గ్రామస్థులు అభినందించారు. అటవీ ప్రాంతాల సమీపంలో నీటి వనరుల వద్ద జంతువులు జారి పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

కౌన్సిలర్లను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు

ప్రతి పక్షం దుబ్బాక ఫిబ్రవరి 19: ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కాంగ్రెస్ పార్టీ కి చెందిన కౌన్సిలర్లు అన ం తుల బాగ్యమ్మ శ్రీనివాస్ , శ్రీరాం సరస్వతి నరేందర్ , తునికి సురేష్‌లను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నక్క బాల వెంకన్న ఆధ్వర్యం లో కాంగ్రెస్ నాయకులు వారికి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు అధారి వెంకటి,నరేష్ తది తరులు పాల్గొన్నారు.

పీఎం శ్రీ పథకం పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్ష

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, పిబ్రవరి 19: సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో పీఎం శ్రీ పథకం కింద జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, ఇంజనీరింగ్ వింగ్ అప్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఈడబ్ల్యూఐడీసీ) ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో పీఎం శ్రీ పథకం ద్వారా 34 పాఠశాలల్లో నిర్మిస్తున్న సైన్స్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు, భవిత కేంద్రాల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను అప్‌లోడ్ చేయాలని సూచించారు. అలాగే సమగ్ర శిక్ష ద్వారా జిల్లాలోని 22 కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయ పాఠశాలల్లో చేపడుతున్న పనులను శాతం వంద పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రతి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని, కాంట్రాక్టర్లు నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ పనులను వేగంగా పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, సెక్టోరియల్ అధికారి రామ స్వామి, ఈడబ్ల్యూఐడీసీ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

సిద్దిపేట యువత కోసం 'హరీశ్ అన్న ఉద్యోగ యాప్'

- 57 పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్



ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, ఫిబ్రవరి 19: నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ తన్నీరు హరీష్ రావు సిద్దిపేట నియోజకవర్గ యువత కోసం 'హరీష్ అన్న ఉద్యోగ యాప్' ను రూపొందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 57 రకాల పోటీ పరీక్షలకు 2 వేల గంటల వీడియో పాఠాలు, 400 నమూనా ప్రశ్నాపత్రాలతో ఉచితంగా ఆన్‌లైన్ శిక్షణ అందించనున్నారు. సిద్ధిపేట యువత కోసం ప్రత్యేకంగా 'హరీష్ అన్న ఉద్యోగ యాప్' ను రూపొందించారు. హైదరాబాద్ వెళ్లి కోచింగ్ సెంటర్లలో శిక్షణ పొందేందుకు భారీ ఖర్చులు చేయాల్సిన అవసరం లేకుండా, ఇంటి వద్ద నుంచే ఉచితంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా ఈ యాప్‌ను రూపొందించారు. ప్రస్తుతం ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉండగా, ఇప్పటికే వెయ్యి మందికి పైగా నిరుద్యోగ యువత డౌన్‌లోడ్ చేసుకున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన 57 రకాల పోటీ పరీక్షలకు ఈ యాప్ ద్వారా శిక్షణ అందించనున్నారు. ఇందులో 2 వేల గంటల వీడియో పాఠాలు, 400 నమూనా ప్రశ్నాపత్రాలు, 4 వేల స్టడీ మెటీరియల్ పీడీఎఫ్‌లు అందుబాటులో ఉంటాయి. సంవత్సరం పాటు యాక్టివేషన్ సదుపాయం ఉండగా, రోజువారీ ఆన్‌లైన్ టెస్టులు నిర్వహించబడతాయి. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకున్న తరువాత ఎన్నిసార్లైనా వీడియో పాఠాలను వీక్షించే అవకాశం ఉంటుంది. రీజనింగ్, అంకగణితం, ఆంగ్లం, కరెంట్ అఫైర్స్, చరిత్ర, రాజనీతి శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, భౌగోళిక శాస్త్రం వంటి ముఖ్యమైన అంశాల్లో శిక్షణ అందించనున్నారు. తెలుగు, ఆంగ్ల భాషల్లో పాఠాలను వీక్షించే సదుపాయం కల్పించారు. ఉద్యోగ ప్రకటనలు, క్యాంపస్ రిక్రూట్మెంట్ సమాచారం కూడా యాప్‌లో పొందుపరిచారు. సిద్ది పేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ యాప్‌ను ప్రారంభించనున్నారు. మొదటి విడతలో సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన వెయ్యి మంది నిరుద్యోగ యువతకు సంవత్సరం పాటు ఉచితంగా అవకాశం కల్పించనున్నారు. గతంలో గ్రూప్ 1, గ్రూప్ 2, పోలీస్ కానిస్టేబుల్, టెట్, ఉపాధ్యాయ పోస్టులకు ఉచిత కోచింగ్ కార్యక్రమాలు నిర్వహించి అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించారు. అదే స్ఫూర్తితో, హైదరాబాద్ వంటి ప్రాంతాలకు వెళ్లి కోచింగ్ తీసుకోవడానికి ఒక్కో యువకుడు 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చు చేయాల్సిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని, స్వంత ఖర్చులతో ఈ యాప్‌ను రూపొందించారు. ఉద్యోగం లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుద్యోగ యువతకు ఇది పెద్ద ఆర్థిక వెసులుబాటు కానుంది. పదో తరగతి నుంచి పీజీ వరకు చదివిన వారందరికీ, కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగ సమాచారం సులభంగా అందేలా ఈ యాప్‌ను రూపొందించారు. సిద్ది పేట నియోజకవర్గానికి చెందిన నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగ సాధనలో విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షించారు.

రాష్ట్రంలో బీజేపీని 20 ఏళ్లుగా కొందరు కోవర్టులు పట్టి పీడిస్తున్నారు. అలాంటి వారు వెంటనే పార్టీని వీడి వెళ్లాలి. తెలంగాణ ఉత్తర భాగంలో పార్టీ పటిష్ఠంగా ఉంది. దక్షిణ ప్రాంతంలోనే మెరుగుపడాల్సి ఉంది. ఎవరి వల్ల ఎవరు భూస్థాపితం అయ్యారో కవితకు తెలియదా? కేసుల వల్లే నిజామాబాద్‌లో బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది.
- నిజామాబాద్ ఎంపీ అర్విందిద్

ఏఐ రంగంలో భారత్ పాత్ర కీలకం

- ఏఐ సమ్మిట్‌లో టెక్ దిగ్గజాల అభిప్రాయం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ఏఐ రంగం అభివృద్ధిలో భారత్ పాత్ర కీలకం కానున్నదని పలువురు టెక్ దిగ్గజాలు అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సులో యూఎన్ చీఫ్ ఆంటోనియో గుటెరస్, గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్, టాటా సన్స్ ఛైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ తదితరులు కీలక ప్రసంగం చేశారు. ఏఐ రంగంలో భారత్ పాత్ర గురించి వ్యాఖ్యానించారు. భారత్‌లో తమ సంస్థ 15 బిలియన్ డాలర్లు పెట్టుబడులు పెడుతోందని, అందులో భాగంగా పూర్తి స్థాయి ఏఐ హబ్‌ను ఏర్పాటు చేస్తోందని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. అలాగే దేశంలోని ప్రతి పౌరుడికి ఏఐ టూల్స్ చేరేలా చేయడమే తమ లక్ష్యమని టీసీఎస్ ఛైర్మన్ చంద్రశేఖరన్ ప్రకటించారు. ఈ సదస్సుకు తనను ఆహ్వానించిన భారత ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు తెలిపారు యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్. ఈ క్రమంలో గ్లోబల్ సౌత్‌లో మొదటి ఏఐ సమ్మిట్‌ను నిర్వహిస్తున్న భారత్‌కు అభినందనలు తెలియజేశారు. భారత్‌లో జరిగే ఈ ఏఐ సమ్మిట్‌కు ప్రత్యేక అర్థం ఉందని చెప్పారు. ఏఐ భవిష్యత్తును కొన్ని దేశాలు లేదా కొంత మంది బిలియనీర్లు నిర్ణయించలేరని స్పష్టం చేశారు. తాను భారత్‌ను సందర్శించిన ప్రతిసారీ దేశంలో మార్పుల వేగాన్ని చూసి ఆశ్చర్యపోతున్నానని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ స్పష్టం చేశారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు చెన్నై నుంచి ఐఐటీ ఖరగ్‌పూర్‌కు కోరమాండల్ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ మీదుగా వెళ్లేవాడిని తెలిపారు. ఇప్పుడు తీరప్రాంత నగరమైన అదే విశాఖపట్నంలో గూగుల్ ఫుల్ స్టాక్ ఏఐ హబ్ ఏర్పాటు చేస్తోందని వెల్లడించారు. అలాగే భారత ప్రజలకు అత్యాధునిక ఏఐ అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ప్రజలపై ఏఐ చాలా బలమైన ప్రభావాన్ని చూపుతుందని టాటా సన్స్ ఛైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్యక్రమాలకు భారత్ సాక్షిగా నిలుస్తోందన్నారు. ఏఐ రంగంలో భారత్ కీలక పాత్ర పోషించనుందని ఆంత్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ అభిప్రాయపడ్డారు. గత రెండున్నరేళ్లలో ఏఐ రంగంలో భారత్ మంచి పురోగతి సాధించిందని పేర్కొన్నారు.

విశ్వ వీక్షణం

జీవితంలో సంపాదనతో పాటు నీతి నిజాయితీలకు కూడా చోటు ఇవ్వాలి. అప్పుడే మన బతుక్కి ఒక బ్యాలెన్స్ ఉంటుంది. డబ్బు ఒక్కటే సర్వం కాదు అనే నిజాన్ని మనందరం ఒప్పుకోవాలి. ప్రతి ఒక్కరం మన స్థాయిలో మనం మారి, ఆ మార్పును మన పిల్లలకి కూడా నేర్పించాలి. ప్రేమ, జాలి, సాయం చేసే గుణం.. ఇవే మనల్ని మనుషులుగా నిలబెడతాయి. సమాజాన్ని మార్చడం అనేది మన చేతుల్లోనే ఉంది. డబ్బున్న లోకంలో బతుకుతూనే మన సంస్కారాన్ని కాపాడుకోవడం సాధ్యమే, దానికి కావలసిందల్లా మన గట్టి నిర్ణయం మాత్రమే.

సిరి వెనుక పరుగు

సిరివెన్నెల లేని బతుకు!

ఈ రోజుల్లో డబ్బు అనేది కేవలం అవసరాలకు మాత్రమే కాదు, మన జీవితాలను శాసించే ఒక శక్తిగా మారిపోయింది. మనం ఒక ఆర్థిక ప్రపంచంలో బతుకుతున్నామన్నది కాదనలేని నిజం. అయితే, ఈ పరుగులో పడి మన పాత విలువలను, కట్టుబాట్లను, మనిషితనాన్ని ఎక్కడో మర్చిపోతున్నాం. ఒకప్పుడు మన సమాజంలో బంధాలకు, నైతికతకు ఉన్నంత విలువ ఇప్పుడు కేవలం డబ్బుకే దక్కుతోంది. దీనివల్ల సమాజంలో ఎన్నో సమస్యలు పుట్టుకొస్తున్నాయి.

నిజానికి మన భారతీయ సంస్కృతిలో, ముఖ్యంగా మన తెలుగు వారిలో విలువలకి చాలా ప్రాముఖ్యత ఉండేది. నిజాయితీ ని మనం ఒక ప్రాణప్రదమైన సూత్రంగా భావించేవాళ్లం. దయ, కరుణ, ఎదుటివారికి సాయపడటం, ఇవే ఒక మనిషికి అసలైన అందమని నమ్మేవాళ్లం. అప్పట్లో కుటుంబం అంటే కేవలం ఒక ఇంట్లో కలిసి ఉండటం కాదు, అది ప్రేమ, నమ్మకం, బాధ్యతలతో అల్లుకున్న ఒక అందమైన బంధం. మన పక్కింటి వాళ్లని కూడా సొంత మనుషుల్లా చూసుకునే వాళ్లం. ప్రతి ఒక్కరూ తనతో పాటు పదిమంది బాగుండాలని కోరుకునే గొప్ప మనస్తత్వం మనది. ఒకప్పుడు మనం గురువులను, తల్లిదండ్రులను, పెద్దలను దైవంతో సమానంగా గౌరవించే వాళ్లం. అప్పట్లో చదువు అంటే కేవలం ఏదో ఒక ఉద్యోగం సంపాదించడం మాత్రమే కాదు, అదొక జ్ఞానం, మనిషిని సంస్కారవంతుడిగా తీర్చిదిద్దే మార్గం. అన్ని దానాల్లోకి విద్యాదానం గొప్పది అన్నట్టుగా, తెలివితేటలనే అసలైన ఆస్తిగా చూసేవారు. బతుకుదెరువు కోసం సంపాదించడం ముఖ్యమే అయినా, అది ధర్మంగా, నీతిగా ఉండాలని మన పెద్దలు కోరుకునేవారు. కానీ, మారుతున్న కాలంతో పాటు పారిశ్రామిక, సాంకేతిక మార్పులు మన సమాజం రూపురేఖలనే మార్చేశాయి. ఈ పోటీ ప్రపంచంలో ఇప్పుడు అంతా డబ్బు చుట్టూనే తిరుగుతోంది. ఎక్కువ లాభం సంపాదించాలనే ఆలోచనే ప్రతి రంగంలోనూ కనిపిస్తోంది. దీనివల్ల మనుషుల్లో విలాసాల మీద మోజు పెరిగిపోయింది. సుఖ సంతోషాలు, హోదా, ఆడంబరాలు, ఇవే జీవిత లక్ష్యాలని చాలామంది భ్రమపడుతున్నారు. ఇప్పుడు ఒక మనిషి గొప్పతనాన్ని అతని గుణాన్ని బట్టి కాకుండా, అతని దగ్గరున్న డబ్బును బట్టి కొలిచే పరిస్థితి రావడం నిజంగా విచారకరం. ఈ మార్పులు మెల్లమెల్లగా మన బతుకుల్నే మార్చేశాయి. డబ్బుంటే ఏదైనా కొనొచ్చు అనే నమ్మకం మనుషుల్లో ముదిరిపోయింది. చివరికి విలువలు, బంధాలను కూడా డబ్బుతోనే కొలిచే పరిస్థితి వచ్చింది. ఒక మనిషి ఎంత సంపాదిస్తున్నాడనే దానిపైనే అతను సక్సెస్ అయ్యాడా లేదా అని లోకం డిసైడ్ చేస్తోంది. మనిషి వ్యక్తిత్వం కంటే అతని బ్యాంక్ బ్యాలెన్స్కు గౌరవం, గుర్తింపు దక్కుతున్నాయి. ఈ ధన దాహం వల్ల కుటుంబాలు బాగా దెబ్బతిన్నాయి. ఒకప్పుడు అందరం కలిసి ఉండే ఉమ్మడి కుటుంబాలు ఇప్పుడు ముక్కలైపోయాయి. ఆర్థిక స్వాతంత్ర్యం పేరుతో మనుషుల మధ్య దూరం పెరిగింది. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్తు కోసం డబ్బు వెనక పరుగెడుతూ, వారితో గడిపే సమయాన్ని కోల్పోతున్నారు. ఇళ్లలో ప్రేమ, ఆప్యాయతల కంటే కూడా డబ్బు గురించిన లెక్కలే ఎక్కువైపోయాయి. పెళ్లిళ్ల విషయానికొస్తే,గుణగణాల కంటే కట్నకానుకలు, ఆస్తిపాస్తులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకుందామన్నా ఆర్థిక స్థితిగతులే అడ్డు వస్తున్నాయి. పాపం, కన్నవారిని చూసుకోవడం కూడా ఒక భారమైపోయి వృద్ధాశ్రమాల పాలు చేస్తున్నారు. తోడబుట్టిన వారు కూడా ఆస్తి గొడవలతో శత్రువులుగా మారిపోవడం నిజంగా బాధాకరం. చదువు చెప్పే రంగం కాస్తా ఇప్పుడు పూర్తిగా వ్యాపారంగా మారిపోయింది. ఒకప్పుడు విద్య అనేది ప్రతి బిడ్డ హక్కు, కానీ ఇప్పుడు అది కొనుక్కోవాల్సిన వస్తువైపోయింది. ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలు కేవలం డబ్బు సంపాదించే మిషన్లుగా మారిపోయాయి. ఫీజులు, డొనేషన్ల పేరుతో లక్షలు గుంజుతున్నారు. దీనివల్ల నాణ్యమైన చదువు కేవలం ఉన్నవారి పిల్లలకే సొంతమవుతోంది. పేద, మధ్యతరగతి తల్లిదండ్రులు తమ పిల్లలను చదివించుకోవడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. అసలు చదువు అంటే జ్ఞానాన్ని పెంచుకోవడం, మంచి పౌరులుగా ఎదగడం, ఇవన్నీ ఇప్పుడు పాత మాటలైపోయాయి. ఏదో ఒక ఉద్యోగం సంపాదించి, నాలుగు రాళ్లు వెనకేసుకోవడమే చదువుకి అసలైన అర్థం అని అందరూ నమ్ముతున్నారు. ఈ మార్కులు, ర్యాంకుల పోటీలో పడి విద్యార్థులు ఊపిరాడక సతమతమవుతున్నారు. ఆ ఒత్తిడి భరించలేక చిన్న వయసులోనే ఆత్మహత్యలకు పాల్పడటం మనల్ని కలచివేస్తోంది. సిలబస్ లో ఎక్కడా నీతి నియమాలు, మన సంస్కృతి గురించి ఊసే లేదు. ఇక గురువుల విషయానికొస్తే గురు బ్రహ్మ అని పూజించబడే స్థానం నుంచి వారు కేవలం జీతం కోసం పనిచేసే ఉద్యోగులుగా మారిపోయారు. కొందరు గురువులు కూడా ట్యూషన్ల మీద, అదనపు సంపాదన మీద చూపిస్తున్న శ్రద్ధ, విద్యార్థులను తీర్చిదిద్దడం మీద చూపించడం లేదన్నది ఒక చేదు నిజం. ఒకప్పుడు సేవగా భావించిన వైద్యం, ఇప్పుడు లాభాలే పరమావధిగా సాగే ఒక పెద్ద బిజినెస్ అయిపోయింది. ప్రైవేట్ ఆస్పత్రులు మనుషులను కాపాడటం కంటే డబ్బులు గుంజడమే లక్ష్యంగా పెట్టుకున్నాయి. వైద్యం ఖర్చులు ఆకాశాన్ని అంటుతున్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేని పేదవాడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నా, ముందు డబ్బు కడితేనే గానీ లోపలికి రానివ్వని పరిస్థితి కనిపిస్తోంది. డాక్టర్లు, సిబ్బందిలో కూడా ఒకప్పటి మానవత్వం మృగ్యమైపోతోంది. అనవసరమైన టెస్టులు, ఆపరేషన్లతో సామాన్యులను భయపెట్టి డబ్బులు పిండుతున్నారు. ఫార్మా కంపెనీల కమీషన్ల కోసం రేట్లు ఎక్కువగా ఉన్న మందులనే రాస్తున్నారు. మరోపక్క ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లామంటే అక్కడ సౌకర్యాలు లేక, సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పేదవాడు నరకం చూస్తున్నాడు.

డాక్టర్
సూర్యదేవర
రామకృష్ణ
9490754169

ఇక మన ప్రజాస్వామ్యానికి పునాది అనదగ్గ రాజకీయం కూడా పూర్తిగా డబ్బుమయం అయిపోయింది. ఎన్నికల్లో గెలవాలంటే నీతి నిజాయితీ కంటే డబ్బుకే ఎక్కువ పవర్ ఉంటోంది. పొలిటికల్ పార్టీలు ప్రచారం కోసం వందల కోట్లు నీళ్లలా ఖర్చు చేస్తున్నాయి. ఓట్ల కోసం మద్యం, పైసలు వెదజల్లడం చూస్తుంటే అసలు ప్రజాస్వామ్యం బతికే ఉందా అనిపిస్తుంది. సామాన్య పౌరుడు రాజకీయాల్లోకి రావడం అనేది ఒక కలగానే మిగిలిపోతోంది. కేవలం ఆస్తులున్న వారు, అధికారం చెలాయించే వారు మాత్రమే నాయకులుగా చెలామణి అవుతున్నారు. రాజకీయ నాయకుల పరిస్థితి కూడా అంతే, ప్రజా సేవ అనేది పక్కన పెట్టి, అంతా స్వార్థం కోసమే పనిచేస్తున్నారు. ఇప్పుడు రాజకీయాల్లో అవినీతి, లంచం అనేవి చాలా కామన్ అయిపోయాయి. ఏదైనా ఒక ప్రభుత్వ పథకం వస్తోందంటే, అది జనం కోసం కంటే కూడా కమీషన్ల కోసమే అన్నట్టుగా తయారైంది. ప్రజలు బాగుపడటం కంటే పార్టీలు, వ్యక్తులు బాగుపడటమే ముఖ్యం అయిపోయింది. అధికారం అంటే డబ్బు సంపాదించే ఒక దారిగా మారిపోయింది. అందుకే ఒక్కసారి గెలిస్తే చాలు, ప్రజాప్రతినిధులు కోట్ల రూపాయల ఆస్తులు వెనకేస్తున్నారు. ఏదో ఒక రకంగా డబ్బు సంపాదిస్తే చాలు అనే ధోరణి ముదిరిపోయింది. అక్రమంగా సంపాదించడం, లంచాలు తీసుకోవడం ఇప్పుడు చాలా మామూలు విషయాలైపోయాయి. కష్టపడి, ధర్మంగా సంపాదించాలనే మాట ఇప్పుడు పాతకాలం నాటి ముచ్చటగా మారిపోయింది. ఎదుటివాడిని మోసం చేసి అయినా సరే, పైకి ఎదిగితేనే

> **మన స్నేహాలు, బంధుత్వాలు కూడా మనిషి ఆర్థిక స్థితిని బట్టే మారుతున్నాయి. ఒక వ్యక్తి దగ్గర డబ్బుంటేనే చుట్టూ జనం చేరుతున్నారు. లేదంటే పట్టించుకునే వారే కరువయ్యారు. నిస్వార్థంగా సాయం చేసే గుణం మెల్లమెల్లగా కనుమరుగవుతోంది. ఇక ఇంట్లో ఏ చిన్న ఫంక్షన్ జరిగినా, అది ఒక ప్రదర్శనలా మారిపోయింది. మన హోదాను చూపించుకోవడం కోసం లక్షలు, కోట్లు తగలేస్తున్నారు. వారిని చూసి పేద, మధ్యతరగతి వారు కూడా ఆడంబరాలకు పోయి అప్పుల పాలవుతున్నారు. ఒకప్పుడు మనకున్న సాదాసీదా జీవితం, ఆ సంప్రదాయాలు ఇప్పుడు ఎక్కడా కనిపించడం లేదు; అంతా హంగూ ఆర్భాటమే ఇక పొరుగువారి విషయానికొస్తే, ఒకరి పట్ల ఒకరికి ఆప్యాయత అన్నదే తగ్గిపోయింది. ముఖ్యంగా ఈ అపార్ట్మెంట్ కల్చర్లో పక్క పోర్షన్లో ఎవరుంటున్నారో కూడా తెలుసుకోలేనంత బిజీ అయిపోయాం. ఎవరి గోలలో వారు, ఎవరి ప్రపంచంలో వారు ఉంటున్నారు తప్ప, సమాజం పట్ల బాధ్యత అన్నది మచ్చుకైనా కనిపించడం లేదు. పదిమందితో కలిసి నడవాలనే ఆలోచన పోయి, నా గొడుగు నాదే అనే స్వార్థం పెరిగిపోయింది. ఇక నీతి నిజాయితీల గురించి ఎంత తక్కువ మాట్లాడుకుంటే అంత మంచిది.**

అతన్ని తెలివైన వాడిగా చూస్తున్నారు. నిజాయితీగా బతికే వాళ్లను అమాయకులని, చేతగాని వాళ్లని నవ్వుతున్నారు. చట్టాన్ని ఉల్లంఘించడం, పన్నులు ఎగ్గొట్టడం కూడా గొప్పగా చెప్పుకునే స్థితికి వచ్చాం. చివరికి న్యాయం కూడా డబ్బున్న వాడికే దాసోహం అంటోంది. ఇక కార్పొరేట్ కంపెనీల సంగతి చెప్పక్కర్లేదు.. లాభం ఒక్కటే వాళ్ల పరమావధి. పర్యావరణం పాడైతే వాళ్లకేం? కార్మికుల కష్టం పోతే వాళ్లకేం? నాణ్యత లేని వస్తువులు, నకిలీ ప్రొడక్టులతో జనాన్ని నిలువునా ముంచుతున్నారు. యువత పరిస్థితి మరీ దారుణం. చదువు పూర్తికాగానే మంచి ఉద్యోగం రాకపోయినా, అనుకున్నంత సంపాదన లేకపోయినా తీవ్రమైన నిరాశ లోకి వెళ్లిపోతున్నారు. ఒకప్పుడు బాధల్లో ఉన్నప్పుడు ఓదార్చే మనుషులు ఉండేవారు, కానీ ఇప్పుడు ఆ సామాజిక మద్దతు కరువైంది. దాంతో ఎవరికీ చెప్పుకోలేక లోలోపలే మదనపడుతున్నారు. పోనీ ఇంట్లో వాళ్లకైనా చెప్పుకుందామంటే చాలా కుటుంబాల్లో మానసిక సమస్యలను ఒక సీరియస్ విషయంగానే గుర్తించడం లేదు, అది ఇంకా ప్రమాదకరంగా మారుతోంది డబ్బు సంపాదించాలనే పిచ్చి మన పర్యావరణాన్ని కూడా వదలడం లేదు. కేవలం లాభాల కోసం ప్రకృతిని అడ్డగోలుగా దోచుకుంటున్నారు. అడవులను నరికేసి కలపను అమ్ముకుంటున్నారు, పట్టణాలు, నగరాలు మురికినీరు ను వదలి, చెరువులను,నదులను విషతుల్యం చేస్తున్నారు. పెరిగిన వాహనాల వల్ల మనం పీల్చే గాలి, తాగే నీరు, అన్నీ కలుషితమైపోతున్నాయి. రేపటి తరం పిల్లలకు మనం ఒక ఆరోగ్యకరమైన లోకాన్ని ఇవ్వాలనే కనీస బాధ్యతను కూడా మర్చిపోతున్నాం. మరోపక్క, ఈ డబ్బు పిచ్చే సమాజంలో నేరాలు పెరగడానికి కారణమవుతోంది. అవసరాల కోసం కొందరు దొంగతనాలకు పాల్పడుతుంటే, మరికొందరు తెలివిగా వేల కోట్లు కొల్లగొట్టే వైట్ కాలర్ నేరాలకు తెరతీస్తున్నారు. బ్యాంక్ మోసాలు, సైబర్ క్రైమ్స్, ఆన్లైన్ దందాలు ఊహించని విధంగా పెరిగిపోయాయి. ఈజీగా డబ్బు సంపాదించాలనే ఈ అలవాటు నేటి యువతను తప్పుడు దారిలోకి లాగుతోంది, ఈ సమస్యలన్నింటికీ పరిష్కారం ఉందా ? అంటే కచ్చితంగా కానీ, ఈ సమస్యలన్నింటికీ రాత్రికి రాత్రే పరిష్కారం దొరకకపోవచ్చు. కానీ, మనమంతా కలిసి అడుగులు వేస్తే పరిస్థితిని కచ్చితంగా మార్చవచ్చు. అందుకు మనం చేయాల్సింది ఇలా చదువులో మార్పు చేయాలి విద్య అంటే కేవలం పుస్తకాల్లోని పాఠాలు మాత్రమే కాదు. పిల్లలకు చిన్నప్పటి నుంచే నీతి నిజాయితీలను, ఎదుటివారి పట్ల జాలి చూపడాన్ని నేర్పించాలి. మనిషిగా ఎలా బతకాలో నేర్పే చదువు మనకు కావాలి. కుటుంబమే పునాది చాల అవసరం తల్లిదండ్రులు ఎంత బిజీగా ఉన్నా పిల్లల కోసం సమయం కేటాయించాలి. వారితో కలిసి సరదాగా గడుపుతూనే, మన సంప్రదాయాలను, కుటుంబ బంధాల విలువను వివరించాలి. పెద్దలను గౌరవించడం అనేది ఇంట్లోనే మొదలవ్వాలి. అలానే మీడియా బాధ్యత గా టీవీలు, సోషల్ మీడియా కేవలం డబ్బు, హోదా మాత్రమే గొప్ప అని చూపించకుండా, సమాజం కోసం పాటుపడే వ్యక్తులను, నిజాయితీగా బతికే మనుషులను హీరోలుగా చూపించాలి. కఠినమైన చట్టాలు అమలు చేయాలి అవినీతికి పాల్పడే వారికి, అక్రమంగా డబ్బు సంపాదించే వారికి చట్టం అంటే భయం ఉండాలి. తప్పు చేసిన వారికి శిక్ష త్వరగా పడేలా న్యాయవ్యవస్థలో మార్పులు రావాలి. సుఖాల కోసం పాకులాడకుండా, మనశ్శాంతిని వెతుక్కునే అలవాటు చేసుకోవాలి. డబ్బు అవసరమే, కానీ అది జీవితం కాకూడదు. విలువలని కాపాడుకుంటూనే మనం ముందుకు సాగాలి." మనం ఒక విషయం బాగా గుర్తుంచుకోవాలి.. డబ్బు అనేది కేవలం బతకడానికి అవసరమైన ఒక సాధనం మాత్రమే, అది మన జీవితానికి అంతిమ లక్ష్యం కాకూడదు. విలువలు, మనిషితనం లేని బతుకు అర్థం లేనిది. డబ్బుతో తాత్కాలికంగా సుఖపడొచ్చు కానీ, మనశ్శాంతిని మాత్రం కొనుక్కోలేం. మన పెద్దలు విలువలకి ఎంత ప్రాధాన్యత ఇచ్చారో ఒకసారి ఆలోచించాలి. మనం ఆర్థికంగా ఎదగాలి, అది చాలా అవసరం, కానీ ఆ ఎదుగుదల మన వ్యక్తిత్వాన్ని దిగజార్చేలా ఉండకూడదు. జీవితంలో సంపాదనతో పాటు నీతి నిజాయితీలకు కూడా చోటు ఇవ్వాలి. అప్పుడే మన బతుక్కి ఒక బ్యాలెన్స్ ఉంటుంది. డబ్బు ఒక్కటే సర్వం కాదు అనే నిజాన్ని మనందరం ఒప్పుకోవాలి. ప్రతి ఒక్కరం మన స్థాయిలో మనం మారి, ఆ మార్పును మన పిల్లలకి కూడా నేర్పించాలి. ప్రేమ, జాలి, సాయం చేసే గుణం.. ఇవే మనల్ని మనుషులుగా నిలబెడతాయి. సమాజాన్ని మార్చడం అనేది మన చేతుల్లోనే ఉంది. డబ్బున్న లోకంలో బతుకుతూనే మన సంస్కారాన్ని కాపాడుకోవడం సాధ్యమే, దానికి కావలసిందల్లా మన గట్టి నిర్ణయం మాత్రమే. మన తర్వాత వచ్చే తరానికి కేవలం ఆస్తులు మాత్రమే కాదు, అంతకంటే గొప్పవైన విలువలను కూడా వారసత్వంగా ఇద్దాం. ఆ దిశగా మనందరం కలిసి అడుగులు వేద్దాం.

డిజిటల్ ఆర్థిక వ్యవస్థను సాధ్యం చేసిన భారత్

- ప్రశంసలు కురిపించిన ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: భారత దేశంలో డిజిటల్ టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ పురోగతిపై ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ప్రశంసలు కురిపించారు. 140 కోట్ల ప్రజలకు భారత్ డిజిటల్ ఐడెంటిటీని తీసుకువచ్చిందని అన్నారు. 10 ఏళ్ల క్రితం ముంబయిలోని ఒక చిల్లర దుకాణదారుడు బ్యాంకు ఖాతా తెరవలేకపోయాడని, ఇప్పుడు అదే వ్యక్తి, తన ఫోన్‌లో డిజిటల్ చెల్లింపులను చేస్తున్నాడని వివరించారు. ఇది సాంకేతికత కథ కాదని, నాగరికత కథ అని వ్యాఖ్యానించారు. ఈ కొత్త టెక్నాలజీని స్వీకరించడంలో భారత్ వేగవంతమైన పురోగతిని సాధించిందని కొనియాడారు. గురువారం ఢిల్లీలో జరుగుతున్న ఏఐ శిఖరాగ్ర సమావేశంలో ఈ మేరకు ప్రసంగించారు. ఆవిష్కరణల పథంలో అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఏఐ మానవాళి వేగవంతమైన ఆవిష్కరణలకు ప్రధాన సాధనమని మెక్రాన్ అన్నారు. గత ఏడాది ఫ్రాన్స్, భారత్ కలిసి పారిస్‌లో ఏఐ యాక్షన్ సమ్మిట్‌ను సంయుక్తంగా నిర్వహించాయి. ఏఐను మానవాళి శ్రేయస్సుకు ఉపయోగించాలనే గ్లోబల్ మార్గదర్శక సూత్రాను ప్రతిపాదించా. ఆరోగ్యం, ఇంధనం, రవాణా, వ్యవసాయం, ప్రజా సేవలు వంటి రంగాల్లో మానవ సంక్షేమం కోసం విప్లవాత్మక మార్పులను ఏఐ తీసుకురాగలదు. ఈ విప్లవంపై మేం విశ్వాసం ఉంచుతున్నాం. ప్రస్తుతం ఏఐ వ్యూహాత్మక పోటీలో ప్రధాన రంగంగా మారింది. భారీ టెక్ సంస్థలు మరింత శక్తివంతమయ్యాయి' అని ఫ్రాన్స్ అధ్యక్షుడు తెలిపారు. భారత్ సార్వభౌమ నిర్ణయంతో స్మాల్ లాంగ్వేజ్ మోడల్స్(ఎస్ఎంఎల్) వైపు దృష్టిసారించిందని మెక్రాన్ అన్నారు. ఒక సంవత్సరం క్రితం భారత్ ఎస్ఎంఎల్ నమూనాలను చేసింది. స్మార్ట్ ఫోన్స్‌లో టాస్క్ స్పెసిఫిక్ అమలు చేయడానికి రూపొందించింది. ప్రభుత్వం నిధులతో అభివృద్ధి చేసిన తొలి ఏఐ వ్యవస్థను భారత్ నిర్మించింది. దేశంలోని ప్రతి స్టార్టప్‌కు అత్యల్ప ధరలకు 38,000 జీపీయూలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏఐ, జీపీయూ, చిప్‌లు ఇప్పుడు నేరుగా భౌగోళిక రాజకీయాలు, స్థూల ఆర్థిక వ్యవస్థలపై ప్రభావం చూపుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మంచికి, కొన్ని సందర్భాల్లో చెడుకూ దారితీస్తాయి' అని మెక్రాన్ తెలిపారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థ తీసుకురావడంలో భారత్ సాధ్యం చేసి చూపించిందని మెక్రాన్ పేర్కొన్నారు.

విమాన సర్వీసులకు అంతరాయం

- నెవిటేర్ వ్యవస్థలో సాంకేతిక లోపమే కారణం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: నెవిటేర్ వ్యవస్థలో సాంకేతిక లోపం కారణంగా యూరప్ తోపాటు ఢిల్లీ, ముంబై సహా దేశంలోని ఎయిర్‌పోర్టుల లో విమాన సర్వీసులకు అంతరాయం ఏర్పడింది. దాంతో వేలమంది ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. నెవిటేర్ వ్యవస్థలో దాదాపుగా 45 నిమిషాలపాటు సాంకేతిక లోపం తలెత్తడంతో ఈ పరిస్థితి నెలకొంది. దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం ఉదయం 6.45 గంటల సమయంలో ఈ సాంకేతిక సమస్య తలెత్తింది. బుకింగ్, చెక్‌ఇన్ కోసం ఎయిర్‌లైన్ సంస్థలు ఉపయోగించే నెవిటేర్ వ్యవస్థలో ఈ సమస్యను గుర్తించారు. గంటలోపే దానిని పరిష్కరించారు. కానీ ఈ సమయంలో సిబ్బంది బుకింగ్, చెక్‌ఇన్‌లను మాన్యువల్‌గా నిర్వహించాల్సి వచ్చింది. దాంతో రద్దీ భారీగా పెరిగింది. ముంబయిలోనూ ఇదే పరిస్థితి కనిపించింది. ఈ సాంకేతిక లోపం కారణంగా ఇండిగో, ఆకాశ ఎయిర్, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సర్వీసులపై ప్రభావం పడింది. రిజర్వేషన్లు, చెక్‌ఇన్, బోర్డింగ్ కోసం కీలకమైన ఎయిర్‌లైన్ టెక్నాలజీని నెవిటేర్ అందిస్తోంది. అది విఫలమైతే ప్యాసింజర్ వివరాలను ప్రాసెస్ చేయడంలో అంతరాయం ఏర్పడుతుంది. ఇది జాప్యాలు, రద్దీకి దారితీస్తుంది. కాగా గత నవంబర్‌లో ఢిల్లీలోని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ సిస్టమ్‌లో సాంకేతిక సమస్య కారణంగా 800కు పైగా విమానాలు ఆలస్యమయ్యాయి. దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే ఢిల్లీ విమానాశ్రయం రోజుకు 1500 విమాన సర్వీసుల్ని నిర్వహిస్తోంది. ముంబై విమానాశ్రయం నిర్వహించే సర్వీసుల సంఖ్య 1000గా ఉంది.

అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లను

- సుప్రీం కోర్టుకు తెలిపిన అనిల్ అంబానీ

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 19: ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని రిలయన్స్ గ్రూప్ ఛైర్మన్ అనిల్ అంబానీ గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేశారు. రూ.40 వేల కోట్ల మోసం కేసుల్లో అనిల్ ధీరూభాయ్ అంబానీ గ్రూప్ ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అనిల్ అంబానీ విదేశాలకు పారిపోయే అవకాశాలు ఉన్నాయని, బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసుల్లో సత్వర, నిష్పాక్షిక దర్యాప్తు జరిగేలా చూడాలని కోరుతూ మాజీ అధికారి ఈఏఎస్ శర్మ సుప్రీం కోర్టులో పిల్ దాఖలు చేశారు.ఈ పిల్‌కు ప్రతిస్పందనగా అనిల్ అంబానీ అఫిడవిట్ దాఖలు చేశారు. ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లనని స్పష్టం చేశారు. రూ.40 వేల కోట్ల బ్యాంకింగ్, కార్పొరేట్ మోసం కేసుల్లో దర్యాప్తునకు పూర్తిగా సహకరిస్తానని తెలిపారు. 'ఈ కేసుల్లో దర్యాప్తు మొదలైనప్పటి నుంచి నేను దేశం విడిచి వెళ్లలేదు. ఇప్పటికైతే విదేశాలకు వెళ్లే ఉద్దేశం, ప్లాన్స్ లేవు. ఒకవేళ విదేశీ ప్రయాణాలు చేయాల్సి వస్తే కోర్టు నుంచి ముందస్తుగా అనుమతులు తీసుకుంటాను. సంబంధిత కేసుల దర్యాప్తులో ఏజెన్సీలకు పూర్తిగా సహకరిస్తున్నాను. భవిష్యత్తులో కూడా ఇలాగే సహకరిస్తాను' అని అనిల్ అంబానీ తెలిపారు. చట్ట ప్రక్రియ నుంచి తప్పించుకునే ఉద్దేశం ఏదీ తనకు లేదని, తాను అలాంటి వ్యక్తిని కాదని అనిల్ అంబానీ తెలిపారు. అక్రమ నగదు బదిలీ కేసులో ఫిబ్రవరి 26వ తేదీన విచారణకు హాజరు కావాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సమన్లు జారీ చేసిందని, తాను ఆ విచారణకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని పేర్కొన్నారు. ఈ కేసుల దర్యాప్తులో జాప్యంపై సుప్రీం కోర్టు ఈ నెల 4వ తేదీన అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. దర్యాప్తు ముమ్మరం చేయాలని సీబీఐ, ఈడీలను ఆదేశించింది.



హర్మన్.. నంబర్ వన్

- **అత్యధిక మ్యాచ్ లు ఆడిన వుమెనిండియా కెప్టెన్**

వన్డే వరల్డ్ కప్ విజయంతో భారత మహిళా క్రికెట్ సుదీర్ఘ కలను సాకారం చేసిన హర్మన్‌ప్రీత్ కౌర్ కొత్త ఏడాదిలో చరిత్ర సృష్టించింది. టీమిండియాకు తొలి ఐసీసీ ట్రోఫీ అందించిన సారథిగా అప్పుడు రికార్డు నెలకొల్పిన తను.. ఈసారి దిగ్గజాలకు సాధ్యమవ్వని ఘనత సొంతం చేసుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళగా హర్మన్‌ప్రీత్ అవతరించింది. ఆస్ట్రేలియా గడ్డపై గురువారం రెండో టీ20లో ఆడడం ద్వారా హర్మన్‌ప్రీత్ ఈ ఫీట్ సాధించింది. దూకుడైన ఆటతో భారత జట్టులో కీలక బ్యాటర్‌గా ఎదిగిన హర్మన్‌ప్రీత్ కౌర్ తన పేరిట పలు రికార్డులు రాసుకుంటోంది. సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ..టీమిండియాను విశ్వవిజేతగా నిలిపిన హర్మన్‌ప్రీత్.. అత్యధిక మ్యాచ్‌లు ఆడేసింది. అంతర్జాతీయ క్రికెట్ లో న్యూజిలాండ్ సీనియర్ బ్యాటర్ సుజీ బేట్స్ రికార్డును బ్రేక్ చేస్తూ... 356వ మ్యాచ్‌లో ఆడింది భారత కెప్టెన్. చిన్నప్పటి నుంచి క్రికెట్టే ధ్యాసగా పెరిగిన ఈ పంజాబీ కెరటం 2009లో అరంగేట్రం చేసింది. అనతికాలంలోనే మూడు ఫార్మాట్లలోనూ పాతుకుపోయింది. ఇండియా తరఫున మిథాలీ రాజ్‌ను ఎప్పుడో అధిగమించిన హర్మన్‌ప్రీత్.. ఆస్ట్రేలియా గడ్డపై బేట్స్‌ను వెనక్కి నెట్టేసింది. ఇప్పటివరకూ ఆరు టెస్టులు, 161 వన్డేలు, 189 టీ20లు ఆడింది. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన మహిళా క్రికెటర్ల జాబితాలో ఎలీసా పెర్రీ (ఆస్ట్రేలియా) 349, మిథాలీ రాజ్ (భారత్) 333, చార్లొట్టే ఎడ్వర్డ్స్ (ఇంగ్లండ్) 309, సోఫీ డెవిన్ (న్యూజిలాండ్) 305 మ్యాచ్‌లతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు.

శ్రీలంకను చిత్తు చేసిన జింబాబ్వే

ప్రపంచకప్‌లో అద్భుత విజయాలతో వార్తల్లో నిలుస్తోంది జింబాబ్వే. రెండో లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 పరుగుల విజయంతో అందర్నీ ఆశ్చర్యపరిచిన ఆఫ్రికా జట్టు.. చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంకపై పంచ్ విసిరింది. ఆల్‌రౌండ్ షోతో ఆతిథ్య జట్టును కట్టడి చేసిన జింబాబ్వే.. ఛేదనలోనూ దుమ్మురేపింది. ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ (63 నాటౌట్), మరుమణి(34)లు లంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొని.. శుభారంభమిచ్చారు. దూకుడే మంత్రగా చెలరేగిన ఈ జోడీ పవర్ ప్లేలోనే 54 రన్స్ పిండుకుంది. ఎట్టకేలకు ఈ ద్వయాన్ని వెల్లలాగే విడదీసినా.. సికిందర్ రజా(45) వస్తూనే తుఫాన్‌లా ముంచెత్తాడు. ఎదుర్కొన్నది 26 బంతులే అయినా.. ఎడాపెడా బౌండరీలు బాదిన రజా.. లంక నుంచి మ్యాచ్‌ను లాగేసుకున్నాడు. అతడి విధ్వంసానికి హేమంత తెరదించగా.. ముసెకీవా(1) గాల్లోకి లేపిన బంతిని శనక డైవ్ చేస్తూ అద్భుతంగా అందుకున్నాడు. నాలుగో వికెట్ పడినా అప్పటికి జింబాబ్వే విజయానికి 10 రన్స్ కావాలి. మున్యోంగా(8 నాటౌట్).. చివరిబంతికి సింగిల్ తీశాడు. చివరి ఓవర్లో 8 రన్స్ కొట్టాల్సిరాగా.. తీక్షణ వేసిన తొలి బంతికి మున్యోంగ మిడ్‌వికెట్‌లో సిక్సర్ బాదేశాడు. రెండో బతికి సింగిల్.. విక్టరీ రన్ కొట్టాడు. అంతే.. వికెట్ల 6 తేడాతో జింబాబ్వే జయభేరి మోగించింది. చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీలంక ఓపెనర్ పథుమ్ నిశాంక(62) అర్ధ శతకంతో చెలరేగాడు. వేదికగా జింబాబ్వే బౌలర్లను ఉతికేస్తూ అర్ధ శతకంతో కదం తొక్కాడు. బ్లెస్సింగ్ ముజరబని(238), ఎవాన్స్(235) మిడిల్ ఓవర్లలో వికెట్ల వేటతో పరుగులు కట్టడి చేసినా.. పవన్ రత్ననాయకే(44) మెరుపు ఇన్నింగ్స్ ఆడడాడు. చివరి ఓవర్లో దునిత్ వెల్లలాగే(15 నాటౌట్) మూడు బౌండరీ బాదగా శ్రీలంక 178 స్కోర్ చేసింది.

అఫ్గనిస్థాన్.. విజయంతో వీడ్కోలు

టీ20 ప్రపంచకప్ టోర్నీకి అఫ్గనిస్థాన్ విజయంతో వీడ్కోలు పలికింది. చివరి లీగ్ మ్యాచ్‌లో కెనడాపై కాబూలీ టీమ్ భారీ విజయం సాధించింది. ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్(95) అర్ధ శతకంతో చెలరేగగా.. మొహమ్మద్ నబీ(47) బంతితో తిప్పేశాడు. పవర్ ప్లేలోనే మూడు ప్రధాన వికెట్లు కోల్పోయిన కెనడా ఓటమిని తప్పించుకోలేకపోయింది. హర్ష్ థాకరే(30), సాద్ బన్ జఫర్(28)లు ధనాధన్ ఆడి పరుగుల అంతరం తగ్గించారు. ప్రత్యర్థిని 118కే కట్టడి చేసిన రషీద్ సేన 82 రన్స్ తేడాతో విజయదుందుభి మోగించింది. గత సీజన్‌లో సెమీస్ ఆడిన అఫ్గనిస్థాన్ ఓదార్పు విజయంతో ఈసారి టోర్నీ నుంచి నిష్క్రమించింది. వరుసగా రెండు ఓటములతో సూపర్ 8 అవకాశం చేజార్చుకున్న కాబూలీ టీమ్.. వరుసగా రెండు విజయాలతో వరల్డ్‌కప్‌ను ముగించింది. గురువారం చెన్నైలోని చిదంబరం స్టేడియంలో ఓపెనర్ ఇబ్రహీం జద్రాన్(95) ఆకాశమే హద్దుగా చెలరేగగా.. సెదీకుల్లా అటల్(44) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కొండంత ఛేదనలో కెనడా ఆరంభంలోనే తడబడింది. భారీ ఛేదనలో అఫ్గన్ బౌలర్ల ధాటికి 33కే మూడు ప్రధాన వికెట్లు కోల్పోయిన ఆ జట్టును ఆదుకునేందుకు ఒక్కరూ నిలబడలేదు. న్యూజిలాండ్‌పై సెంచరీతో విరుచుకుపడిన ఓపెనర్ యువరాజ్ సమ్రా(17) నిరాశపరచగా.. మొహమ్మద్ నబీ(47) స్పిన్‌తో పడగొట్టాడు. ప్రధాన బ్యాటర్లు విఫలమవ్వడంతో 48కే ఐదు వికెట్లు పడిన వేళ హర్ష్ థాకరే(30), సాద్ బిన్ జఫర్(28)లు బ్యాట్ ఝులిపించి స్కోర్ వంద దాటించారు. అఫ్గన్ స్పిన్నర్లు బాగా కట్టడి చేయడంతో కెనడా 8 వికెట్ల నష్టానికి 118 పరుగులు చేసిందంతే.

రెండో టీ20లో ఇండియా ఓటమి

ఆస్ట్రేలియా పర్యటనలో రెండో టీ20లో భారత్ మహిళల జట్టుకు ఓటమి ఎదురైంది. మూడు టీ20ల సిరీస్‌లో భాగంగా కాన్‌బెర్రా వేదికగా గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 19 పరుగుల తేడాతో విజయం సాధించింది. 164 పరుగుల ఛేదనలో టీమ్‌ఇండియా ఓవర్లన్నీ ఆడి 9 వికెట్లు కోల్పోయి 144 పరుగులే చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (36 పరుగులు) టాప్ స్కోరర్. ఆసీస్ బౌలర్లలో అష్లీ గార్డ్‌నర్ 3, కిమ్ గార్త్, అనబెల్ సుదర్లాండ్, సోఫీ తలో 2 వికెట్లు దక్కించుకున్నారు. ఛేదనను భారత్ ఘనంగానే ఆరంభించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ (29 పరుగులు, 23 బంతుల్లో), స్మృతి మంధాన (31 పరుగులు, 24 బంతుల్లో) మంచి ఆరంభమే ఇచ్చారు. తొలి వికెట్‌కు ఈ ఇద్దరూ 50 పరుగులు జోడించారు. అయితే 6.4 వద్ద షఫాలీని సోఫీ ఔట్ చేసి ఆసీస్‌కు బ్రేక్ ఇచ్చింది. ఆ తర్వాత కాసేపటికే జెమిమా రోడ్రిగ్స్ (4 పరుగులు) స్వల్ప స్కోర్‌కే పెవిలియన్ చేరింది. 10వ ఓవర్లో స్మృతి కూడా ఔట్ కావడంతో భారత్ సమం ఇన్నింగ్స్ ముగిసేలోపు 71 పరుగులకే మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో కెప్టెన్ హర్మన్ బాధ్యతగా ఆడింది. రిచా ఘోష్ (19 పరుగులు) తో కలిసి భాగస్వామ్యం నిర్మించే ప్రయత్నం చేసింది. ఈ ఇద్దరు మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుతూ జట్టును విజయం దిశగా నడిపించారు. దీంతో 16 ఓవర్లు ముగిసే సరికి టీమ్‌ఇండియా 1233 తో నిలిచింది. హర్మన్, రిచా ఉండడంతో భారత్ విజయంపై ధీమాగా ఉంది. అప్పటికి భారత్ విజయానికి 4 ఓవర్లలో 44 పరుగులు కావాలి. తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 163 పరుగులు చేసింది. ఓపెనర్ జార్జియా వోల్ (88 పరుగులు) సూపర్ హాఫ్ సెంచరీతో మెరిసింది. బెత్ మూనీ (46 పరుగులు) రాణించింది. టీమ్‌ఇండియా బౌలర్లలో అరుంధతి రెడ్డి 2, రేణుకా సింగ్ ఠాకూర్ 1 వికెట్ పడగొట్టారు. తాజా విజయంతో మూడు టీ20ల సిరీస్‌ను ఆసీస్ 1 1తో సమం చేసింది.

విశ్వక్‌సేన్ #CULT

పవర్ ఫుల్ ఫస్ట్ లుక్ రిలీజ్

మాస్ కా దాస్ విశ్వక్‌సేన్ మరోసారి బౌండరీస్ ని దాటి ఎక్సయిటింగ్ ప్రాజెక్ట్‌తో వస్తున్నారు. ఫలక్‌నుమా దాస్, దాస్ కా ధమ్కీ వంటి చిత్రాలతో హీరో, దర్శకుడు, నిర్మాత, రచయితగా ఆకట్టుకున్న విశ్వక్సేన్ ఇప్పుడు తన స్వీయ రచన, దర్శకత్వంలో #CULT తో రాబోతున్నారు. తారక్ సినిమాస్ బ్యానర్ పై సందీప్ కాకరాల ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారతదేశంలో తొలి స్లాషర్ ఫిల్మ్‌గా రూపొందుతున్న ఈ సినిమా టాలీవుడ్‌లో ఇప్పటివరకు చూడని కొత్త ప్రయత్నంగా నిలవనుంది. ఈరోజు, మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఫస్ట్ లుక్ పోస్టర్‌లో విశ్వక్‌సేన్ సూట్ ధరించి, నోట్లో సిగరెట్ తో ముందుకు నడుస్తూ కనిపిస్తున్నారు. అతని చేతిలో రక్తంతో తడిసిన గొడ్డలి ఉండగా, అతడు వేసే ప్రతి అడుగుతో రక్తం వ్యాపిస్తూ పోస్టర్‌కు డార్క్ టోన్‌ను తీసుకొచ్చింది. ఈ పోస్టర్ మొత్తం చూస్తే వైలెంట్, స్టైలిష్, బోల్డ్ అనుభూతిని కలిగిస్తూ డిఫరెంట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందిస్తోంది. ఈ చిత్ర టీజర్‌ను ఫిబ్రవరి 21న విడుదల చేయనున్నారు. #CULTతో విశ్వక్‌సేన్ మరో పెద్ద అడుగు వేస్తూ 40 మంది కొత్త నటీనటులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తున్నాడు.గాయత్రి భరద్వాజ్, తారక్ పొన్నప్ప, మురళీ శర్మ, శ్రీకాంత్ అయ్యంగర్, కార్తికేయ, అనిరుధ్ భాస్కర్, EZY, యజ్ఞ తుర్లపాటి, కబీర్ భారతీయ, విశాక్ నాయర్, చేపూరి వివేక్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పని చేస్తోంది. తరుణ్ భాస్కర్ డైలాగ్స్ రాస్తుండగా, రవి బస్రూర్ మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీకి అర్వింద్ విశ్వనాథన్, ఎడిటర్ రవితేజ గిరిజాల, ప్రొడక్షన్ డిజైన్‌కు అర్వింద్ ములే. ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని #CULTను తెలుగు, హిందీ, జపనీస్, స్పానిష్, ఇంగ్లీష్ భాషల్లో మల్టీలింగ్వల్‌గా విడుదల చేయనున్నారు.

రాకింగ్ స్టార్ యశ్.. 'టాక్సిక్'

నేడు టీజర్ రిలీజ్

రాకింగ్ స్టార్ యశ్ నటించిన 'టాక్సిక్ : ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' నుంచి మేకర్స్ న్యూ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ సినిమా టీజర్‌ను ఫిబ్రవరి 20న ఉదయం 9:35 గంటలకు విడుదల చేస్తామని టీం ప్రకటించింది. ఈ మేరకు రిలీజ్ చేసిన న్యూ పోస్టర్ అందరిలోనూ అంచనాల్ని పెంచేసింది. ఇందులో రాయ పాత్రలో యశ్ రక్తాన్ని ఏరులై పారించినట్టుగా కనిపిస్తోంది. మంచు ప్రాంతమైనా కూడా ఎర్రని రక్తంతో నిండిపోయింది. ఇక అలా రక్తపాతాన్ని సృష్టించిన అనంతరం యశ్ మత్తులో మునిగేందుకు మందు తాగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ ఏడాది జాతీయ, అంతర్జాతీయంగా సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోన్న చిత్రాల్లో 'టాక్సిక్' ఒకటిగా నిలిచింది. ఒక్కో కారెక్టర్, పాత్రకు సంబంధించిన సంబంధించిన లుక్‌ను రివీల్ చేస్తూ వదిలిన పోస్టర్లు ఎంతటి సంచలనాన్ని క్రియేట్ చేశాయో అందరికీ తెలిసిందే. 'టాక్సిక్' వరల్డ్‌ని పరిచయం చేసేలా యశ్ బర్త్ డే సందర్భంగా వదిలిన గ్లింప్స్ ఒక్కసారిగా అంచనాల్ని రెట్టింపు చేసింది. ఇక ఈ మూవీ నుంచి మరి కొంత కథను రివీల్ చేసేలా టీజర్‌ను కట్ చేశారు. ఈ టీజర్‌ను ఫిబ్రవరి 20న రిలీజ్ చేయబోతోన్నారు. కథ, కథనం ప్రభావం అన్ని భాషల్లో ఒకేలా ఉండేందుకు టీజర్‌ను ఒకే భాషలో విడుదల చేస్తారట. ఇది సినిమాలో స్పష్టమైన చిత్రాలను, వాతావరణాన్ని, ఆ ప్రపంచాన్ని ప్రేక్షకులకు తెలియజేస్తుంది. 'టాక్సిక్' సినిమాలో కియారా అద్వానీ నదియాగా, హుమా ఖురేషి ఎలిజబెత్‌గా, నయనతార గంగగా, తారా సుతారియా రెబెక్కాగా, రుక్మిణి వసంత్ మెల్లిసాగా అద్భుతమైన పాత్రల్లో కనిపించనున్నారు. చివరగా రాయ పాత్రలో యశ్‌ను చూపించిన తీరు, వదిలిన పోస్టర్ ఫ్యాన్స్‌కి కిక్కిచ్చింది. యశ్, గీతు మోహన్‌దాస్ సంయుక్తంగా రాసిన ఈ కథని గీతు మోహన్‌దాస్ తెరపైకి తీసుకు వచ్చారు. 'టాక్సిక్:ఎ ఫెయిరీటేల్ ఫర్ గ్రోన్‌అప్స్' కన్నడ, ఇంగ్లీష్ భాషలలో ఏకకాలంలో చిత్రీకరించారు. ఇక ఈ మూవీని హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, అనేక ఇతర భాషలలో డబ్ చేయనున్నారు.

'లిటిల్‌హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి', 'ఈషా' వంటి బ్లాక్‌బస్టర్స్ చిత్రాలను అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటిల సక్సెస్‌ఫుల్ ద్వయం తాజాగా నందిపాటి ఎంటర్ టైన్‌మెంట్స్, బన్నీవాస్ వర్క్స్ బ్యానర్స్ పై 'హే బల్‌వంత్' అనే ఫుల్‌లెంగ్త్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతోన్నారు. ఈ మూవీలో సుహాస్, శివానీ నగరం, సీనియర్ నటుడు నరేష్, యాంకర్ స్రవంతి ప్రముఖ పాత్రల్ని పోషించారు. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి. నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ మూవీని ఫిబ్రవరి 20న రిలీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో చిత్రయూనిట్ రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించారు.

'బూకి' యూత్ తో పాటు ఫ్యామిలీకి కనెక్ట్ అయ్యే సినిమా

నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ

అజయ్ దిషన్, ధనుషా హీరో హీరోయిన్స్ గా గణేష్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన యూత్ ఫుల్ ఎంటర్టైనర్ 'బూకి'. విజయ్ ఆంటోనీ సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్స్ పై రామాంజనేయులు జవ్వాజీ నిర్మించారు. సునీల్, లక్ష్మి మంచు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే తమిల్ లో విడుదలైన ఈ చిత్రం బ్లాక్ బస్టర్ రెస్పాన్స్ ని అందుకుంది. తెలుగులో ఈ సినిమా ఫిబ్రవరి 20న గ్రాండ్ గా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాత రామాంజనేయులు జవ్వాజీ విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు.

ఈ సినిమా ఎలా ఉండబోతుంది?

ప్రతి లవ్ స్టోరీ లో కథ ప్రేమతోనే మొదలవుతుంది. కానీ ఈ కథ మాత్రం బ్రేకప్ తో మొదలవుతుంది. బ్రేకప్ తర్వాత ఇప్పటి టీనేజర్స్ ఎలా సఫర్ అవుతున్నారు? ఎలాంటి డిప్రెషన్ కి వెళ్తున్నారు? ఆ బాధను ఎలా హ్యాండిల్ చేస్తున్నారు? అనేది ఈ సినిమాలో ఆసక్తికరంగా చూపించడం జరిగింది. పేరెంట్స్ కి కూడా ఇది చాలా మంచి మెసేజ్ లాగా ఉంటుంది. ఇప్పుడు జనరేషన్ ఎంత స్పీడ్ గా ప్రేమలో కి వెళ్తున్నారో అంత స్పీడ్ గా విడిపోతున్నారు. అప్పుడు ఎదురయ్యే బాధ ఎలా ఉంటుంది? వాళ్ళని సరిగ్గా గమనించి మళ్లీ రైట్ ట్రాక్ లోకి ఎలా తీసుకురావాలనేది చాలా ఇంట్రెస్టింగ్ గా ఈ సినిమాలో చూపించడం జరిగింది.

తమిళ్ లో ఎలాంటి రెస్పాన్స్ వచ్చింది?

13న ఈ సినిమా తమిళ్లో రిలీజ్ చాలా అద్భుతంగా అద్భుతంగా వెళుతుంది. నిర్మాతలుగా చాలా హ్యాపీగా ఉన్నాం. సురేష్ ప్రొడక్షన్స్ ద్వారా తెలుగులో రిలీజ్ కావడం చాలా అనందంగా వుంది. దాదాపు 200కు పైగా స్క్రీన్స్ లో ఈ సినిమా రిలీజ్ కాబోతోంది.

విజయ్ ఆంటోనీతో అసోసియేషన్ గురించి?

2012లో నేను తమిళ్ లో బ్యాక్ టు బ్యాక్ డిస్ట్రిబ్యూషన్ చేస్తుండే వాడిని. ఆయన మ్యూజిక్ డైరెక్టర్ గా ఉండే సమయం నుంచి నాకు పరిచయం. ఫస్ట్ హీరోగా చేస్తున్నప్పుడు మా ఆఫీస్ కి వచ్చి హీరోగా పరిచయం అవుతున్నానని చెప్పారు. వారి ఫస్ట్ సినిమా కూడా మేము తెలుగులో రిలీజ్ చేయడం జరిగింది. ఆయనతో మళ్లీ రీకనెక్ట్ అయి మంచి సినిమాలు చేయాలని ప్లాన్ చేసాము. మార్గాన్, భద్రకాళి సినిమాలు చేశాం. ఇప్పుడు బూకి వస్తుంది. అలాగే వందదేవుళ్ళు సినిమా చేస్తున్నాము. అది కూడా మేలో రిలీజ్ అయ్యే అవకాశాలు ఉన్నాయి.

అజయ్ దిషన్ గురించి?

అజయ్ అద్భుతంగా నటించాడు. అలాగే హీరోయిన్ ధనుషా కూడా తమిళనాడులో సోషల్ మీడియాలో చాలా పాపులర్. తనను కూడా చాలా ఆకట్టుకుంటుంది. డైరెక్టర్ డీవోపీ కావడంతో సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. విజయ్ ఆంటోనీ గారి మ్యూజిక్ కూడా ఈ సినిమాకి చాలా పెద్ద ఎసెట్. ఈ నలుగురు ఈ సినిమాకి నాలుగు పిల్లర్స్. ఈ సినిమాని బైలింగ్వల్ తీశాము. తెలుగు సపోర్టింగ్ క్యారెక్టర్స్ లో మంచు లక్ష్మి, అలాగే సునీల్ పాత్రలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటాయి. సునీల్ గారి పాత్ర పవర్ ఫుల్ గా వుంటుంది. మంచు లక్ష్మి గారు డాక్టర్ గా కనిపిస్తారు. ఆ పాత్ర యూత్ కి బాగా కనెక్ట్ అవుతుంది. ఈ రెండు క్యారెక్టర్ సినిమా త్రూ అవుట్ వుంటాయి.



Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200